అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 1-10-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 270 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00

ఓట్ల కోసం పాట్లు..

ఎన్నికల వేళ సెటిలర్లకు బీఆర్ఎస్ గాలం

- ఎన్టీఆర్ జపం చేసిన కేటీఆర్
- చంద్రబాబు అరెస్టుపై స్పందించిన హరీశ్‌రావు
- స్వరం మార్చిన నేతలు
- విస్తుపోతున్న ప్రజలు

'ఆందోళనలు ఆంధ్రాలో చేసుకోండి హైదరాబాద్‌లో కాదు'...'చంద్రబాబు అరెస్టుతో బీఆర్ఎస్‌కేం సంబంధం ? దీనిపై మా పార్టీ నాయకులెవరైనా మాట్లాడితే అది కేవలం వారి వ్యక్తిగత వ్యవహారం'... ఇవి నిన్నటి మాటలు. 'మాకు రాముడైనా, కృష్ణుడైనా ఎన్టీఆరే... 'చంద్రబాబు అరెస్టు దురదృష్టకరం'...ఇవి ఈనాటి మాటలు. నిన్న అలా.. నేడు ఇలా... ఇంతలో ఎంతమార్పు..ఎందుకీ మార్పు? రోజుల వ్యవధిలోనే బీఆర్ఎస్ నేతల వైఖరిలో వచ్చిన మార్పు దేనికి సంకేతం..? ఏ పూటకు ఆ పాట పాడటమంటే ఇదే మరి. ఓట్ల కోసం ఎన్ని పాట్లో...

బి.వి.యన్.పద్మరాజు



ఏ ఎండాకాగొడుగు పట్టటమనేది రాజకీయ నాయకులకు తెలిసినంతంగా మరెవ్వరికీ తెలియదేమో. అందునా ఓటర్ల నాడిని, జనం మూడ్‌ను పసిగట్టటంలో అధికార బీఆర్ఎస్ నేతలు మహా దిట్టలు. అందుకే రానున్న శాసనసభ ఎన్నికల్లో సెటిలర్ల ఓట్లను మూటగట్టుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశం అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒకప్పుడు తెలుగుదేశంలో ఓ వెలుగు వెలిగి.. ఇప్పుడు బీఆర్ఎస్‌లో కీలక హోదాలు, పదవుల్లో ఉన్న నేతలు ఆయన అరెస్టును ఖండించిన సంగతీ విదితమే. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మంత్రులు ఎర్రబెల్లి దయాకరరావు, పువ్వాడ అజయకుమార్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, అరికెపూడి గాంధీ, కేపీ వివేకానంద తదితరులు చంద్రబాబు అరెస్టును ఖండించిన వారిలో ఉన్నారు. తాజాగా సిద్ధిపేటలో మంత్రి హరీశ్‌రావు...'ఈ వయసులో చంద్రబాబును అరెస్టు చేయటం మంచిదికాదు...' అంటూ వ్యాఖ్యానించారు.

కానీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఇందుకు భిన్నంగా స్పందించి వార్తల్లో నిలిచారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఇటీవల హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగులు ఆందోళనలు చేపట్టగా ఆయన వారిపై తీవ్ర ఆగ్రహాన్ని, అసహనాన్ని వ్యక్తం చేశారు. 'చంద్రబాబుకు సంబంధించిన నిరసనలు ఏమైనా ఉంటే ఆంధ్రాలో చేసుకోండి... ఇక్కడ శాంతి భద్రతలకు విఘాతం కలిగించకండి...' అంటూ సీరియస్ అయ్యారు. సంబంధిత నిరసనలకు ప్రభుత్వం అనుమతిని కూడా నిరాకరించింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇది సెటిలర్లకూ ఆగ్రహాన్ని తెప్పించింది. వారి ఓట్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని పార్టీ అధినేత దృష్టికి తీసుకుపోయారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట, కొత్తగూడెం, సత్తుపల్లి, భద్రాచలం, నల్లగొండ జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, జీహెచ్ఎమ్‌సీ పరిధిలోని కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సనత్‌నగర్, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్, ఇబ్రహీంపట్నం, నిజామాబాద్ జిల్లాల్లోని బాన్సువాడ, నిజామాబాద్ రూరల్ తదితర నియోజకవర్గాలకు చెందిన ...13లో



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో కేటీఆర్, తదితరులు

రాముడైనా కృష్ణుడైనా ఎన్టీఆరే

ఎన్టీఆర్ కేసీఆర్ గురుశిష్యులు

- కాంగ్రెస్‌వి అలవికాని హామీలు
- కర్నాటక, ఢిల్లీల నుంచి డబ్బు సంచులు
- డబ్బులిస్తే తీసుకోండి.. కారుకే ఓటేయండి
- ఖమ్మం సభలో మంత్రి కేటీఆర్
- ఎన్టీఆర్‌తో కేసీఆర్‌ను పోల్చడంపై విమర్శలు
- పర్యటన నేపథ్యంలో విపక్ష నేతల నిర్బంధం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

'గ్యారెంటీలు.. గ్యారెంటీలు అని ఊదర కొడుతున్న వాళ్లకు.. వాళ్ల సీటు గ్యారెంటీ ఉందా..? వాళ్ల పార్టీకి వారెంటీ ఉందా? ఆలోచించండి. ఆరిపోయే దీపం లాంటి పార్టీ.. డైలాగులు ...6లో



చంద్రబాబు అరెస్టు దురదృష్టకరం

ఈ వయసులో అలా చేయటం సరికాదు

- సిద్దిపేటలో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు
- మన అభివృద్ధిని కీర్తించారంటూ వ్యాఖ్య
- కాంగ్రెస్, బీజేపీకి దూరదృష్టి లేదని విమర్శ

నవ తెలంగాణ - సిద్దిపేట, నంగునూరు

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం చంద్రబాబునాయుడును అరెస్టు చేయడం దురదృష్టకరమని రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ వయసులో ఆయనను అరెస్టు చేయడం సరికాదు అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట గ్రామంలో రూ.300 కోట్లతో నిర్మించనున్న ఆయిల్‌పామ్ ...13లో

ఐక్యంగా పోరాడాల్సిన

సమయమిది

ఇండియా కూటమికి పలు చిన్న పార్టీలు, ఉద్యమవేదికలు, ప్రజా సంఘాల మద్దతు

- 'జీతేగా ఇండియా' సదస్సులో నిర్ణయం
- దేశవ్యాప్తంగా అక్టోబర్ 2 నుంచి 1.25 లక్షల మంది వాలంటీర్ల ప్రచారం



లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాల ఇండియా కూటమికి మద్దతిస్తామని చిన్న పార్టీలు, ప్రజా ఉద్యమ వేదికలు, ప్రజా సంఘాల వేదిక ప్రకటించాయి. 'జీతేగా ఇండియా - బనేగా ఇండియా' పేరుతో దేశవ్యాప్తంగా 1.25 లక్షల మంది వాలంటీర్లు ప్రచారం చేయనున్నారు. ఈ ప్రచార కార్యక్రమం అక్టోబర్ 2న వార్ధాలోని సేవాగ్రామ్, ఇతర ప్రదేశాల్లో ప్రారంభమవుతుంది. భారత్ జోడో అభియాన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ కమ్యూనిస్టులు, డెమొక్రటిక్ సోషలిస్టులతో రూపొందించబడిన 'జీతేగా ఇండియా' వేదిక ప్రతిపక్షాల ఇండియా కూటమికి మద్దతు తెలిపింది. ఇది 'సత్య సైన్యాల'తో బీజేపీ ట్రోల్ ఆర్మీలను కూడా ఎదుర్కొంటుంది. వారు ప్రతిపక్ష కూటమి నుంచి సీట్లు కోరలేదు. ఇండియా కూటమికి బీజేపీ మధ్య ఓట్ల వ్యత్యాసం తక్కువ ఉన్న 125-150 సీట్లను ఈ వేదిక గుర్తిస్తుందని పేర్కొంది. అయితే వేదిక గుర్తించిన స్థానాల్లో ఇండియా కూటమి పార్టీలు, బీజేపీ సులభంగా గెలిచే స్థానాలు ఉండవు.

న్యూఢిల్లీ : 'జీతేగా ఇండియా'- ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం పేరుతో ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన జాతీయ సదస్సులో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. దీనికి 18 చిన్న ప్రతిపక్ష పార్టీలు, 20 రాష్ట్రాల నుంచి 50 మందికి పైగా ప్రజా ఉద్యమాల సంఘాలు, పౌర సమాజ సంస్థల నుంచి దాదాపు 500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ, దాని మిత్రపక్షాల (బహిరంగ, రహస్య)ను ఓడించడమే లక్ష్యంగా తీర్మానం ఆమోదించారు.

ఈ జాతీయ సదస్సులో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్, ఎస్పీ నేత జావేద్ అలీ ఖాన్, ఆర్ఎల్‌డీ నేత త్రిలోక్ త్యాగి తదితర నేతలు ప్రసంగించారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ ఐక్య పోరాటమే బీజేపీ ఓటమికి దారి తీస్తుందని ఉద్ఘాటించారు. భారతదేశాన్ని రక్షించాలంటే, బీజేపీని సాగనంపాలన్నది ప్రతి దేశభక్తుడి లక్ష్యం కావాలని అన్నారు. "ఇండియా గెలుస్తుంది. కానీ మనమందరం మన ప్రయత్నం చేస్తేనే అది గెలుస్తుంది. దేశం పునాదులపై దాడి జరుగుతుంది. దేశ మూల స్తంభాలపై లెక్కలేనన్ని దాడులు జరిగాయి. దేశంలో 28 పార్టీలు భారత దేశాన్ని రక్షించడం, ఉత్తమ రేపటికి భరోసా ఇవ్వడమే లక్ష్యాలను కలిగి ఉన్నాయి" అన్నారు.

ఎస్పీ నేత జావేద్ అలీ ఖాన్ మాట్లాడుతూ 'బీజేపీ దాదాపు జాతీయవాదాన్ని, దేశభక్తిని కూడా గుత్తాధిపత్యం చేసింది. ఈ తప్పుడు గుత్తాధిపత్యాన్ని అధిగమించి వారికి తమ స్థానాన్ని చూపించడమే మన కర్తవ్యం. బీజేపీకి వ్యతిరేకంగా ...13లో



హైదరాబాద్‌లో ఆశా వర్కర్ల నిరసన

ఆశావర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

టార్గెట్లు, పని ఒత్తిడితో చిన్న వయస్సులోనే రోగాలు

- పారితోషికాల పేరుతో అదనపు పని
- తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి
- రాష్ట్ర వ్యాప్తంగా మానవహారాల ఏర్పాటు


నవతెలంగాణ-ముషీరాబాద్/విలేకరులు

ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనియెడల సమ్మెను మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 28 వేల మంది ఆశా వర్కర్లు ధర్నా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా మానవహారాలు నిర్వహించగా.. తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. 'కేసీఆర్ ఆశావర్కర్ల ఆకలి గోస వినండి! ఫిక్స్‌డ్ వేతనం రూ.18000 పెంచండి' అంటూ ప్లేట్లను మోగిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. ...13లో

బీజేపీ ఎంపీ అనుచిత తీరు

మహిళా ఎమ్మెల్యేపై చేతులు వేసి అసభ్య ప్రవర్తన

- సమావేశంలో అసౌకర్యానికి గురైన ఎమ్మెల్యే
- ఎంపీకి దూరంగా వెళ్లి కూర్చున్న వైనం
- యూపీలోని అలీఘఢ్‌లో ఘటన.. వీడియో వైరల్
- ఎంపీ తీరుపై నెటిజన్ల ఆగ్రహం



లక్నో : ఇటీవల పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళల రిజర్వేషన్ బిల్లు ఆమోదించబడింది. మరోపక్క, బేటీ బచావో, బేటీ పడావో అంటూ మోడీ సర్కారు ప్రచారం చేసుకుంటున్నది. మహిళల భద్రత పట్ల తమకు చిత్తశుద్ధి ఉన్నదని పలు సార్లు బీజేపీ నాయకులు అనేక సమావేశాల్లో ప్రసంగాలు చేస్తున్నారు. అయితే, ఆ పార్టీకి చెందిన ఒక ఎంపీ.. మహిళా ఎమ్మెల్యే పట్ల ...13లో

అంతిమ వీడ్కోలు

అధికార లాంఛనాలతో స్వామినాథన్ అంత్యక్రియలు...



చెన్నై : హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ (98) అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య శనివారం పూర్తయ్యాయి. అధికార లాంఛనాలతో చెన్నైలోని బీసెంట్ నగర్ శ్మశాన వాటికలో స్వామినాథన్ పార్థివ దేహానికి ఆయనకు కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. స్వామినాథన్ పార్థివదేహానికి చెన్నైలోని తేనాంపేటలోని ఆయన నివాసంలో పలువురు ప్రముఖులు, ప్రజలు అభిమానులు నివాళులర్పించారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రతిపక్ష నేత పళనిస్వామి తదితరులు స్వామినాథన్‌కు నివాళులర్పించారు.

ట్విట్టర్ వార్

వేడి పుట్టిస్తున్న పిట్టకూతలు

- కేటీఆర్ కౌంటర్‌కు రేవంత్, కోమటిరెడ్డి కౌంటర్
- స్కామ్‌గ్రెస్‌కు నో చెప్పండి : కేటీఆర్
- తండ్రికి చలి జర్వం వస్తే...కొడుక్కు మతితప్పింది : రేవంత్
- కే (కల్వకుంట్ల) ట్యాక్స్ వసూళ్లు : కోమటిరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర రాజకీయాల్లో పిట్టకూతలు (ట్విట్టర్) ఎన్నికల వేడి పుట్టిస్తున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అగ్రనేతలు ట్విట్టర్ వేదికగా విమర్శల యుద్ధం చేస్తున్నారు.సభలు, సమావేశాల్లో ఒకరిపై ఒకరు విమర్శల బాణాలు ఎక్కుపెడుతూనే...ట్విట్టర్లో పదునైన విమర్శలకు దిగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారి స్కామ్‌గ్రెస్‌గా రూపాంతరం చెందిందంటూ మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్‌కు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దీటుగా స్పందించారు. రాష్ట్రంలో కల్వకుంట్ల (కె) ట్యాక్స్ విధించిదంటూ ఎదురుదాడి చేశారు. కాంగ్రెస్ హామీలతో సీఎంకు చలిజ్వరం వచ్చింది, కొడుకుకు మతి భ్రమించింది అంటూ ఎద్దేవా చేశారు. వెరసి బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య ట్విట్టర్ వార్ ఆసక్తిగా మారింది.

స్కామ్‌గ్రెస్‌కు నో చెప్పండి : మంత్రి కేటీఆర్

రాష్ట్రంలో స్కామ్‌గ్రెస్‌కు తెలంగాణ ప్రజలు నో చెప్పాలంటూ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. కర్నాటకలో కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్‌కు నిధులు ఇచ్చేందుకు అక్కడికి బిల్డర్లకు రూ 500కే చదరపు అడుగు ఇచ్చిందని పేర్కొన్నారు. 'రాజకీయ ఎన్నికల పన్ను' విధించడం ప్రారంభించిందని తెలిపారు. పాత అలవాట్లు చనిపోతాయి కానీ గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్‌కు దాని రిచ్ స్కామ్‌ల వారసత్వం కొనసాగుతుందని పేర్కొన్నారు. స్కామ్‌గ్రెస్' అని పేరు మార్చినట్టు వివరించారు. ఎంత డబ్బు ముట్టజెప్పినా తెలంగాణ ...6లో

సింగరేణిలో బదిలీ వర్కర్ల క్రమబద్ధీకరణ

2,266 మందికి లబ్ధి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్‌లో బదిలీ వర్కర్స్‌గా పనిచేస్తున్న 2,266 మంది సర్వీసుల్ని జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించినట్టు ఆ సంస్థ డైరెక్టర్(పర్సనల్, ఫైనాన్స్) ఎన్ బలరాం తెలిపారు. 2017 నుంచి ఇప్పటి వరకు 13,981 మందిని ఈ విధంగా క్రమబద్ధీకరించామన్నారు. ఏడాదిలో భూ గర్భ గనుల్లో కనీసం 190 రోజులు పనిచేసిన వారికి, ఉపరితల గనులు, విభాగాల్లో కనీసం 240 రోజులు పనిచేసిన బదిలీ వర్కర్లను, జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేశామని శనివారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు 1 తేదీ నుంచి వీరందరినీ జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తున్నామన్నారు. సింగరేణిలో కారుణ్య, డిపెండెంట్ ప్రక్రియలో ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరినీ తొలుత బదిలీ వర్కర్లుగా సంస్థ నియమిస్తుందనీ, ఏడాది పనిచేశాక, కనీస హాజర్లు ఉన్న వారిని మాత్రమే జనరల్ మజ్దూర్లుగా, కంపెనీ ఉద్యోగులుగా గుర్తించబడతారని వివరించారు. కారుణ్య నియామక ప్రక్రియలో సింగరేణిలో చేరిన దాదాపు 16 వేల మంది వారసులలో ఎక్కువ మంది మంచి విద్యార్హతలు కలిగి ఉన్నారనీ, ఇలాంటి వారు జనరల్ మజ్దూర్లుగా గుర్తింపు పొందటం వల్ల కంపెనీ నిర్వహించే ఇంటర్నల్ పరీక్షల్లో తమ విద్యార్హతలకు తగిన ఉద్యోగాలను పొందే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.

జనరల్ మజ్దూర్లుగా గుర్తించిన 2,266 మందిలో శ్రీరాంపూర్ ఏరియాలో 677 మంది, ఆర్జీ-1 ఏరియా నుంచి 522 , ఆర్జీ-3, అండ్రియాల ప్రాజెక్టు నుంచి 323, భూపాల పల్లి నుంచి 274, మందమర్రి నుంచి 261, మణుగూరు నుంచి 79, రామగుండం -2 నుంచి 51, బెల్లంపల్లి ఏరియా నుంచి 32, ఇల్లందు, కార్పొరేట్ నుంచి 19, కొత్తగూడెం నుంచి 9 మంది రెగ్యులరైజ్ అయ్యారని వివరించారు.

మళ్లీ వచ్చేది బీఆర్ఎస్సే...

- రాష్ట్ర పోలీస్ గృహనిర్మాణ సంస్థ చైర్మెన్ కోలేటి దామోదర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మెన్ కోలేటి దామోదర్ ధీమా వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్‌పై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. శనివారం నాడొ క పత్రికా ప్రకటన విడుదల చేశారు.

పంచాయతీ లేఅవుట్లు రిజిస్టర్ చేయాలి

సుప్రీంలో ప్రభుత్వ పిటీషన్ ఉపసంహరించుకోవాలి

- తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ డిమాండ్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గ్రామ పంచాయితీ లే అవుట్లపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకోవాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శనివారం అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సంఘ కార్యాలయంలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు నారగోని ప్రవీణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం నరసయ్య ప్రధాన కార్యదర్శి పగడాల రంగారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ లే అవుట్లలో నిలిపివేసిన ఓపెన్ ప్లాట్లను వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ల నిలిపివేత వల్ల మూడేండ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొనుగోలుదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా అన్ని వర్గాలకూ ప్రభుత్వం మేలు చేస్తున్నదనీ, సర్క్యులర్ నెంబర్ 257 రద్దు చేసి, గ్రామపంచాయతీ లే అవుట్లలో మిగిలిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశం కల్పించి, తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం దీనిపై స్పందించకుంటే, రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న దాదాపు 25 లక్షల మందితో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణరావు, బొమ్మ వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు బిల్లా సతీష్, జైపాల్ రెడ్డి, సుధాకర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఐసెట్ రిపోర్టింగ్ గడువు 6 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం ఐసెట్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో సీట్లు పొందిన అభ్యర్థులు కాలేజీల్లో రిపోర్టింగ్ చేసే గడువును ఈనెల ఆరో తేదీ వరకు సాంకేతిక విద్యాశాఖ పొడిగించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఐసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం కాలేజీల్లో చేరే గడువు శనివారంతో ముగిసింది.

అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈనెల ఆరో తేదీ వరకు పొడిగిస్తున్నట్టు తెలిపారు. ఎంబీఏలో 258 కాలేజీల్లో 24,487 సీట్లుంటే, 22,422 (91.57 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 2,065 (8.43 శాతం) సీట్లు మిగిలిపోయాయి. ఎంసీఏకు సంబంధించి 52 కాలేజీల్లో 3,316 సీట్లుంటే, 3,311 (99.85 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఎంసీఏలో ఐదు (0.15 శాతం) సీట్లు మిగిలాయి. ఇతర వివరాలకు https://tsicet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

దారుస్సలాంపై జెండా ఎగరేస్తాం : బండి సంజయ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ఎంఐఎం ఆటలు సాగనివ్వమనీ, అవసరమైతే దారుస్సలాంలోని ఆ పార్టీ కార్యాలయంపై జెండా ఎగరేస్తామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. శనివారం ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చే ముందు మీడియాకు వీడియో సందేశం పంపారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో ఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీలు విధ్వంసం సృష్టించాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఎంఐఎం కార్యకర్తలు తన ఇల్లు, ఆఫీస్‌పై దాడికి ప్రయత్నిస్తే పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఆత్మరక్షణకు యత్నించిన బీజేపీ కార్యకర్తలపై ఉల్టా కేసులు పెట్టారని చెప్పారు. తమ సహనాన్ని చేతగాని తనంగా భావించొద్దని హెచ్చరించారు. ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ తామే నిజమైన దేశ భక్తులమని చెప్పడాన్ని ఆయన ఎద్దేవా చేశారు. వారు ఏ దేశానికి... పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌కి దేశభక్తులా అని ప్రశ్నించారు. భారతదేశ దేశభక్తులు అయితే భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయంవద్దకు వచ్చి, జనగణమణ, వందేమాతరం గీతాలను ఆలపించాలని సవాల్ విసిరారు.

3 సార్లు మాట ఇచ్చి తప్పిన మోడీ

- ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే ఈ గడ్డపై అడుగు పెట్టాలి : మంత్రి శ్రీనివాస్ గౌడ్



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

వెనుకబడిన ప్రాంతానికి సాగు, తాగునీరు అందించే పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇస్తామని మూడుసార్లు హామీ ఇచ్చి ప్రధాని నరేంద్ర మోడీ మాట తప్పారని మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన ప్రధాని మోడీ ఏ మొఖం పెట్టుకొని అక్టోబర్ 1న మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనకు వస్తున్నారని ప్రశ్నించారు. ఈ ప్రాంత ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే ఈ గడ్డపై అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఏ చిన్న అవకాశం దొరికినా తెలంగాణపై విషం చిమ్మే ప్రధానికి పాలమూరుపై పాదం మోపే అర్హత లేదన్నారు. ఇప్పుడు ప్రధాని పాల్గొంటున్న బహిరంగ సభ వేదికపైనే గతంలో పాలమూరు- ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. కులం, మతం పేరిట ప్రజలను రెచ్చగొట్టడం ద్వారా ప్రశాంతంగా ఉన్న పాలమూరును అల్లకల్లోలం చేసేందుకు వస్తున్నారా అని ప్రశ్నించారు.

పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా అడిగిన సందర్భంలో ఇకపై ఏ ప్రాజెక్టుకూ ఇవ్వబోమని పార్లమెంటు సాక్షిగా చెప్పిన బీజేపీ సర్కారు.. వెంటనే తెలంగాణకు ఎగువన ఉన్న కర్నాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుకు మాత్రం జాతీయ హోదా ఇచ్చిందని చెప్పారు. దివంగత సుష్మా స్వరాజ్ సహా అమిత్ షా కూడా ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న కృష్ణా జలాల పంపిణీ విషయం త్వరగా తేల్చాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ కేసి నర్సింహులు, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మెన్ రాజేశ్వర్ గౌడ్, జెడ్పీ వైస్ చైర్మెన్ యాదయ్య, మున్సిపల్ వైస్ చైర్మెన్ గణేష్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుదీప్ రెడ్డి, రాములు, ఎంపీపీ బాలరాజు, తిరుపతి రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీని సందర్శించిన కేరళ మంత్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేరళ రాష్ట్ర ప్రభుత్వ పోర్ట్స్ ,మ్యూజియమ్స్, అర్కియాలజీ శాఖల మంత్రి అహ్మద్ దేవర కోవిల్ రాష్ట్ర శాసనసభ, మండలిని సందర్శించారు. శనివారం అసెంబ్లీకి విచ్చేసిన ఆయనకు రాష్ట్ర శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువ కప్పి, చార్మినార్ మెమెంటో అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సమావేశాలు జరిగే తీరు, నియమ, నిబంధనలను వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గురించి గుత్తా వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ నరసింహా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కులకు రక్షణ, భద్రత కల్పించాలి

అక్టోబర్ 5 న చలో ఢిల్లీ కార్యక్రమం : ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి



నవతెలంగాణ-భువనగిరి

మహిళల హక్కుల రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ భద్రత కల్పించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐద్వా చేపట్టిన జీపుజాతాను శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రంలో జెండా ఊపి ప్రారంభించారు. జీపు జాతా భువనగిరి, ఆలేరు, వలిగొండ, రామన్నపేట, పోచంపల్లి, చౌట్టుప్పల్, నారాయణపురం మండలం, చిన్నకోండురు గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో అరుణజ్యోతి మాట్లాడుతూ.. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర సరుకుల ధరలు 200 శాతం పెరిగాయన్నారు. గ్యాస్ ధర రూ.410 నుంచి రూ.1270 చేరుకుందన్నారు. ఎన్నికల నేపథ్యంలో కంటి తుడుపు చర్యగా కొద్దిపాటి ధర తగ్గించి ఎంతో చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ప్రజలకు సబ్సిడీలతో సేవలు అందిస్తున్న బ్యాంకులు బీఎస్ఎన్ఎల్, ఓఎన్‌జీసి, రైల్వేలు, పోర్టులు, సింగరేణి, విశాఖ ఉక్కు మొదలగు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మనువాద భావజాలాన్ని అమలు చేయాలని ఆర్ఎస్ఎస్ అడుగుజాడల్లో బీజేపీ ప్రభుత్వాన్ని నడిపిస్తోందని విమర్శించారు. మహిళలకు రక్షణ లేని పరిస్థితులు దాపురిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులకు గురైన వారిని పట్టించుకోకుండా దోషులను రక్షిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులకు మహిళలే కారణమన్నట్టుగా బీజేపీ మంత్రులు, నాయకులు మాట్లాడు తున్నారన్నారు.

హనుమకొండలో తొమ్మిది నెలల పసిపాప, హైదరాబాదులో ఆరు సంవత్సరాల బాలిక చైత్రను, 60 సంవత్సరాల వృద్దురాలు, బొమ్మలరామారం మండలం హాజీపూర్ గ్రామంలో విద్యార్థినులు ఏ రకమైన వస్త్రధారణ ధరించి పురుషులను రెచ్చగొట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ భద్రత, మహిళల భద్రత కోసం మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యం దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యం చేసేందుకు ఐద్వా ఆధ్వర్యంలో జీపు జాతాలు, పాదయాత్రలు చేపట్టినట్టు చెప్పారు. అందులో భాగంగానే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జీపుజాతా సాగుతోందన్నారు. అక్టోబర్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చట్ట సభల్లో వేంటనే 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఐద్వా భువనగిరి జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కూడా అధికారంలోకి రాకముందు పేదలందరికీ ఇల్లు కట్టిస్తామని హామీనిచ్చి విస్మరించాయన్నారు. అర్హులైన పేదలందరికీ 125 గజాల ప్రభుత్వ స్థలం ఇచ్చి.. ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల ద్వారా తమిళనాడు, కేరళ రాష్ట్రాలు ఇస్తున్న ట్టుగా 14 రకాల నిత్యావసర సరుకులు సబ్సిడీ ధరకి ఇవ్వాలని కోరారు. ఈ జీపు జాతాలో ఐద్వా జిల్లా అధ్యక్షులు అవ్వారు రామేశ్వరి, జిల్లా సహాయ కార్యదర్శి దోనూరు నిర్మల, జిల్లా కోశాధికారి కల్లూరి నాగమణి, నాయకులు మల్లెపల్లి లలిత, ఎండి రేష్మ, కొత్త లలిత పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల కమీషన్ టన్నుకు రూ.1,400కు పెంపు

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేషన్ డీలర్లకు టన్నుకు ఇస్తున్న కమిషన్‌ను రూ.700 నుంచి రూ.1,400కు రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. దానికి సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ తనను కలిసిన రేషన్ డీలర్ల జేఏసీ ప్రతినిధులకు జీవో కాపీని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీని కేసీఆర్ ప్రభుత్వం నిలబెట్టుకుందని తెలిపారు. తాజా నిర్ణయంతో రాష్ట్రంలో 17 వేలకుపైగా రేషన్ డీలర్ల కుటుంబాలకు లబ్ది కలుగుతుందని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా సేవలందించాలని డీలర్లను మంత్రి కోరారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు, సీఎం కేసీఆర్‌కు, మంత్రి గంగులకు ధన్యవాదాలు తెలిపారు.

స్వామినాథన్ కు భారతరత్న అవార్డు ఇవ్వాలి : మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వడం ద్వారా శాస్త్రవేత్తలను, రైతాంగాన్ని, వ్యవసాయరంగాన్ని గౌరవించినట్టు అవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన లాంటి వారు యుగానికొక్కరు పుడతారని గుర్తు చేశారు. శనివారం చెన్నైలోని తారామణిలో భారత హరితవిప్లవ పితామహుడు, సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలలో మంత్రితోపాటు వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, సీడ్స్ ఎండీ కేశవులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ఆకలితో అలమటించి లక్షలాది మంది చనిపోయిన పరిస్థితిని చూసి చలించి వైద్యవిద్యను వదిలేసి వ్యవసాయ విద్యను ఎంచుకుని పరిశోధకుడిగా మారిపోయారని గుర్తు చేశారు.

డ్రయినేజీలో పడి మహిళా హెడ్ కానిస్టేబుల్ మృతి

- మంత్రి కేటీఆర్ బందోబస్తులో ఘటన

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

విధుల్లో ఉన్న మహిళా హెడ్‌కానిస్టేబుల్ ప్రమాదవశాత్తు డ్రయినేజీ కాలువలో పడి మృతిచెందారు. ఈ ఘటన శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. భద్రాచలంలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బందోబస్తు నిమిత్తం కొత్తగూడెం వన్ టౌన్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి భద్రాచలం వచ్చారు. అయితే, భారీ వర్షం వల్ల రోడ్లంతా నీటితో నిండి డ్రయినేజీ కూడా కనిపించకుండా పారుతోంది. ఆ సమయంలో రామాలయం వద్ద వాహనాలు పార్కింగ్ చేసే స్థలం వద్ద నుంచి అన్నదాన సత్రం వైపు శ్రీదేవి నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవ శాత్తు మురుగు కాలువలో పడిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. ఎన్డీఆర్ఎఫ్, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖల సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా శ్రీదేవి మృతదేహం కరకట్ట వద్ద స్లూయిజ్‌లో లభ్యమయింది. దీంతో పోలీస్ శాఖలో తీవ్ర విషాదం నెలకొంది. శ్రీదేవి మృతదేహాన్ని చూసి తోటి మహిళా ఉద్యోగులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటనపై ఏఎస్‌పి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మృతహాన్ని ఎంపీ మాలోత్ కవిత, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సందర్శించి నివాళి అర్పించారు.

పెరిగిన మెస్ చార్జీలను అమలు చేయాలి

- సంక్షేమ హాస్టళ్లపై చిత్తశుద్ధి లేని సర్కార్ : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి



నవతెలంగాణ-జఫర్‌గడ్

సంక్షేమ హాస్టళ్లలో పెంచిన మెస్ చార్జీలను వెంటనే అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి అన్నారు. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండల కేంద్రంలో శనివారం 'విద్యా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎల్.మూర్తి మాట్లాడుతూ.. దేశంలో అందరికీ విద్య అందించాలని రాజ్యాంగం చెప్తుంది కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న వారికి ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. అంబేద్కర్ లాంటి మహానుభావులను ఆదర్శం చేసుకొని చదవాలని విద్యార్థులకు సూచించారు. సంక్షేమ హాస్టల్లో పేద మధ్యతరగతి విద్యార్థుల చదువుతున్నారన్నారు. కనీసం వాళ్లకు పౌష్టిక ఆహారం పెట్టాలన్న సోయి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేక.. అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎన్నికలపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్‌పై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా మంత్రులు, విద్యా శాఖ అధికారులు స్పందించి సంక్షేమ హాస్టళ్లను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్‌లో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. విద్యాశాఖ మంత్రి ఇంటిని ముట్టడిస్తామన్నారు. పెంచిన మెస్ చార్జీలకు సంబంధించి వెంటనే జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.5,177 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సందీప్, ధర్మభిక్షం, జిల్లా సహాయ కార్యదర్శి యకన్న రాథోడ్, మండల కార్యదర్శి అర్జున్, ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ విద్యార్థి ఉదయ్ పాల్గొన్నారు.

పసిడి మోత

హాంగ్జౌ ఆసియా క్రీడల్లో మనోళ్లు పసిడి మోత మోగించారు. స్క్వాష్‌లో మెన్స్ జట్టు పసిడి పోరులో పాకిస్థాన్‌ను చిత్తు చేసి బంగారు పతకం గెల్చుకోగా.. టెన్నిస్‌లో మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో రోహన్ బోపన్న, రుతుజ జోడీ స్వర్ణం సొంతం చేసుకుంది. దీంతో భారత్ పసిడి పతకాల సంఖ్య పదికి చేరుకుంది. అథ్లెటిక్స్‌లో స్ప్రింటర్లు ఒకే ఈవెంట్లో రెండు మెడల్స్ అందించగా, షూటింగ్‌లో మనకు మరో వెండి పతకం సొంతమైంది. ఓవరాల్‌గా 38 మెడల్స్‌తో పతకాల పట్టికలో భారత్ నాల్గో స్థానంలో కొనసాగుతుంది.

- స్క్వాష్‌లో మెన్స్ జట్టుకు స్వర్ణం
- అథ్లెటిక్స్‌లో డబుల్ ధమాకా
- టెన్నిస్‌లో బోపన్న, రుతుజకు గోల్డ్
- హాంగ్జౌ ఆసియా క్రీడలు 2023



పసిడి పరవశం: స్క్వాష్ మెన్స్ టీమ్ ఫైనల్లో పాకిస్థాన్‌పై చివరి మ్యాచ్‌లో ఉత్కంఠ విజయం సాధించిన ఆనందంలో అభయ్ సింగ్, భారత ఆటగాళ్లు



బోపన్న, రుతుజ పసిడి వెలుగు

నవతెలంగాణ-హాంగ్జౌ

స్క్వాష్‌లో టీమ్ ఇండియా ఉద్విగ్న పసిడి పతకం సొంతం చేసుకుంది. స్క్వాష్ మెన్స్ జట్టు విభాగంలో ఫైనల్స్‌కు చేరుకున్న టీమ్ ఇండియా.. పసిడి పోరులో దాయాది పాకిస్థాన్‌పై ఘన విజయం నమోదు చేసింది. ఫైనల్లో తొలి మ్యాచ్‌లో ఆధిపత్యం చెలాయించిన పాకిస్థాన్.. భారత్‌పై ఒత్తిడి పెంచింది. అయినా, చివరి రెండు మ్యాచులను అద్వితీయ రీతిలో గెల్చుకున్న భారత్ ఈ విభాగంలో పసిడి పతకం దక్కించుకుంది. తొలి రెండు మ్యాచుల అనంతరం భారత్, పాకిస్థాన్ 1-1తో సమవుజ్జీలుగా నిలిచాయి. దీంతో నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌పై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మూడో మ్యాచ్‌లో అభయ్ సింగ్ ఐదు గేముల మ్యాచ్‌లో మెరుపు విజయం అందించాడు. పాక్ ఆటగాడు జమాన్ నూర్‌పై 11-7, 9-11, 8-11, 11-9, 12-10తో కండ్లుచెదిరే విజయం సాధించాడు. తొలి గేమ్ నెగ్గిన అభయ్ సింగ్.. తర్వాత వరుసగా రెండు గేముల్లో నిరాశపరిచాడు. పాకిస్థాన్ పసిడికి మరో గేమ్ దూరంలో నిలిచిన తరుణంలో అభయ్ సింగ్ అద్భుతమే చేశాడు. చివరి రెండు గేముల్లో సత్తా చాటాడు. భారత్‌కు పసిడి పతకం అందించాడు. అంతకముందు తొలి మ్యాచ్‌లో మహేశ్ మనోహర్ నిరాశపరిచాడు. ఇక్బాల్ నజీర్‌కు 8-11, 3-11, 2-11తో వరుస గేముల్లో ఓటమి పాలయ్యాడు. కీలక రెండో మ్యాచ్‌లో భారత స్టార్ ఆటగాడు సౌరవ్ ఘోషల్ అదరగొట్టాడు. 11-5, 11-3, 11-2తో వరుస గేముల్లో మహ్మద్ ఆసీం ఖాన్‌ను చిత్తు చేశాడు. స్క్వాష్ మహిళల జట్టు విభాగంలో భారత్‌కు కాంస్య పతకం దక్కిన సంగతి తెలిసిందే.

టెన్నిస్‌లో స్వర్ణం

పురుషుల డబుల్స్‌లో రజతంతో సరిపెట్టుకున్న భారత్.. మిక్స్‌డ్ డబుల్స్‌లో బంగారానికి తగ్గలేదు. భారత వెటరన్ ఆటగాడు రోహన్ బోపన్నతో కలిసి బరిలోకి దిగిన రుతుజ సంపత్‌రావు ఆసియా క్రీడల్లో స్వర్ణం సొంతం చేసుకుంది. పసిడి పోరులో చైనీస్ తైపీ జోడీ లియాంగ్, హువయాంగ్ జంటతో పోటీపడిన బోపన్న, రుతుజ జోడీ.. తొలి సెట్లో నిరాశపరిచారు. 33 నిమిషాల పాటు సాగిన తొలి సెట్‌ను 6-2తో చైనీస్ తైపీ జంట కైవసం చేసుకుంది. దీంతో రెండో సెట్లో తప్పక నెగ్గాల్సిన పరిస్థితి మనోళ్లకు ఏర్పడింది. 30 నిమిషాల్లోనే రెండో సెట్ లాంఛనం ముగించిన బోపన్న, రుతుజ 6-3తో స్కోరు సమం చేసింది. పసిడి పోరును నిర్ణయాత్మక టైబ్రేకర్ సెట్‌కు తీసుకెళ్లింది. టైబ్రేకర్‌లో 10-4తో సత్తా చాటిన బోపన్న, రుతుజ స్వర్ణం ముద్దాడింది. బోపన్న, రుతుజ జోడీ ఎనిమిది ఏస్‌లు, ఓ బ్రేక్ పాయింట్ సాధించారు. పాయింట్ల పరంగా భారత జోడీ 60-56తో చైనీస్ తైపీపై పైచేయి సాధించింది.



గురి తప్పలేదు: సరబ్జోత్, దివ్య

షూటింగ్‌లో మరో సిల్వర్

భారత షూటర్లు హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చరిత్ర సృష్టించారు. 1986 ఆసియా క్రీడల్లో షూటర్లు భారత్‌కు 14 పతకాలు అందించగా.. తాజా ఆసియా క్రీడల్లో ఏకంగా 19 పతకాలు గెల్చుకున్నారు. శనివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ వెండి పతకంతో మెరిసింది. యువ షూటర్లు సరబ్జోత్ సింగ్, దివ్య సుబ్బరాజు జోడీ సిల్వర్‌తో సత్తా చాటింది. 13, 14వ రౌండ్ వరకు 13-13, 14-14తో చైనా షూటర్లతో సమవుజ్జీగా నిలిచిన మనోళ్లు.. చివర్లో ఆతిథ్య చైనాకు పసిడి కోల్పోయారు. 15వ రౌండ్‌లో చైనా షూటర్లు 21.0, 10.7, 10.3 స్కోరు చేయగా.. భారత షూటర్లు 20.4, 9.9, 10.5తో కాస్త తడబడ్డారు. ఇక్కడే రెండు పాయింట్ల ఆధిక్యం సాధించిన చైనా బంగారు పతకం కైవసం చేసుకుంది. సరబ్జోత్ సింగ్, దివ్య సుబ్బరాజు జోడీ సిల్వర్ మెడల్ దక్కించుకుంది.

ట్రాక్‌లో డబుల్ ధమాకా

అథ్లెటిక్స్‌లో భారత్ జోరు కొనసాగుతుంది. తొలి రోజు పోటీల్లో కిరణ్ బలియన్ మహిళల షాట్‌పుట్‌లో పతకం సాధించి చరిత్ర సృష్టించగా.. శనివారం జరిగిన రేసుల్లో మెన్స్ 10000 మీటర్ల రేసులో భారత్‌కు ఏకంగా రెండు పతకాలు వచ్చాయి. కార్తీక్ కుమార్, గుల్వీర్ సింగ్‌లు రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. 28.15.38 సెకండ్లలో రేసు పూర్తి చేసిన కార్తీక్ కుమార్ సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. గుల్వీర్ సింగ్ 28.17.21 సెకండ్ల టైమింగ్‌తో కాంస్య పతకం దక్కించుకున్నాడు. 10000 మీటర్ల ఈవెంట్‌లో భారత్ చివరగా 1998లో మెడల్ సాధించింది. 1998లో గులాబ్ చంద్ కాంస్య నెగ్గగా..1978 బ్యాంకాక్‌లో హరిచంద్ పసిడి సాధించాడు. 1974లో శివనాథ్ సింగ్ (సిల్వర్), 1962లో తర్లోక్ సింగ్ (గోల్డ్), 1951లో గుర్బాచాన్ సింగ్ కాంస్యంతో మెరిశారు. ఈ విభాగంలో పతకాల పంట పండించిన మన స్ప్రింటర్లు 1998 తర్వాత మెడల్ నెగ్గటం ఇదే ప్రథమం.



ట్రాక్ హీరోలు : కార్తిక్, గుల్వీర్ సింగ్

షట్లర్లకు సిల్వర్ ఖాయం!

భారత షట్లర్లు జట్టు విభాగంలో కనీసం రజతం ఖాయం చేసుకున్నారు. శనివారం జరిగిన సెమీఫైనల్లో భారత మెన్స్ జట్టు దక్షిణ కొరియాపై 3-2తో ఘన విజయం సాధించింది. సెమీస్‌లో తొలి మ్యాచ్‌లో హెచ్.ఎస్ ప్రణయ్ 18-21, 21-16, 21-19తో జియోన్‌పై గెలుపొంది శుభారంభం చేశాడు. రెండో మ్యాచ్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ నిరాశపరిచింది. 13-21, 24-26తో సియో, కాంగ్‌ల చేతిలో పోరాడి ఓడింది. మూడో మ్యాచ్‌లో యువ షట్లర్ లక్ష్యసేన్ దుమ్మురేపాడు. 21-7, 21-9తో వరుస గేముల్లో ఏకపక్ష విజయం నమోదు చేసి భారత్‌కు 2-1 ఆధిక్యం అందించాడు. నాల్గో మ్యాచ్‌లో ఎంఆర్ అర్జున్, ధ్రువ్ జోడీ 16-21, 11-21తో నిరాశపరచగా స్కోర్లు 2-2తో సమం అయ్యాయి. నిర్ణయాత్మక మ్యాచ్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్ కిదాంబి శ్రీకాంత్ అదరగొట్టాడు. మూడు గేముల మ్యాచ్‌ను 2-1తో గెలుపొందాడు. తొలి గేమ్‌లో 12-21తో తడబడినా.. 21-16, 21-14తో చెలరేగాడు. భారత్‌కు 3-2తో దక్షిణ కొరియాపై విజయాన్ని అందించాడు. మరో సెమీఫైనల్లో జపాన్‌పై చైనా 3-1తో గెలుపొంది ఫైనల్స్‌కు చేరుకుంది. నేడు జరిగే పసిడి పోరులో చైనా, భారత్ తలపడన్నాయి.

హాకీ ఇండియా గ్రూప్ దశలో అజేయంగా నిలిచింది!. తొలుత సింగపూర్‌పై 16-0, జపాన్‌పై 4-2తో విజయాలు సాధించిన భారత్ తాజాగా పాకిస్థాన్‌ను 10-2తో చిత్తు చేసింది. గ్రూప్-ఏ మ్యాచ్‌లో పాక్‌పై పంజా విసిరిన హాకీ ఇండియా గోల్స్ వర్షం కురిపించింది. వరుణ్ కుమార్ (54, 41వ నిమిషం), లలిత్ ఉపాధ్యాయ్ (49వ నిమిషం), షంషేర్ సింగ్ (46వ నిమిషం), హర్మన్‌ప్రీత్ సింగ్ (34, 33, 17, 11వ నిమిషం), సుమిత్ (30వ నిమిషం), మన్‌దీప్ సింగ్ (8వ నిమిషం) గోల్స్ నమోదు చేశారు. పాకిస్థాన్ తరఫున రానా, ఎం.ఎస్ ఖాన్‌లు చెరో గోల్ కొట్టి ఊరట అందించారు. గ్రూప్ దశలో 2న బంగ్లాదేశ్‌తో భారత్ తలపడనుంది.

బాక్సర్ల దూకుడు

బాక్సింగ్‌లో మనోళ్ల సత్తా చాటుతున్నారు. తెలుగు తేజం నిఖత్ జరీన్ ఇప్పటికే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌తో పాటు పతకం ఖాయం చేసుకోగా ఆమె బాటలోనే లవ్లీనా బొర్గొహైన్, ప్రీతి నడిచారు. మహిళల 75 కేజీల విభాగం క్వార్టర్‌ఫైనల్లో వరల్డ్ చాంపియన్ లవ్లీనా బొర్గొహైన్ 5-0తో కొరియా బాక్సర్‌ను చిత్తు చేసింది. 30-27, 30-27, 30-27, 30-27, 30-27తో ఐదుగురు న్యాయమూర్తులు లవ్లీనా ఏకగ్రీవ విజేతగా ప్రకటించారు. మహిళల 54 కేజీల విభాగంలో ప్రీతి సైతం సెమీస్‌కు చేరుకుంది. కజకిస్థాన్ బాక్సర్‌పై 4-1తో విజయం సాధించింది. మెన్స్ 91 కేజీల విభాగంలో నరేందర్ 5-0తో ఇరాన్ బాక్సర్‌ను చిత్తు చేసి సెమీస్‌కు చేరుకున్నాడు. లవ్లీనా, ప్రీతి, నరేందర్‌లు సెమీఫైనల్లోకి ప్రవేశించి పతకంతో పాటు పారిస్ ఒలింపిక్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నారు.

ఆటలు

20న హెచ్‌సీఏ ఎన్నికలు

11 నుంచి నామిషన్ల స్వీకరణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన

నవతెలంగాణ-హైదరాబాద్ : ఎట్టకేలకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఎన్నికల నగారా మోగింది. అక్టోబర్ 20న హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్ల ఎన్నికకు శనివారం ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదలైంది. అక్టోబర్ 20న ఎన్నికలు జరుగనుండగా.. 11 నుంచి 13 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 14న నామినేషన్ల పరిశీలన, 16న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువుగా ఎన్నికల అధికారి, భారత ఎన్నికల కమిషన్ మాజీ చీఫ్ కమిషనర్ వి.ఎస్ సంపత్ ఓ ప్రకటనలో వెల్లడించారు. 20న జరిగే ఎన్నికల్లో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవులకు అవసరమైతే ఓటింగ్ నిర్వహించి, అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు. సుప్రీంకోర్టు నియమిత ఏకసభ్య కమిటీ జస్టిస్ లావు నాగేశ్వరరావు ఇదివరకే బహుళ యాజమాన్య ఆధీనంలోని క్లబ్‌లకు తాజా ఎన్నికల్లో ఓటు హక్కు రద్దు చేసిన సంగతి తెలిసిందే. హెచ్‌సీఏ అనుబంధ క్లబ్‌లు, సంస్థలు, మాజీ క్రికెటర్లతో కలిపి 173 మందికి ఓటు హక్కు కల్పించారు. ఈ మేరకు పూర్తి వివరాలను హెచ్‌సీఏ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.



హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ షురూ

హైదరాబాద్ : 14వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ ఘనంగా ఆరంభమైంది. మాదాపూర్‌లోని ఎన్‌వీకే టెన్నిస్ అకాడమీలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర శనివారం పోటీలను అధికారికంగా ప్రారంభించారు. పురుషుల సింగిల్స్, డబుల్స్‌లో ఈవెంట్లలో 30, 40, 50, 60, 70 ప్లస్ వయో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తుండగా, మహిళలు ఓపెన్ విభాగంలో పోటీపడనున్నారు. ఓపెన్ విభాగంలో మిక్స్‌డ్ డబుల్స్‌లో ఈవెంట్‌ను గత సీజన్ నుంచి నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా 451 మంది టెన్నిస్ క్రీడాకారులు పోటీపడుతున్న ఈ టోర్నమెంట్ అక్టోబర్ 2న అన్ని విభాగాల్లో ఫైనల్స్‌తో ముగియనుందని హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం (హెచ్‌ఓటీఏ) ఫౌండర్ ప్రెసిడెంట్ నంద్యాల నర్సింహారెడ్డి తెలిపారు. టోర్నీలో పోటీపడుతున్న క్రీడాకారులకు నాలుగు రోజుల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. సింగిల్స్ విభాగంలో 303, డబుల్స్ విభాగంలో 149 మంది టైటిల్ వేటలో బరిలోకి దిగుతుండగా.. విజేతలకు రూ. 5 లక్షల భారీ నగదు బహుమతి ఇవ్వనున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ జి. ప్రదీప్, పి.వి రావు, హరికష్ణ రెడ్డి, ఏ.ఆర్ రావు, సదాశివా రెడ్డి, అనిరుధ్, లగ్గాని శ్రీనివాస్, జె.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

భారత్, ఇంగ్లాండ్ వార్మప్ వర్షార్పణం

గువహటి : 2023 ఐసీసీ ప్రపంచకప్‌పై వాతావరణ ప్రభావం పడుతోంది!. తిరువనంతపురంలో దక్షిణాఫ్రికా, అఫ్ఘనిస్థాన్ మ్యాచ్ ఇప్పటికే వర్షం కారణంగా రద్దు కాగా.. తాజాగా భారత్, ఇంగ్లాండ్ వార్మప్ సైతం వరుణుడి ఖాతాలో పడింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్‌తో వార్మప్‌తో ప్రపంచకప్ వేటలోకి పడిపోదామని ఆతిథ్య భారత్ ఆశించినా.. గువహటిలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం ప్రణాళికలను తలకిందులు చేసింది. దీంతో టాస్ పడకుండానే వార్మప్ మ్యాచ్ రద్దయ్యింది. మంగళవారం తిరువనంతపురంలో నెదర్లాండ్స్‌తో టీమ్ ఇండియా రెండో వార్మప్ ఆడనుంది.

సంపాదకీయం

వందల వేల సంవత్సరాలుగా మన దేశంలో అనేక మతాలు,విశ్వాసాలు గల ప్రజలు సహనంగానే జీవనాన్ని కొనసాగిస్తున్నారు.మతపరంగా వచ్చిన తగాదాలన్నీ రాజకీయ ఆధిపత్యవర్గాల వల్లనే అనేది తెలుసుకోవాల్సిన విషయం. ముఖ్యంగా దేవున్ని, ఆలయాలను, భక్తిని స్వార్థ రాజకీయానికి వాడుకునే చర్యలు పెరిగిన తరుణంలో ఇలాంటి సంఘటనలు ఎంతో స్ఫూర్తిని, సామరస్యాలను పెంపొందిస్తాయి.

ఇది కదా! భారత జీవనం

'హిందువులం, బంధువులం' ఎంత ఇరుకైన నినాదం! 'వసుధైక కుటుంబకమ్' కదా మన సంప్రదాయం. భారతీయులందరు నా సహోదరులు...అని కదూ మనం చిన్ననాటి నుండీ ప్రతిజ్ఞ చేస్తున్నాము. భారతీయులందరమూ బంధువులమే. అసలు మానవులందరూ ఒక జాతి కిందకే వస్తారు.మతాల ప్రాతిపదికన గిరి గీసుకుని పోతుంటే, అక్కడితో ఆగుతామా? కులం రాదూ! ప్రాంతం రాదూ! రంగు తేడాలు ఉత్తర దక్షిణాలు, జెండర్ బేధాలూ...భాషలూ.. ఇలా సమూహాలను విడగొట్టుకుంటూ పోతే గడ్డిపోచల్లా మిగిలిపోమూ! ఆ విభజన మొదలెయ్యటమే అమానవీయం. విభజించుకుంటూ వెలిపోవడటం మరింత దారుణం. అప్పుడు మనుషులుగా మిగల కుండా పోతాము చివరికి. ఆధునిక మానవుడు, అంతకు ముందున్న సమాజం కంటే ఉన్నత విలువను సమకూర్చుకున్నాడు. అభివృద్ధి చెందాడు. భౌతికంగానే కాదు ఆలోచనలో, ప్రవర్తనలో, విలువలలో ముందున్నాడు. తిరిగి వెనక్కి నడవడం కుదరదు. కాలం వెనక్కి తిరగదు. అయినా కొందరు ఆలోచనల్లో, ప్రవర్తనల్లో వెనక్కి నడిచే ప్రయత్నాలు చేస్తుంటారు. అందుకంత నష్టాన్ని ఆ సమూహం, సమాజం అనుభవి స్తుంది. అభివృద్ధి ఆగిపోతుంది. వెనక్కి మళ్లడం కొందరు బలవంతంగా చేసే పని మాత్రమే. సమాజ గమనం మాత్రం ముందుకే వుంటుంది. మన దేశ సమూహాల్లోనూ మానవీయ విలువలైన సౌహార్థత, సౌశీల్యం, సహనం, సోద రత్వం, సహజాతంగా కొనసాగుతూనే వున్నాయి. చరిత్రలోనైనా, వర్తమానం లోనూ జీవన గమనాలను పరిశీలిస్తే మనకు అవగాహన అవుతుంది.



దేశంలో మతం ఆధారంగా మనుషుల మధ్య విభేదాలను, విద్వేషాలను రెచ్చ గొడుతూ విధ్వంస రచన కొనసాగుతున్న తరుణంలో కూడా సామరస్య జీవనం ఎలా వుంటుందో ప్రజలు ఎరుక పరుస్తూనే వున్నారు. నిజంగా ప్రజలు దేవుడి మూలంగా ద్వేషాన్ని కలిగి వున్నారా? లేదు.నిజమైన భక్తులకు అల్లాహ్, రాముడు, యెహోవా ఎవరైనా ఒకటే. 'ఈశ్వర్ అల్లా తేరేనామ్ సబ్‌కో సమ్మతి దే భగవాన్' అని పాడుకొన్నవాళ్లం కదా! భక్తి విధానంలో భేదం వుండొచ్చు కానీ భక్తిలో విద్వేషం మాత్రం ఉండదు. విద్వేషాలు రెచ్చగొట్టేవారికి వున్న ప్రయోజనాలు వేరు. అవి కేవలం ఆధిపత్య రాజకీయ ప్రయోజనాలు మాత్రమే. అందుకే వారు వైషమ్యాలను ఎగదోస్తుంటారు. నిజమైన భక్తులు, సాధారణ ప్రజలు సామరస్యాన్ని కోరుకుంటారు. అందుకు చక్కని ఉదాహరణ మొన్న జరిగిన గణపతి ఉత్సవాలు. గణపతి నిమజ్జన ఊరేగింపుల సందర్భంగానే, అదే రోజు ముస్లింలు ముఖ్యంగా జరుపుకునే మిలాదున్నబీ కూడా వచ్చింది. ఈ సందర్భంగా వారు కూడా ప్రదర్శనలు తీయటం ఆనవాయితీగా వస్తున్నది. అయితే వైరుధ్యాలను సృష్టించాలనుకునేవారు వీటిని ఆసరా చేసుకుని గొడవలు రేపుతారు. అందుకని సహనంతో ఆలోచించిన మతపెద్దలు, మిలాదున్‌నబీని నిమజ్జనం రోజుకాక అక్టోబరు ఒకటిన జరుపుకోవాలని నిర్ణయించడం, అందరికీ విజ్ఞప్తి చేయడం సామరస్యతకు దారులు వేసింది. ఇది అందరి అభినందనలను పొందుతున్నది. అంతేకాదు గణపతి నిమజ్జన ఊరేగింపు జరుగుతున్న దారులలో ముఖ్యంగా హైదరాబాద్ పాత నగరంలోని ముస్లిం సోదరులు విఘ్నేశ్వరుని విగ్రహాలతో వున్న భక్తులకు స్వాగతం పలకడం, వారికి మంచినీళ్లు, ఆహారపు పొట్లాలు పంపిణీ చేయడం చూస్తుంటే హైదరాబాద్ గంగా జమునా తహజీబ్ సంస్కృతి కాపాడుతున్నట్లుగా, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

ఇంతేకాదు కొన్ని విషయాలను గమనిస్తే ప్రజల్లో ఇప్పటికీ ఎంతో గొప్ప సహనశీలత, సౌభ్రాతృత్వం కనిపిస్తుంది. దానికీ ఈ గణపతి ఉత్సవాలనే తీసుకుంటే, ఆదిలాబాద్‌లో గణపతి మండపం వద్ద వేలం వేసే లడ్డూను ఒక ముస్లిం యువకుడు షేక్ ఆసీఫ్ లక్షా రెండు వేలకు పాడి దక్కించుకోవటం సాధారణంగా జరిగిపోయింది. అదే విధంగా వరంగల్ జిల్లా రంగశాయిపేటలోని యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి లడ్డూ వేలంలో కూడా ఎండీ నయిముద్దీన్ అనే యువకుడు లడ్డూను పొందటం, ప్రజలు మతాతీతంగా అభిమానాలను చాటుకుంటారనడానికి ఉదాహరణగా నిలుస్తుంది. ఇక హైదరాబాద్ బండ్లగూడ రిచ్మండ్ విల్లాలోని వినాయకుని లడ్డూను, అక్కడి కమ్యూనిటీ అంతా కలిసి రూ.ఒక కోటీ 26లక్షలకు కొనుగోలు చేశారు. ఆ లడ్డూ కొనుక్కున్న ప్రజల్లో అన్ని మతాలవారు హిందువులు, సిక్కులు, ముస్లింలు, క్రైస్తవులు వున్నారు. ఆ వచ్చిన డబ్బులతో వారు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిసింది. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇట్లాంటి ప్రజల మధ్య లేనిపోని ద్వేషాలను పెంచాలని చేస్తున్న ప్రయత్నాలు కొంతకాలనికైనా వమ్ముకాక తప్పదు.

వందల వేల సంవత్సరాలుగా మన దేశంలో అనేక మతాలు,విశ్వాసాలు గల ప్రజలు సహనంగానే జీవనాన్ని కొనసాగిస్తున్నారు.మతపరంగా వచ్చిన తగాదాలన్నీ రాజకీయ ఆధిపత్యవర్గాల వల్లనే అనేది తెలుసుకోవాల్సిన విషయం. ముఖ్యంగా దేవున్ని, ఆలయాలను, భక్తిని స్వార్థ రాజకీయానికి వాడుకునే చర్యలు పెరిగిన తరుణంలో ఇలాంటి సంఘటనలు ఎంతో స్ఫూర్తిని, సామరస్యాలను పెంపొందిస్తాయి. ■

కెనడా, భారత్ వివాదం... వైరుధ్యాల సంక్లిష్టత



తెలకపల్లి రవి

ప్రధాని నరేంద్ర మోడీ హయాంలో దేశంలో పెరిగిన విద్వేషాల సెగ ఇప్పుడు విదేశాలకూ తాకుతున్నదా? విశ్వగురు బిరుదుతో వూరేగుతామనుకుంటే వివాదాలు కూడా విశ్వవ్యాపిత మవుతున్నాయా? అధీకృత దేశభక్తి జపం, దేశంలోనే గాక దేశం బయట కూడా మోడీ మోత మోగించి ఆ గొప్పలతో ఓట్లు కొల్లగొట్టాలనే ఎత్తుగడ బెడిసి కొడుతుందా? గత కొద్ది కాలంగా భారత కెనడాల మధ్య సాగుతున్న రాజకీయ దౌత్య వివాదం మరింత ప్రజ్వరిల్లడం ఆ కోణంలో చాలా ఆందోళన కరమవుతున్నది. పాకిస్తాన్‌ను మినహాయిస్తే మరే దేశంతోనూ ఈ తరహా సమస్యలో మన దేశం చిక్కుకున్న దాఖలాలు లేవు. అలా అని మనకు విదేశాంగ విధానంలో సమస్యలు సవాళ్లు లేనేలేవని కాదు..నిజానికి అమెరికా వత్తాసుగల పాకిస్తాన్ సాగించిన చొరబాట్లు ఎప్పుడూ వున్నాయి. అయితే వాటి తీరు వేరు. తమదేశంలో ఖలీస్తానీ వాది ఖలిస్తాన్ టైగర్‌ఫోర్స్ నాయకుడు హరదీప్‌సింగ్ నిజ్జర్‌ను భారతీయ నిఘా అధికారులే చొరబడి హత్య చేశారనేందుకు బలమైన సాక్ష్యాలున్నాయని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్రస్థాయిలో ముందుకు తెచ్చిన ప్రస్తుత ఆరోపణ వాటన్నిటికీ మించింది. మొన్న జరిగిన జీ20 సమావేశాల సందర్భంలోనూ ఐక్యరాజ్యసమితి వేదిక మీదకూడా కెనడా ఈ ఆరోపణ రికార్డు వినిపిస్తూనే వుంది. కెనడాకు అమెరికా బాహాటంగానే మద్దతు పలికింది. పంచనేత్రాలు (ఫైవ్‌ఐ)గా చెప్పబడే కెనడా అమెరికా బ్రిటన్ న్యూజిలాండ్ ఆస్ట్రేలియాల నిఘా సంస్థలు ఇందుకు గొంతు కలుపుతున్నాయి.అంటే ఇది నెమ్మదిగా ఒక మన దేశంపై ఒక ఉమ్మడి ఫిర్యాదుగా మారుతున్న మాట. వీటిని సకాలంలో సజావుగా పరిష్కరించుకోవలసిన బాధ్యత మనదేశంపై వుంది. లేకపోతే కెనడా భారత సంబంధాలకే గాక ఇతర దేశాలతో మన సంబంధాలకూ విఘాతం కలగొచ్చు. శాంతి కాముక దేశంగా మనకున్న ప్రతిష్ట దెబ్బతినవచ్చు.

విచ్ఛిన్న ఉద్యమ విషాద ఫలితాలు

1980లలో భారతేదశంలో ఖలీస్తానీ వుగ్రవాదం ప్రమాదకరంగా పెరిగిన సంగతి మర్చిపోలేము. ఈ దేశంలో కన్నా ముందు దాని ఛాయలు కెనడాలోనే ప్రత్యక్షమైనాయి. ఇండియా తర్వాత సిక్కులు అధిక సంఖ్యలో వుండేది కెనడాలోనే.ఆ దేశ జనాభాలో దాదాపు 1.8 శాతం సిక్కులున్నారు. ప్రస్తుత ట్రూడో మంత్రివర్గంలోనే నలుగురు సిక్కులున్నారు. జగ్‌జిత్‌సింగ్ చౌహాన్ అనే ఆయన అక్కడ నుంచి విచ్ఛిన్నకర సందేశాలు పంపుతుండేవాడు. నిజానికి ఆ సమయంలో ఈశాన్య భారతంలోనే విచ్ఛిన్న శక్తులకు అమెరికా కూటమి ప్రోద్బలముండేది, నెమ్మదిగా ఆ పన్నాగాలు ఫలించి పంజాబ్ అగ్నిగుండమైంది. దేశమే అల్లాడిపోయింది. వేల మంది ఉగ్రవాదానికి బలి కావడం, భింద్రన్‌వాలే స్వర్ణ దేవాలయంలో తిష్టవేయడంతో ఆపరేషన్ బ్లూస్టార్, దాని పర్యవసానంగా నాటి ప్రధాని ఇందిరాగాంధీ హత్య వంటి తీవ్ర పరిణామాలు చూశాము. పంజాబ్ ముఖ్యమంత్రి దర్బారాసింగ్ కూడా ఉగ్రవాదులకు బలైపోయారు. తల్వీందర్ సింగ్‌పర్మార్ అనే ఉగ్రవాదిని అప్పగించాలని ఇండియా ఎంతకోరినా కెనడా పెడచెవిని పెట్టింది. 1985లో కనిష్క విమానం పేల్చివేసి 329 మంది మృతికి కారణమైన కుట్రదారుడుగా అతని పేరు బయటకు వచ్చింది. ఉత్తరోత్తరా పంజాబ్‌లో పరిస్థితి కొంత అదుపులోకి వచ్చినా విదేశీ నేలపైన మాత్రం అవి ఏదో రూపంలో కొనసాగుతూనే వున్నాయి.ఈ నలభై ఏళ్లలో ప్రపంచం చాలా ఒడుదుడుకులు చూసింది. మితవాద శక్తులు అభివృద్ధి నిరోధక ధోరణులు ప్రాబల్యం పెంచుకున్నాయి. నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో దేశంలోనూ హిందూత్వ పేరిట మతతత్వ ధోరణులు ప్రబలుతున్న పరిస్థితి. ఈదేశంలోనే హిందూ రాష్ట్ర మంటుంటే మేం ఎందుకు ఖలిస్తాన్ అడగొద్దని కెనడాలో ఈ శక్తులు మళ్లీ తలెత్తడం వాస్తవమే. నిజానికి ఆ దేశంలోనే గాక పైన చెప్పిన అయిదు దేశాల్లో కూడా రకరకాలైన భారత వ్యతిరేక శక్తులు గతంలో వలెనే ఇప్పుడు కూడా ప్రచారాలు కార్యకాలాపాలు సాగిస్తుంటే ఆ దేశాల పాలకులు యథేచ్ఛగా సాగనిస్తున్నారు. మరోవైపున దేశంలో మత రాజకీయాలకు తోడు మోడీ భజన పెంచుకోవడానికి హిందూత్వ ముద్రతో విదేశాల్లోనూ ప్రచారాలు చేసిన నేపథ్యం బీజేపీది. టెర్రరిజంపై పోరాటం పేరిట అమెరికాకు ఉపగ్రహంగా మారింది. వైట్‌హౌస్‌లో దీపావళి చేశారని యోగా దినోత్సవం ఐరాస నిర్వహించిందనీ అన్నిటినీ ఆ దిశలోనే చూపించే ప్రయత్నం పెద్ద ఎత్తున జరిగింది. అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ వున్నప్పుడు ఇది పరాకాష్టకు చేరడం చూశాం. ఇలా మోడీ సర్కారును తమతో తిప్పుకుంటూనే పాశ్చాత్య దేశాలు అక్కడున్న వివిధ రకాల విచ్ఛిన్న శక్తులను స్వప్రయోజనాలకు ఉపయోగించాయి. ఎందుకంటే వర్ధమాన దేశాలు సుస్థిరంగా వుండటం వాటి ప్రయోజనాలకే విరుద్ధం.

ఈ దేశంలోనే హిందూ రాష్ట్రమంటుంటే మేం ఎందుకు ఖలిస్తాన్ అడగొద్దని కెనడాలో ఈ శక్తులు మళ్లీ తలెత్తడం వాస్తవమే. నిజానికి ఆ దేశంలోనే గాక పైన చెప్పిన అయిదు దేశాల్లో కూడా రక రకాలైన భారత వ్యతిరేక శక్తులు గతంలో వలెనే ఇప్పుడు కూడా ప్రచారాలు కార్య కలాపాలు సాగిస్తుంటే ఆ దేశాల పాలకులు యథేచ్ఛగా సాగనిస్తున్నారు. మరో వైపున దేశంలో మత రాజకీయాలకు తోడు మోడీ భజన పెంచుకోవడానికి హిందూత్వ ముద్రతో విదేశాల్లోనూ ప్రచారాలు చేసిన నేపథ్యం బీజేపీది. టెర్రరిజంపై పోరాటం పేరిట అమెరికాకు ఉపగ్రహంగా మారింది.

ఖలీస్తానీ పీఠంగా కెనడా

జీ7 ఆర్థిక కూటమిలో కెనడా ఒక కీలక భాగస్వామ్య దేశం. అమెరికాలా ప్రత్యక్షంగా ప్రపంచ రాజకీయాలలో ముఖ్యపాత్రలో కనిపించకపోయినా పెట్టుబడిదారీ కూటమిలో దానికి బలమైన స్థానమే వుంది. ఇండియాతో వ్యాపార సంబంధాలు పాటించే దేశాలలో కెనడాది పదోస్థానం. దేశంలో పెట్టుబడులు పెట్టిన విదేశాలలో 4500 కోట్ల డాలర్లతో దానికి నాలుగో స్థానం. భారతీయులు కెనడాలో పెద్ద సంఖ్యలోనే వున్నారు. సిక్కులు ప్రధానంగా వున్నా మళయాలీలు తెలుగువారు కూడా తక్కువ కాదు. ఆ దేశ రాజకీయ ఫలితాలను కూడా వీరు ప్రభావితం చేయగలరు. బీజేపీ గద్దెక్కిన తర్వాతనే వారు మళ్లీ సిక్కులకు స్వంతదేశంగా ఖలిస్తాన్ కావాలనే పాట ఎత్తుకున్నారు.అంతటితో ఆగక అక్కడున్న హిందువులు కెనడా వదలిపోవాలని బెదిరించడం ప్రారంభించారు. అమెరికాలోని ఖలిస్తానీ ఉగ్రవాది గురుప్రీత్ పన్నుం ఇందుకు నాయకత్వం వహించాడు. అమెరికా, కెనడా ఇరుదేశాల పౌరసత్వం గల పన్నుం వాస్తవానికి సిఐఎ ఏజెంటనే సందేహాలున్నాయి. పంజాబ్‌లోని అతని ఆస్తులను ప్రభుత్వం స్వాధీన పర్చుకుంది. ఖలిస్తానీల చర్యల వల్ల పెరుగుతున్న ఉద్రిక్తతలను అదుపు చేయాలనీ, ఆ శక్తులకు అవకాశమివ్వద్దనీ ఎంత కోరినా కెనడా అలసత్వమే ప్రదర్శించింది. ముఖ్యంగా నిజ్జర్ నాయకత్వంలోని ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ అనే సంస్థ అనేక ఉగ్రవాద చర్యలకు పాల్పడింది. తనను అప్పగించాలని ఇండియా ఎప్పటినుంచో కోరుతూ వచ్చింది. కెనడా ప్రభుత్వానికి ఆధారాలు సమర్పించింది. అయినా ప్రయోజనం లేకపోగా వారికి వత్తాసు లభించింది. ఈ నేపథ్యంలోనే మొన్న జులైలో వాంకోవర్ సమీపంలో సర్రే అనే చోట గల గురుద్వారా దగ్గర నిజర్ హత్యకు గురైనాడు. దీనిపై దర్యాప్తు జరిపి దోషులను శిక్షించడం మానేసి కెనడా ఇందులో భారత దేశ హస్తం వుందని ఆరోపణలు చేస్తున్నది. రహస్య గూఢచారి సంస్థ రా ఏజెంట్లు పాల్గొన్నారని అంటోంది. ఇందుకు సంబంధించిన ఆధారాలు జీ20 సందర్భంలో ప్రధాని మోడీకి అప్పగించినా ఫలితం లేదని ఆరోపిస్తున్నది. మరోవైపున భారత్ విదేశాలలో చొరబడి హత్యలు చేయించే పద్ధతి తమకు లేదని ఖండించింది. కెనడా ప్రధాని ట్రూడే చెబుతున్నది తమ దేశ విధానంతో పొసగదని విదేశాంగ మంత్రి జైశంకర్ తాజాగా అమెరికాలో వివరించారు. సరైన సాక్ష్యాధారాలు అందిస్తే పరిశీలిస్తామన్నారు. కాని కెనడా చెప్పే విషయం సీరియస్‌గా తీసుకోవాలని అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ కూడా గట్టిగా కోరారు. ఇంత బాధ్యతాయుతంగా ఫిర్యాదు చేస్తుంటే ఆ స్థాయిలో స్పందన వుండాలని అమెరికా అంటుంది. 28వ తేదీన జైశంకర్ బ్లింకెన్‌తో చర్చలు జరిపారు కూడా. 1980ల నుంచి కెనడా ఖలీస్తానీ వాదుల కార్యకలాపాలకు స్థానం కల్పిస్తున్నదని ఆయన



మరోసారి ఆరోపించారు. నేరపూరిత శక్తులు,మానవ రవాణా, విచ్ఛిన్నముఠాల కలయికగా కెనడా మారిపోయిందని విమర్శించారు. ఆఖరుకు బారత రాయబార వర్గాలకు కూడా కెనడాలో రక్షణ లేకుండా పోయిందన్నారు. మొత్తంపైన కెనడా ఫిర్యాదును భారత దేశం పూర్తిగా తోసిపుచ్చడమేగాక ప్రత్యారోపణలు చేస్తున్నదన్నమాట. ఆ విధంగా ఇరుదేశాల సంబంధాలు వేగంగా దిగజారాయి.

అంతర్గత రాజకీయ కోణాలు

జీ20 సమావేశాల సందర్భంలోనూ మోడీ ట్రూడే పది నిముషాలు మాత్రమే అది కూడా ఏదో వేరే సందర్భంలో మాట్లాడుకున్నారు. మరోవంక 14 దేశాలతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన మోడీ ఆయన కలవలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.ఆ వెంటనే కెనడా భారత రాయబార కార్యాలయంలో ఒకరిని బహిష్కరించడం, ఢిల్లీలో కెనడా రాయబార సిబ్బందిని వెనక్కుపంపడం వెంటవెంటనే జరిగిపోయాయి. వాణిజ్య చర్చలను కూడా కెనడానిలిపేసింది. ఇక ఇండియా కెనడా వారికి వీసాలను ఆపేసింది.ఐరాస వేదికపై కెనడా ధోరణిని ఖండిస్తూ మంత్రి జైశంకర్ ఉగ్రవాదంపై పోరాటం తమ ఇష్టాలను బట్టి మారిపోకూడదని అంటే ఇతర దేశాల్లో తలదూర్చే ధోరణి ప్రజాస్వామ్యం కాదని ఆ ఆదేశం ఎదురు ఆరోపించింది. ఈ వూపులోనే చైనాతో కెనడాకు నిగూఢ సంబంధాలున్నాయనే ఆరోపణ కూడా భారత వైఖరికి కారణమంటున్నారు. ఈ విధంగా కెనడాకు గట్టిపాఠం నేర్పాలనే మోడీ వైఖరి సరైందని కొందరు కీర్తిస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మరో పుల్వామాలా మరో సర్జికల్ స్ట్రయిక్‌గా దీన్ని ఉపయోగిస్తున్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో పాకిస్తాన్ కెనడాకు మద్దతుగా మాట్లాడటం కూడా ఈ శక్తులకు వూతమిస్తున్నది.

మొత్తంపైన అనేక కోణాల్లో చూసినపుడు ఈ దౌత్య సంఘర్షణ వెనక బలమైన అంతర్జాతీయ కారణాలు కనిపిస్తాయి. వచ్చే ఎన్నికల రాజకీయాలలో మోడీ తలమునకల వుతున్నట్టే ట్రూడే మరింత తీవ్ర సవాళ్లు ఎదుర్కొంటున్నారు. లిబరల్ పార్టీ నాయకుడైన ట్రూడే అసంతృప్తికి ఎదురీదుతున్నారు. తను అధికారంలో కొనసాగాలంటే ఖలీస్తానీ అనుకూలమైన న్యూ డెమొక్రటిక్ పార్టీ మద్దతు తప్పనిసరి. ఖలిస్తానీ మద్దతు దారులను బుజ్జగించడానికి ఒక దారి మళ్లింపు ఎత్తుగడ అవసరమైందంటున్నారు. ఏదో విధంగా పట్టు చూపించుకోకపోతే తనను తప్పించి మరొకరిని ప్రధాని అభ్యర్థిని చేస్తారనేది ఆయన భయం.అందుకే భారత్‌తో సంబంధాలు దెబ్బతింటాయని తెలిసీ ఈ రాజకీయ నాటకం నడిపిస్తున్నారని విమర్శకుల మాట. తనతో పాటు మిగిలిన నాలుగు దేశాలను కూడా ఆయన ఒత్తిడి చేస్తున్నారట. ఫలితమే అమెరికా కూడా వంత పాడటం. అమెరికాలోనూ ఎన్నికలు రానున్నాయి. ఇండియా ఎన్నికల ముంగిట్లో వుంది. కెనడా ఇచ్చింది దర్యాప్తుకు ఉపయోగపడే అంశం తప్ప ఖచ్చితమైన సాక్ష్యం కాదని ఇప్పటికీ దర్యాప్తు పూర్తి చేసింది లేదని బలమైంది కాకుంటే ఇండియా వాదన. బలంలేకుంటే ఆ దేశం ఇంత దూరం తెస్తుందా అనేది వారిని బలపర్చే దేశాల వాదన, ఏ విధంగా చూసినా ఇప్పుడు సమగ్రమైన దర్యాప్తు చేయడం ఒక్కటే పరిష్కారం. బారతదేశం కూడా అందుకు సహకరించి దౌత్య సంబంధాలు దెబ్బ తినకుండా చూడాలనేది నిపుణుల ఏకోన్ముఖ అభిప్రాయం. ట్రూడే లేదా మోడీ ఎవరి ప్రయోజనాలకోసమైనా ప్రతిష్ట కోసమైనా దీన్ని సాగదీయడం శ్రేయస్కరం కాదు.అలాగే మన విదేశీ మోత, విశ్వగురు భజన కూడా తగ్గించుకుని దేశ ప్రయోజనాలను శాంతిని కాపాడుకోవడం అవసరం. గతంలో మైన్మార్, శ్రీలంక, నేపాల్, బర్మా వంటి దేశాలతో సంబం ధాలలో దూకుడు ఎలాంటి పరిణామాలకు దారణమైందో మర్చిపోతే కష్టం. ■

అనేక కోణాల్లో చూసినపుడు ఈ దౌత్య సంఘర్షణ వెనక బలమైన అంతర్జాతీయ కారణాలు కనిపిస్తాయి. వచ్చే ఎన్నికల రాజకీయాలలో మోడీ తలమునకలవు తున్నట్టే ట్రూడే మరింత తీవ్ర సవాళ్లు ఎదుర్కొంటున్నారు. లిబరల్ పార్టీ నాయకుడైన ట్రూడే అసంతృప్తికి ఎదురీదుతున్నారు. తను అధికారంలో కొనసాగాలంటే ఖలీస్తానీ అనుకూలమైన న్యూ డెమొక్రటిక్ పార్టీ మద్దతు తప్పనిసరి. ఖలిస్తానీ మద్దతుదారులను బుజ్జగించ డానికి ఒక దారి మళ్లింపు ఎత్తుగడ అవసరమైందంటున్నారు. ఏదో విధంగా పట్టు చూపించుకోకపోతే తనను తప్పించి మరొకరిని ప్రధాని అభ్యర్థిని చేస్తారనేది ఆయన భయం.అందుకే భారత్‌తో సంబంధాలు దెబ్బతింటాయని తెలిసీ ఈ రాజకీయ నాటకం నడిపిస్తున్నారని విమర్శకుల మాట.

మిథ్యా కిరీటం

కొండను తొవ్వి ఎలక పట్టినట్టు
విద్వేషాన్ని
పరిపూర్ణ వ్యతిరేకతనీ
కలగలిపి
నూరి
శోధించి సాధించి
కాయో పండో

పండో కాయో తెలియని
పండుకాయ
కాయపండు
పార్లమెంటుకు తెచ్చారు

మిథ్యాకిరీటం పెట్టి
ఆమెకు
ఓట్లమాయవల
వేద్దామనే-

యాభయారించుల గాలి
ఎగబీల్చి
చూపుదట్టించి
కరిమింగి
విసరించిన
వెలగపండు నవిష్కరించారు

మూటల కొద్ది మాటలమండె కట్టి
కడవల కొద్ది
ఆనంద కన్నీళ్ళు చల్లారు

కర్రసాములు కత్తిసాములు
నృత్యాలు పురస్కారనటనలు
భారీగా
మోహరించారు

ఎప్పుడో తెలియని
పెండ్లికి
ఇప్పటినుంచే
బాజా భజంత్రీలు మొదలు
పెట్టారు

కూర్చోబెట్టి
ముందు
కోట శ్రీనివాస్రావులా
కోన్ని వేలాడదీశారు

కడుపునిండా తినండని !
ఖాళీ
విస్తర్లు వేశారు

- వడ్డెబోయిన శ్రీనివాస్



మహాత్మున్ని బలి తీసుకున్న మతోన్మాదులు



ఎస్. వినయకుమార్

భారత స్వాతంత్ర్యోద్యమంలోకి జన బాహుళ్యాన్ని సమీకరించిన నాయకుడు మహాత్మా గాంధీ. దక్షిణాఫ్రికాలో వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన గాంధీజీ అనుభవంతో, స్వదేశానికి చేరి స్వాతంత్ర్య పోరాటంలో భాగమయ్యారు. క్రమంగా కాంగ్రెస్‌లో తిరుగులేని నాయకుడై వివిధ తరగతుల ప్రజలను పోరాటంలోకి సమీకరించారు. తిలక్ మరణం తర్వాత ఆ స్థానం స్వీకరించిన గాంధీజీ పోరాటంలో నూతన ఒరవడులు సృష్టించారు. గాంధీజీ 1869లో అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోరుబందర్‌లో పుట్టారు. తండ్రి దివాన్ కరంచంద్. 1891లో గాంధీజీ లండన్‌లో బారిష్టర్ పట్టా తీసుకొన్నాడు. తాను సనాతనుడిని అని చెప్పుకొంటూనే కులం కట్టుబాట్లను కాదని దళితులను సమీకరించడం వారి చేత దేవాలయాల ప్రవేశం చేయించడం, ముస్లింలు కూడా భారతీయులేనని, హిందువు లతో సమానమని చెప్పడం, దేశ విభజన తర్వాత చెలరేగిన మత కల్లోలాలను అరికట్టడానికి 75 ఏండ్ల వయస్సులో కూడా నిరాహార దీక్షలు చేసి పరిస్థితిని అదుపులోకి తేవడం నచ్చని మతోన్మాదులు మహాత్ముడిపై అతి దగ్గరి నుండి పిస్టల్‌తో కాల్చి హత్య చేశారు. ఆ పని చేసింది నాథురాం గాడ్సె అయినా ఆ కుట్రలో ఒక బృందమే ఉంది. ఆ కుట్రలో ప్రధాన పాత్రదారులైన గాడ్సె, ఆప్టేలకు ఉరిశిక్ష పడగా మిగతా వారికి జైలు శిక్షలు పడ్డాయి. కాని తెరవెనుక ఉండి వారికి సహకరించిన, ప్రోత్సహించిన వారు మాత్రం గాడ్సె, ఆప్టేల మౌనం వల్ల, సమగ్ర దర్యాప్తు జరగనందున శిక్షల నుండి తప్పించుకొన్నారు.

గాంధీజీ హత్య కేసులో ఒక ముద్దాయిగా బోనెక్కిన సావర్కర్ తిలక్ ద్వారా సంపాదించిన స్కాలర్‌షిప్‌తో ఉన్నత చదువు కోసం ఇంగ్లండ్ వెళ్లాడు. సావర్కర్ ఆదేశంతో మదన్ లాల్ ఢింగ్రా అనే యువకుడు లండన్‌లోని ఉన్న ఇంగ్లీష్ తాధికారి కర్జన్ విల్లీని కాల్చిచంపాడు. బ్రిటిష్ పోలీసులు డింగ్రాను ఉరి తీశారు. సరైన సాక్ష్యం లేనందున సావర్కర్ ఆ కేసు నుండి బయటపడ్డాడు. సావర్కర్ ఎప్పుడూ తెరవెనుక సూత్రధారిగా ఉంటూ, ఆదేశాలు జారీ చేసేవాడు అని ప్రతీతి. ఆ తర్వాత లండన్ నుండి రెండు పిస్టళ్లను భారతదేశానికి పంపాడు. వాటిలో ఒక పిస్టల్‌తో ఇండియాలో జాక్సన్ అనే అధికారిని చంపారు. ఆ కేసులో అరెస్టు అవుతాననే ముందు జాగ్రత్తగా లండన్ నుండి పారిస్ వెళ్లాడు. అంతా సద్దుమణిగిందని భ్రమించి లండన్‌కు తిరిగి రాగా రైలు స్టేషన్‌లోనే బ్రిటిష్ పోలీసులు అరెస్టు చేసి ఇండియాకు తెచ్చి విచారణ జరిపారు.ఆయనకు రెండు యావజ్జీవ శిక్షలు, అంటే 50 ఏండ్ల శిక్షవేసి అండమాన్ జెయిల్‌కు పంపారు. కాని కొన్నేళ్లలోనే సావర్కర్ బ్రిటిష్ పాలకుల క్షమాభిక్ష పొందారు. తన దయా భిక్ష లేఖలో పేర్కొన్నట్లుగాను విడుదల తర్వాత సావర్కర్ ఏ బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలోనూ పాల్గొనలేదు.

మహాత్మాగాంధీ రత్నగిరి వెళ్లి సావర్కర్‌ను కలిసినా ఫలితం లేకపోయింది. ఘర్‌వాపసీ, అంటరానితనంపై గాంధీజీ ఆయన అభిప్రాయాలు అడిగారు. ఇద్దరి అభిప్రాయాల మధ్య పొందిక కుదర్లేదు. రత్నగిరి జిల్లాను దాటి వెళ్లరాదన్న ఆంక్షలు తొలిగాక బాంబాయి ప్రావియెన్స్, సెంట్రల్ ప్రావియెన్స్‌ల్లో ఆర్ఎస్ఎస్ సావర్కర్‌కు స్వాగత సభలు ఏర్పాటు చేసింది. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెడ్గేవార్ స్వయంగా వాటిలో పాల్గొన్నారు. అయితే హిందూ మహాసభకు తాను అధ్యక్షుడయ్యాక. హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్‌లను విలీనం చేయాలని సావర్కర్ ప్రతిపాదించినా హెడ్గేవార్ ఒప్పుకోలేదు.

దేశ విభజనకు గాంధీ నెహ్రూలు కారణమని ఆర్ఎస్ఎస్ ఆరోపించినా వాస్తవం ఏమిటంటే సావర్కర్ 1923లోనే "హిందూత్వం - ఎవరు హిందువులు" అన్న పుస్తకం రాశారు. అందులో ఇండియా హిందువులది మాత్రమేనని వాదించారు. దేశవిభజనకు ఆ పుస్తకంతో బీజం వేసినట్లయింది. ముస్లిం లీగ్ అధ్యక్షుడు మహ్మదలీలో జిన్నా 1940లో మాత్రమే భారత దేశాన్ని మత ప్రాతిపదికపై విభజించాలని కోరాడు. విభజించు -పాలించు వ్యూహాన్ని అనుసరించిన బ్రిటిష్ పాలకులకు కూడా కావాల్సింది అదే కాదా! వెళ్లే ముందు వారు దేశాన్ని విభజించి పెద్ద చిచ్చుపెట్టారు. భారతదేశం హిందువులదని, వారు మాత్రమే పూర్తి పౌరసత్వంలో దేశంలో ఉండాలని మిగతా మతాల వారు భారతదేశంలో ఉండదల్చితే రెండవ తరగతి పౌరులుగా మాత్రమే ఉండాలన్న వాదనను ఆర్ఎస్ఎస్ నాడు నేడు చేస్తోంది. సావర్కర్ ముందు హిందూ మహాసభ అధ్యక్షుడిగా ఉండిన మూంజే ఆర్ఎస్ఎస్ అభివృద్ధికి సహకరించాడు. మూంజె తాను ఇంగ్లండ్ వెళ్లి తిరిగొస్తూ ఇటలీలో ఆగాడు. ఫాసిస్ట్ పార్టీ అధ్యక్షుడు, నియంత అయిన ముస్సోలినీని, ఆ పార్టీ ఇతర నాయకులను కలిసి వచ్చాడు. వారి సూచనలను హిందూ మహాసభలోనూ, ఆర్ఎస్ఎస్‌లోనూ ఆయన అమలు చేశాడు.

ఆర్ఎస్ఎస్‌లో ఉంటూనే 1938లో గాడ్సె అధికారికంగా హిందూ మహాసభలో చేరాడు గాడ్సె. ఒకే వ్యక్తి రెండు సంస్థలోనూ సభ్యులుగా ఉండేవారు. తిలక్ మరణం తర్వాత చిత్పవన్ బ్రాహ్మణ అనుచరులు కాంగ్రెసును వదిలి ఆర్ఎస్ఎస్ లో



చేరారు. స్వాతంత్ర్యం తర్వాత బ్రాహ్మణాధిక్యతను పునరుద్ధరించాలని కోరుకొనేవారికి, వైశ్యుడైన గాంధీజీ కాంగ్రెస్‌కు నాయకుడు కావడం నచ్చలేదు. తిలక్ ప్రారంభించిన కేసరి పత్రిక మతవాదుల పత్రిక అయింది. అందులో నియంతృత్వాన్ని సమర్థిస్తూ వరుసబెట్టి వ్యాసాలు రాసేవారు. పూనాలోని తిలక్ స్మారక మందిరం కూడా హిందూ మతవాదుల అడ్డా అయింది. అక్కడ జరిగే సభల్లో గాడ్సె తాను ఆ ముసలాడిని (గాంధీజీని) చంపుతానని ఆవేశంతో ఊగిపోతూ ప్రసంగించేవాడట. సావర్కర్ రత్నగిరిలో ఉన్నప్పుడు కుర్రవాడైన గాడ్సె కూడా అక్కడ ఉండేవాడు. గాడ్సె కూడా చిత్పవన్ బ్రాహ్మణుడే కనుక ఇద్దరి మధ్య గురుశిష్య బంధం త్వరలోనే బలపడింది. కాని ఆ క్రమంలోనే తన కొడుకు మహాత్మాగాంధీనీ హత్య చేసి ఉరితీయబడతానని గాడ్సె తండ్రి ఆరోజు ఊహించలేడు కదా?

1946లో జరిగిన హిందూ మహాసభ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందూ మహాసభ చేరరాదన్న గాడ్సె వాదన వీగి పోయింది. ఇకనేం గాడ్సె సభకు అధ్యక్షత వహించిన ఎల్.బి.బోపాల్కర్‌పై కత్తి దూసి దాడి చేయబోయాడు. ఇతరులు అడ్డుకొని అధ్యక్షుడిని కాపాడారు. ఆ తీర్మానం ప్రకారమే శ్యామప్రసాద్ ముఖర్జీ నెహ్రూ మంత్రివర్గంలో సభ్యుడయ్యారు. తన తండ్రికి చేదోడుగా ఉండటానికి గాడ్సె టైలరింగ్ నేర్చికొని పూనాలో టైలర్ షాపు పెట్టాడు. అక్కడ ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో పాల్గొనేవాడు. ఆ దర్జీ దుకాణం ఆర్ఎస్ఎస్‌కు ఒక అడ్డాగా మారింది. సావర్కర్ సాయంతో గాడ్సె, ఆప్టేలు హిందూ రాష్ట్రీయ దళ్ (హెచ్ఆర్‌డి) అనే సంస్థను నెలకొల్పి, అందులో సైద్ధాంతిక, శారీరక శిక్షణను ఇచ్చేవాడు. రైఫిల్ ఉపయోగించడం, గుర్రపు స్వారీ చేయడం వగైరా నేర్పేవారు. మతతత్వ మేధావులు హెచ్ఆర్‌డి క్యాంపులో ముస్లింలకు క్రైస్తవులకు వ్యతిరేకంగా ద్వేషం నూరి పోసేవారు. 1940లో బ్రిటిష్ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ శాఖల నిర్వహణను నిషేధించింది. కనుక ఆ సంస్థ సభ్యులు హెచ్ఆర్‌డి క్యాంపుల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనేవారు. ఆ తర్వాత సావర్కర్ సాయంతో గాడ్సె ఎడిటర్‌గా మొదట "అగ్రణి" పత్రికను కొని నడిపాడు. దానికి జనరల్ మేనేజర్ ఆప్టే. దాని ద్వేషపూరిత రాతలపై బొంబాయి ప్రభుత్వం జుల్మా నాలు వేసేది. జుల్మానాలను మాఫీ చేయించుకోవడానికి గాడ్సె అప్పటి బొంబాయి ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయిని కలిశాడు కూడా. ఆ జుల్మానాలను సావర్కర్ చెల్లించేవాడని దర్యాప్తులో బయట పడింది, జుల్మానాలను తప్పించుకోవడానికి "అగ్రణి"ని మూసేసి మరో పత్రికను గాడ్సె, ఆప్టేలు ప్రారంభించారు.

గాంధీజీని చంపడానికి 1948 జనవరి 20న చేసిన మొదటి ప్రయత్నంలో గాడ్సె బృందం విఫలమైంది. హత్య చేయడానికి వెళ్తూ గాడ్సె బృందం బొంబాయిలో ఆగి సావర్కర్‌ను కలిశారు. గాడ్సె, ఆప్టేలకు వీడ్కోలు చెప్పడానికి మొదటి అంతస్తు నుండి దిగివస్తూ సావర్కర్ వారిని 'విజయీభవ' అని దీవించినట్లు దర్యాప్తులో తెలిసింది. జనవరి 30వ తేది సాయంత్రం రెండవ ప్రయత్నంలో గాడ్సె నేరుగా గాంధీజీ ముందుకు వెళ్లి అతి దగ్గర నుండి కాల్పులు జరిపాడు. చని పోవడానికి ముందు గాంధీజీ బెంగాల్‌లోని నౌఖాలిలో మత ఘర్షణలను ఆపడానికి ఆమరణ విరాహారదీక్ష చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చాడు. ఢిల్లీలో కూడా అలాంటి పరిస్థితే తలెత్తిందని తెలిసి ఢిల్లీ వచ్చి అక్కడ నిరాహార దీక్ష మొదలెట్టారు. ఢిల్లీ పరిస్థితి అదుపులోకి వచ్చింది. రెండు పక్షాలవారు గాంధీజీ ముందు హింసాకాండను ఆపేస్తామని ప్రమాణాలు చేశారు.

గాంధీ హత్య వెనుక పెద్ద కుట్రే ఉందని గాడ్సె జేబులో దొరికిన ఒక నోట్‌బుక్ ధ్రువపర్చింది. తాము పూణేలో హత్యా సన్నాహాలు ప్రారంభించినప్పటి నుండి దేనికి ఎంత ఖర్చు బెట్టింది ఎవరికి ఎంత ఇచ్చింది గాడ్సె రాసుకొన్నాడు. దాంతో కుట్రదారులందరినీ పోలీసులు కొద్ది గంటల్లోనే అరెస్టు చేయగలిగారు. ఆ సందర్భంగా తాము సావర్కర్‌ను కూడా అరెస్టు చేయడానికి అనుమతి కోరినా ప్రభుత్వం అమోదం తెల్పలేదని ఒక దర్యాప్తు అధికారి ఆ తర్వాత తెలిపారు. సాయంత్రం 5.17 నిమిషాలకు హత్య జరిగింది. రాత్రి 10.30 వార్తల్లో గాంధీని చంపింది పూణే వాసి నాథురాం గాడ్సె అని రేడియోలో వెల్లడించారు. కోపొద్రిక్తులైన ప్రజలు దేశంలో అనేక చోట్ల ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభల కార్యాలయాలపై పడ్డారు. పూణేలోని గాడ్సె తమ్ముడి పరిశ్రమను తగలబెట్టారు. పూణే జిల్లా కలెక్టర్ ముందు జాగ్రత వల్ల గాడ్సె తల్లితండ్రులకు ప్రమాదం తప్పింది. బొంబాయిలో దాదాపు వేయిమంది కాగడాలతో సావర్కర్ సదన్‌ను చుట్టుముట్టి తగలబెట్టడానికి ప్రయత్నించారు. పోలీ సులు సకాలంలో అక్కడికి చేరుకొని సావర్కర్‌ను అతని సదన్ నూ కాపాడారు. ఈ విషయం తెలుసు కొన్నప్పుడు గోద్రాలో జరిగిన ఘోరకృత్యం అనంతరం అహ్మదాబాద్‌లో ముస్లింలపై జరిగిన మారణకాండ ఎవరికైనా గుర్తుకు వస్తుంది. మహాత్మాగాంధీ అంతటి నాయకుడి హత్య తర్వాత చెలరేగిన కోపాగ్నిని అప్పటి ప్రభుత్వాలు కొద్దిపాటి నష్టంలో చల్లార్చాయి. కాని అహ్మదాబాదులో జరిగిందేమిటి? వేలాది మంది చనిపోయాకే అహ్మదాబాదు వీధుల్లోకి చేరిన సైన్యం వెళ్లింది. ఇందిరాగాంధీ హత్య అనంతరం ఢిల్లీలో సిక్కులపై సాగిన హింసాకాండ కూడా అలాంటిదే. మానవ హక్కుల పట్ల చిత్తశుద్ధి లేని ఇలాంటి ప్రభుత్వాలే గాంధీజీ హత్య జరిగినప్పుడు ఉంటే ఎంత జననష్టం, ఎంత ఆస్తి నష్టం జరిగి ఉండేదో! హత్య చేయడానికి చాలా కాలం ముందే గాడ్సె తను సంస్థలో లేడని ఆర్ఎస్ఎస్ ప్రకటించినా నాగ్‌పూర్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో సోదా సందర్భంగా లభించిన మినిట్స్ పుస్తకంలో ఆర్ఎస్ఎస్ ప్రముఖుల సమావేశంలో గాడ్సె పాల్గొన్నట్లు నమోదై వుంది.

(అక్టోబరు 02 గాంధీ జయంతి)

బిజినెస్

వేడుకగా ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్స్ ప్రదానం



హైదరాబాద్ : వివిధ రంగాలకు చెందిన అసాధారణ వ్యక్తులకు "ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్ 2023-సదరన్ ఇండియా" అవార్డులను ప్రదానం చేశారు. ఆసియా టుడే రీసెర్చ్ అండ్ మీడియా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ పాల్గొని అవార్డులను బహూకరించారు. కళలు, వినోదం, విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యాపారం, సామాజిక సేవా రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి ఈ అవార్డులను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రూ.2000 నోట్ల మార్పిడికి గడువు పెంపు

- అక్టోబర్ 7వరకు అవకాశం : ఆర్‌బిఐ వెల్లడి



ముంబయి : రూ.2,000 నోట్ల మార్పిడికి గడువు పెంచుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నిర్ణయం తీసుకుంది. పెద్ద నోటు మార్పిడి, డిపాజిట్‌కు తొలుత సెప్టెంబర్ 30 నాటికి గడువు విధించిన విషయం తెలిసిందే. అక్టోబర్ 7వరకు ప్రజలు నోట్లను మార్చుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్‌బిఐ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. రూ.2000 నోట్ల ఉపసంహరణపై సమీక్ష జరిపిన ఆర్‌బిఐ మరోసారి నోట్లను మార్చుకునేందుకు గడువును పొడిగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. అప్పటి వరకు ప్రస్తుతం చెలామణిలో ఉన్న రూ.2వేలనోట్లు చట్టబద్ధంగా చెల్లుబాటవుతాయని స్పష్టం చేసింది. 2023 మే 16న రూ.2వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బిఐ వెల్లడించింది. దాదాపు 93 శాతం నోట్లు బ్యాంక్‌లకు తిరిగి వచ్చాయని సెప్టెంబర్ 2న తెలిపింది. బ్యాంక్‌లకు చేరిన మొత్తం నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలోకి రాగా.. 13 శాతం కరెన్సీ నోట్ల రూపంలోకి మార్చుకున్నారు. ఎవరివద్దనైనా రూ.2000 నోట్లు ఉంటే ఈ వారం రోజుల్లోనే బ్యాంకుల్లో, పోస్టాఫీస్‌లలో మార్చుకోవచ్చని సూచించింది.

ఎస్‌బిఐ 'వెల్త్ హబ్' ప్రారంభం



హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) సికింద్రాబాద్‌లో మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు సంబంధించిన వెల్త్ హబ్‌ను ఏర్పాటు చేసింది. శనివారం దీనిని హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్, ఎస్‌బిఐ కార్పోరేట్ సెంటర్ ముంబయి సిజిఎం (వెల్త్ అండ్ ప్రీమియర్ బ్యాంకింగ్) సుఖిందర్ కౌర్ లాంచనంగా ప్రారంభించారు. దేశంలో ఎస్‌బిఐ వెల్త్ ప్రస్తుతం 102 ప్రధాన నగరాల్లో 232 వెల్త్ హబ్స్‌ను కలిగి ఉంది. అధిక ఆదాయం కలిగిన 3,75,000 క్లయింట్లకు సర్వీసును అందిస్తుంది. దాదాపు రూ.3 లక్షల కోట్ల ఎయుఎంను కలిగి ఉంది.

2024 మార్చి ముగింపు నాటికి 4.50 లక్షల క్లయింట్లతో రూ.4 లక్షల ఎయుఎంకు చేరాలని లక్ష్యంగా పెట్టుకుందని రాజేష్ కుమార్ అన్నారు. హైదరాబాద్‌లో ఇది తమకు 12 హెల్త్ హబ్ అని తెలిపారు. అధిక ఆదాయాలు కలిగిన క్లయింట్లకు ప్రత్యేక సర్వీసులను అందించడమే వీటి లక్ష్యమని పేర్కొన్నారు. ప్రముఖ ఫండ్ సంస్థల నుంచి అధిక ఆదాయాలు కలిగిన వారికి అన్ని కేటగిరీల్లో ఆకర్షణీయ ప్రొడక్ట్స్‌ను అందిస్తున్నామన్నారు. ఎన్‌ఆర్‌ఐల కోసం కొచ్చిలోనూ గ్లోబల్ ఇ-వెల్త్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఎస్‌బిఐ తెలిపింది.

టిసిఎస్‌లో ఇంటి నుంచి పనికి స్వస్తి..!

న్యూఢిల్లీ : కరోనా సమయం నుంచి ఇంటి నుంచి పని చేస్తున్న ఉద్యోగులు ఇకపై ఆఫీసుకు రావాల్సిందేనని ఐటి కంపెనీలు వరుసగా ఆదేశాలు జారీ చేస్తున్నాయి. తాజాగా దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ఇంటి నుంచి పని విధానం (వర్క్ ఫ్రం హోం)కు స్వస్తి పలకాలని నిర్ణయించింది. అక్టోబర్ 1 నుంచి వారంలో ఐదు రోజులు కచ్చితంగా కార్యాలయాలకు వచ్చి పని చేయాల్సిందేనని ఉద్యోగులకు మెయిల్స్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు రిపోర్ట్‌లు వస్తున్నాయి.

కరోనా తగ్గుముఖం పట్టినప్పటి నుంచి హైబ్రిడ్ వర్క్ పద్ధతికి అనుమతించింది. దీంతో వారంలో సగం రోజులు కార్యాలయాలకు వచ్చి.. మిగితా రోజులు ఇంటి నుంచి పని చేస్తున్నారు. ఇకపై ఆ మిగిలిన రెండు రోజులు కూడా ఆఫీసుకు రావాల్సిందేనని టిసిఎస్ సిఇఒ, చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ పేరిట ఉద్యోగులకు ఆదేశాలు వెళ్లాయని తెలిసింది.

పబ్లిక్ ఇష్యూకు అజాద్ ఇంజినీరింగ్

- సెబీకి దరఖాస్తు

హైదరాబాద్ : ఆజాద్ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానుంది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ సంస్థ మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)కి దరఖాస్తు చేసుకుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదిత విధాన పత్రాలను సమర్పించింది. ఈ ఇష్యూలో రూ.740 కోట్ల నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.240 కోట్లు, ప్రమోటర్ల వాటాలను విక్రయించడం ద్వారా మరో రూ.500 కోట్ల నిధులు పొందాలని నిర్దేశించుకుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.2,517 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. ప్రతీ ఏడాది సగటున 27 శాతం వృద్ధిని సాధిస్తోంది. ఈ ఇష్యూకు యాక్సిస్ కాపిటల్, ఐసిఐసిఐ సెక్యూరిటీస్, ఎస్‌బిఐ కాపిటల్ మార్కెట్స్, ఆనంద్ రతి సంస్థలు లీడ్ మేనేజర్స్‌గా వ్యవహరించనున్నాయి.

నేటి నుంచి ఆన్‌లైన్ గేమింగ్‌పై 18 శాతం జిఎస్‌టి

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ గేమింగ్‌పై నేటి నుంచి జిఎస్‌టి అధిక పన్ను శాతం అమల్లోకి రానుంది. అక్టోబర్ 1 నుంచి ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలు, గుర్రపు పందెం క్లబ్‌లలో బెట్టింగ్‌ల తదితర వాటిపై 28 శాతం పన్ను విధించేలా వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) విధించనున్నారు. దీనికి ఆగస్టు 2వ తేదీన జరిగిన 51వ జిఎస్‌టి మండలి భేటీలో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఇంతక్రితం ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ, కొన్ని గుర్రపు పందెం క్లబ్‌లపై18 శాతం జిఎస్‌టి వసూలు చేశారు.

మారుతి సుజుకికి నోటీసులు..

దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకికి జిఎస్‌టి అధికారులు నోటీసులు ఇచ్చారు. వడ్డీ, పెనాల్టీలతో పాటు రివర్స్ ఛార్జ్ ప్రాతిపదికన నిర్దిష్ట సేవలకు సంబంధించి రూ. 139.3 కోట్లు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. జిఎస్‌టి అధికారుల నుంచి నోటీసు అందిన విషయం వాస్తవమేనని మారుతి సుజుకి తెలిపింది. దీనిపై వివరణ ఇవ్వనున్నట్లు పేర్కొంది.

విధుల కేటాయింపుల్లో వివక్ష

- స్టాఫ్ నర్సుల్లో పెరుగుతున్న అసంతృప్తి
- మెడికల్ సూపరింటెండెంట్ల జోక్యమూ సమస్యే



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆస్పత్రిలో క్రమమైన పద్ధతిలో చికిత్స జరగాలంటే రకరకాల క్యాడర్లు ఎవరికి నిర్దేశించిన పని వారు చేసుకోవాలి. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయి. అయినప్పటికీ ఏండ్ల తరబడి ఒకే చోట తిష్ట వేసిన అధికారులు, పెద్దల అండదండలు పుష్కలంగా తమకే ఉన్నాయనుకునే కొంత మంది తమకు అవసరం లేని విషయాల్లో జోక్యం చేసుకుంటూ ఆస్పత్రి పాలనా వాతావరణాన్ని పాడు చేస్తున్నారు. బోధనాస్పత్రుల్లో సాధారణంగా డాక్టర్లతో పాటు నర్సులు, పారామెడికల్ సిబ్బంది, నాలుగో తరగతి సిబ్బంది, ఇతర సహాయ సిబ్బంది పని చేస్తుంటారు. ప్రతి ఆస్పత్రిలోనూ నర్సుల సంఖ్య మిగిలిన వారితో పోలిస్తే ఎక్కువగా కనిపిస్తుంటుంది. రోగి చికిత్సకు సంబంధించి డాక్టర్లు నిర్దేశించిన ఔషధాలు వేయడం, ఇంజెక్షన్లు వేయడం దగ్గర నుంచి రోగికి కావాల్సిన గైడెన్స్ తదితర విషయాల్లో వీరిది కీలక పాత్ర. దీంతో నర్సులకు సంబంధించిన వ్యవహారాల్లో మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయి.

స్టాఫ్ నర్సులకు సంబంధించి తమకు నచ్చిన వారిని ఏండ్ల తరబడి ఒకే చోట కొనసాగిస్తున్నారు. తమకు నచ్చకపోతే తరచూ మార్చడం వంటివి చేస్తున్నట్టు సమాచారం. ఇదే విషయంపై ఇటీవల వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి చెందిన బాధిత స్టాఫ్ నర్సులు మాజీ మంత్రి కొండా సురేఖను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. దీనిపై ఆమె సంబంధిత ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు లేఖ రాయడంతో పాటు ఫోన్ చేసి మాట్లాడారు. అయితే ఈ పరిస్థితి ఎంజీఎం ఒక్క ఆస్పత్రికే పరిమితం కాలేదు. రాష్ట్రంలోని బోధనాస్పత్రులన్నింటిలో తక్కువ, ఎక్కువగా అధికారులపై స్టాఫ్ నర్సుల నుంచి వస్తున్న ఆరోపణలివే. నర్సులకు సంబంధించిన విషయాల్లో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ వన్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ 2 మాత్రమే జోక్యం చేసుకోవాలని నిబంధనలు చెబుతున్నాయి. ఎటువంటి అధికారిక విషయాల్లోనైనా మెడికల్ సూపరింటెండెంట్లు వీరితోనే చర్చించాల్సి ఉంటుంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ సూపరింటెండెంట్లు జోక్యం చేసుకుంటూ తమకు నచ్చిన వారిని కొనసాగింపజేస్తూ, నచ్చని వారిని వేధిస్తున్నారని వాపోతున్నారు. నైట్ డ్యూటీలు, సెలవులు, ఇతర సమస్యలను సృష్టిస్తున్నారని సమాచారం. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ వన్, గ్రేడ్ 2 లు తమ అధికారాన్ని ఉపయోగించుకోకుండా మెడికల్ సూపరింటెండెంట్లకు అప్పగించడంతో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో నర్సింగ్ సేవలు, వారి సమస్యలపై వైద్యారోగ్యశాఖ మంత్రి జోక్యం చేసుకుని పరిశీలించాలని కోరుతున్నారు.

మహిళారక్షిత సమాజం నిర్మిద్దాం

- రాష్ట్రంలో తగ్గిన మాతా శిశుమరణాలు
- స్త్రీ, శిశుసంక్షేమానికి ప్రభుత్వం కృషి : రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

మహిళారక్షిత సమాజం నిర్మిద్దామని, మహిళలకు అండగా నిలుద్దామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. పోషకాహార లోపాన్ని నివారించి, ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా చిలుకూరులోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణంలో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో శనివారం 'పోషణ మహ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని చెప్పారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలతో పోషణ పంచాయతీ కమిటీల సమావేశం ఏర్పాటు చేసి పోషణ లోపం, ఆరోగ్యంపై అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రీగార్డెన్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ఆదివాసీ, గిరిజన మహిళలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని శాశ్వతంగా దూరం చేసేందుకు తెలంగాణ సర్కారు 'గిరి పోషణ' కార్యక్రమాన్ని అమలు చేసిందన్నారు.

మహిళలకు సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు కానీ మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181 లేదా తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ వాట్సప్ హెల్ప్‌లైన్ నంబర్ 9490555533కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యులు షాహీన్ అఫ్రోజ్, కుమ్ర ఈశ్వరి భాయ్, కటారి రేవతిరావు, గద్దల పద్మ, సుధాం లక్ష్మి, కటారి రేవతిరావు, డైరెక్టర్ శారద, సెక్రెటరీ కృష్ణకుమారి, డీఆర్డీవో ప్రభాకర్, సీడీపీవో సృజన తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పొర్లు దండాలు

- ఇకనైనా ప్రభుత్వం కనికరించాలని వినతి



నవతెలంగాణ- విలేకరులు

సమస్యలను పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు శనివారం పొర్లు దండాలు పెట్టి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ మొర ఆలకించాలని విన్నవించారు.

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు భిక్షాటన చేశారు. ఇబ్రహీంపట్నంలో పొర్లుదండాలతో ముఖ్యమంత్రికి నిరసన వ్యక్తం తెలిపారు. వికారాబాద్ జిల్లా యాలాలలో చేపట్టిన సమ్మెకు వ్యకాస జిల్లా అధ్యక్షులు బుగ్గప్ప మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టిన ఐసీడీఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు అంజన్న ఆలయంలో అంగన్‌వాడీ ఉద్యోగులు అంజన్నకు ముడుపు కట్టి పొర్లు దండాలు పెట్టారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ కలెక్టరేట్ల ఎదుట అంగన్‌వాడీలు పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. ఆసిఫాబాద్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఆదిలాబాద్‌లో జిల్లా అధ్యక్షుడు ఆశన్న పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలో అంగన్‌వాడీలకు దీక్షాశిబిరాన్ని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల డిమాండ్లు న్యాయమైనవి అన్నారు. మధిరలో అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని రామాలయంలో పొర్లు దండాలు పెట్టారు. చర్లలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. మర్రిగూడ మండలంలో వంటావార్పు నిర్వహించారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఆలేరులోని సాయిబాబా గుడి వద్ద అంగన్‌వాడీలు పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపారు.

ప్రయివేటు సెక్యూరిటీ గార్డులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

సీఐటీయూ జాతీయ నాయకులు ఎం.సాయిబాబు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రయివేటు సెక్యూరిటీ గార్డులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి, నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ సెక్యూరిటీ గార్డ్స్, అలైడ్ వర్కర్స్ యూనియన్స్ జాతీయ కన్వీనర్ ఎం.సాయిబాబు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్స్, అలైడ్ వర్కర్స్ యూనియన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు సెక్యూరిటీ ఏజెన్సీల (నియంత్రణ) చట్టం, 2005- అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, ప్రయివేట్ సెక్యూరిటీ ఏజెన్సీల కార్యకలాపాలను పర్యవేక్షించటం కోసం చేశారనీ, ప్రయివేటు సెక్యూరిటీ ఏజెన్సీల సెంట్రల్ మోడల్ రూల్స్ 2006 సరిగ్గా అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

అనేక ఏజెన్సీలు కార్మికులకు పీఎఫ్ చెల్లించడం లేదని తెలిపారు. కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమ దోపిడి చేస్తున్నారన్నారని విమర్శించారు. మహిళా సెక్యూ రిటీ గార్డులకు ప్రసూతి ప్రయోజనాలు కల్పించాలని చట్టంలో ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదని ఆవేద వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జీ.వోల్లో ప్రకటించిన విధంగా కనీస వేతనాలు అమలు చేయటం లేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాన్ని ప్రభుత్వ, ప్రయివేటు రంగ బ్యాంకుల్లో అమలు చేయడం లేదని తెలిపారు. కార్మిక చట్టాలను ప్రభుత్వాలు అమలు చేయటంలో ఉద్దేశ్యపూర్వకంగానే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, మాట్లాడుతూ రాష్ట్రంలో సెక్యూరిటీ కార్మికుల వేతనాలు పెంచుతూ 2021 జూన్‌లో జీవో నెంబర్ 21ని ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి ఆ జీవోను గెజిట్ చేయకుండా తత్సారం చేస్తున్నారని విమర్శించారు. తక్షణం ఆ జీవోను అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సదస్సుకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె ఈశ్వర్‌రావు అధ్యక్షత వహించగా అపోలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.సత్యనారాయణ, అనురాధ, దేవేం దర్, నాయకులు స్రవంతి, బుద్ధపూర్ణిమా యూని యన్ నాయకులు ఎన్ రవి కుమార్, ఎం.మధు, చర్లపల్లి పారిశ్రామిక ప్రాంత యూనియన్ నాయకులు రామకృష్ణ, జి.రామారావు, వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లక్షణ్, హన్మకొండ సెక్యూరిటీ గార్డ్స్ నాయకులు వెల్పుల సారంగపాణి పాల్గొన్నారు.

ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో నారా లోకేష్‌కు ఏపీ సీఐడీ నోటీసులు

- అక్టోబర్ 4న విచారణకు రావాలని నోటీసుల్లో వెల్లడి

న్యూఢిల్లీ : అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్ మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు ఏపీ సీఐడీ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ కేసు వ్యవహారంలో నారా లోకేష్‌కు, 41ఏ కింద నోటీసులు అందజేశారు. అక్టోబర్ 4న ఉదయం 10 గంటలకు సీడీఐ ఆఫీసులో విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ కేసులో విచారణకు సహకరించాలని కోరారు. శనివారం ఢిల్లీ అశోక రోడ్ 50లోని టీడీపీ ఎంపి గల్లా జయదేవ్ అధికారం నివాసంలో ఉన్న లోకేష్‌ను కలిసి సీఐడీ అధికారులను ఉద్దేశించి ఇలా ఎలా వచ్చారని ప్రశ్నించారు. నోటీసులు ఇచ్చేందుకు వచ్చామని అధికారులు తెలిపారు. అయితే ఇప్పటికే నోటీసులు పంపారు కాదా అని లోకేష్ అధికారులతో అన్నారు. అయితే దీనికి స్పందించిన అధికారులు నోటీసులు భౌతికంగా అందజేయాలని వచ్చినట్లు తెలిపారు. అయితే ఓకే అని నోటీసులను సీఐడీ అధికారుల నుంచి లోకేష్ తీసుకున్నారు. ఈ సందర్భంగా రాక రాక వచ్చారు. టీ అయిన, కాఫీ అయిన తీసుకోవాలని సీఐడీ అధికారులను లోకేష్ కోరారు. అందుకు సీఐడీ అధికారులు నిరాకరించారు. కాగా ఇన్నర్ రింగ్ రోడ్డు ఎలైన్ మెంట్ వ్యవహారంలో నారా లోకేష్‌ను సీఐడీ ఏ 41గా చేర్చింది. దీంతో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ లోకేశ్ హైకోర్టు ఆశ్రయించగా.. సీఆర్పీసీ 41 ఏ కింద నోటీసులు ఇవ్వడమంటే అరెస్ట్ కాదని అధికారులు కోర్టుకు నివేదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం... అరెస్ట్ చేసే ఆస్కారం లేనందున లోకేశ్ పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్ ను ముగించిన విషయం తెలిసిందే.

ఆప్ గొంతు అణచివేసేందుకు బీజేపీ యత్నం

- సామాన్యుల తిరుగుబాటు తప్పదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశ రాజకీయాల్లో బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్న ఆప్ గొంతు అణచివేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ విమర్శించారు. ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై సీబీఐవి తప్పుడు కేసులని ఆయన ఖండించారు. శనివారం హైదరాబాద్ లోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేజ్రీవాల్ అధికారిక నివాసం పునరుద్ధరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బీజేపీ సీబీఐని ప్రయోగించి తప్పుడు కేసులు పెట్టించడానికి ప్రయత్నిస్తున్నదని తెలిపారు. ఆ పునరుద్ధరణ చేసింది పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అయితే కేజ్రీవాల్‌కు ఏమి సంబంధమని ఆయన ప్రశ్నించారు. ఆప్ నిజాయితీ పాలనను అంతమొందించే ప్రతీకార చర్యలను మానుకోవాలనీ, తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే బీజేపీపై సామాన్యులు తిరగబడతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, ఏం.ఏ. మజీద్, అధికార ప్రతినిధులు పరీక్షిత్ రాజ్, ప్రవీణ్ యాదవ్, ఆప్ మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, దివ్యంగుల విభాగం అధ్యక్షులు దర్శనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పప్పులకు కొరత తప్పదా?



కెనడా నుండి తగ్గిన దిగుమతులు

- దౌత్య ఉద్రిక్తతలే కారణం

న్యూఢిల్లీ : భారత్-కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు తలెత్తిన నేపథ్యంలో మన దేశంలో పప్పులకు కొరత ఏర్పడి ధరలు పెరిగే అవకాశం కన్పిస్తోంది. భారత ఇంటెలిజెన్స్ ఏజెంట్ల పైన కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపణలు చేసిన తర్వాత ఆ దేశం నుండి పప్పుల దిగుమతులు తగ్గిపోయాయి. పప్పులే కాదు...వంట నూనెలు, బఠాణీలు కూడా కెనడా నుండి మన దేశానికి దిగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా ఎర్ర కందిపప్పు కొరతను ఎదుర్కొంటున్న తరుణంలో కెనడా దిగుమతులు ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయి. అనేక సందర్భాలలో ధరలు స్థిరంగా ఉండడానికి ఈ దిగుమతులు దోహదపడుతున్నాయి. శనగపప్పుకు కొరత ఏర్పడి, ధరలు పెరిగినప్పుడు కూడా కెనడా నుండి దిగుమతుల కారణంగా పరిస్థితి కుదుటపడింది. కెనడా నుండి ఆవనూనె దిగుమతి అవుతుండడంతో వంట నూనెల సరఫరాలో ఎదురవుతున్న కొరత తీరుతోంది. అదే విధంగా అక్కడి నుండి వస్తున్న దాణా చెక్క కోళ్లు, పశువులకు ఆహారంగా ఉపయోగపడుతోంది.

అయితే రెండు దేశాల మధ్య నెలకొన్న దౌత్యపరమైన ఉద్రిక్తతల కారణంగా ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. మన దేశంలో కరువు కాటకాలు, అతివృష్టి వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఇటీవలి కాలంలో వ్యవసాయ రంగం బాగా దెబ్బతిన్నది. ఉత్తర భారతంలో ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో దాదాపు కరువు పరిస్థితులు నెలకొన్నాయి. దేశంలోని అనేక ఇతర ప్రాంతాలలోనూ ఇదే పరిస్థితి. పప్పులు, చమురు గింజల ఉత్పత్తి పడిపోయింది. ఈ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం 3% తగ్గిందని అంచనా. మన వద్ద ఉన్న వ్యూహాత్మక నిల్వలు కూడా తరిగిపోతున్నాయి.

మరోవైపు దేశంలో ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. ఈ దశలో ఆహార ధాన్యాల ధరలు ఎంత తక్కువగా ఉంటే పాలక పార్టీలకు అంత మంచిది. అయితే దిగుమతులు చౌకగా లేకపోతే ధరలు తగ్గడం అసంభవం. మరోవైపు కెనడాకు మన దేశం నుండి జరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై కూడా నిశిత పరిశీలన జరుగుతోంది. సుంకాలు విధించి, భారత దిగుమతులను తగ్గించాలని కెనడా భావిస్తోంది. కెనడా ఆహార దిగుమతులపై కూడా మన దేశం అలాంటి ఆంక్షలే విధించవచ్చు. కానీ చివరికి నష్టపోయేది ప్రజలే.

కెనడా నుండి ఆహార ధాన్యాలు, వంట నూనెలే కాదు ఎరువులు కూడా భారత్‌కు ఎగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను (ఎంఓపీ)ని పెద్ద ఎత్తున మన దేశం దిగుమతి చేసుకుంటోంది. కెనడా నుండి దిగుమతులు ఆగిపోతే దాని ప్రభావం రబీ పంటల సాగుపై పడుతుంది.

ఫొటో జర్నలిస్టు భరత్ భూషణ్ కుటుంబానికి డబుల్ రూమ్ ఇల్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాహిత్యం, చిత్రకళ, ఫొటోగ్రఫీ తదితర సాంస్కృతిక, సృజనాత్మక రంగాల ద్వారా తెలంగాణ జీవితాన్ని ప్రతిబింబిస్తూ, జీవిత కాలం కృషి చేసిన కళాకారుల కుటుంబాలను ఆదుకోవాలనే నిర్ణయంలో భాగంగా ప్రఖ్యాత ఫోటో జర్నలిస్టు, చిత్రకారుడు, భరత్ భూషణ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఈ మేరకు భరత్ భూషణ్ కుటుంబానికి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లోని జియాగూడలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లును శనివారం కేటాయించారు. భరత్ భూషణ్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు కూడా వైద్య ఖర్చుల కోసం సీఎం ఆరోగ్య నిధి నుంచి ప్రభుత్వం చేయూతనందించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించి మరోసారి అండగా నిలిచినందుకు భరత్ భూషణ్ భార్య సుభద్రమ్మ వారి కుటుంబ సభ్యులు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు

- అధికారులకు వినతులు

నవతెలంగాణ- విలేకరులు

సమస్యల పరిష్కారం కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేపట్టారు. రంగారెడ్డి జిల్లా షాదన్‌నగర్‌లో చేపట్టిన సమ్మెకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనునాయక్ మద్దతు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారధికి వినతి పత్రం అందజేశారు. మంచాలలో సమ్మెకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జగదీష్ మద్దతు తెలిపి మాట్లాడారు. కరీంనగర్ జిలా శంకరపట్నం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై మధ్యాహ్న భోజన పథకం కార్మికులు రాస్తారోకో చేశారు. సూర్యాపేట జిల్లాలోని మునగాల, గరిడేపల్లి, హుజూర్‌నగర్, కోదాడ మండలాల్లో మధ్యాహ్నభోజన కార్మికుల సమ్మె కొనసాగింది. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్నభోజన కార్మికులు చెవిలో పూలుపెట్టుకొని నిరసన తెలిపారు.

కల్వకుంట్ల కవితకు బ్రిడ్జ్ ఇండియా సంస్థ ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యంపై లండన్‌లో ఏర్పాటు చేయబోయే సమావేశంలో కీలకోపన్యాసం చేయాలసిందిగా పబ్లిక్ పాలసీకి సంబంధించిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ బ్రిడ్జ్ ఇండియా (లండన్) బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆహ్వానించింది. పార్లమెంటు ఆమోదించిన మహిళ రిజర్వేషన్ల బిల్లులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన సందర్భంగా లండన్‌లో అక్టోబర్ 6న ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆహ్వాన పత్రంలో పేర్కొంది. రాజకీయాల్లో, ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళల భాగస్వామ్యం పెరగడానికి కవిత విశేషంగా కృషి చేశారని ఆ సంస్థ ప్రశంసించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం అనేక ఆందోళనా కార్యక్రమాలను చేపట్టారనీ, వివిధ రాజకీయ పార్టీల మద్దతును కూడగట్టడంలో కీలక పాత్ర పోషించారని వివరించింది. ఇలా పలు రకాల కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా మహిళా బిల్లుపై చర్చను రేకెత్తించారని పేర్కొంది. జంతర్ మంతర్‌లో దాదాపు 6000 మందితో ధర్నా నిర్వహించారని, ఈ ధర్నా కార్యక్రమానికి 18 పార్టీల నేతలు హాజరైన మద్దతు ప్రకటించారని తెలిపింది. మహిళా రిజర్వేషన్ల ఆవశ్యకతపై ఢిల్లీలో భారత్ జాగతి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో 13 రాజకీయ పార్టీలతో పాటు మహిళా, విద్యార్థి, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారని గుర్తు చేసింది.





వృద్ధులపై చిన్నచూపు ఎందుకు?

పేదరికం...అనారోగ్యం...ఒంటరితనం

- తప్పని కుటుంబ సభ్యుల వేధింపులు
- ప్రభుత్వ సాయమూ అంతంతే
- సమాజ ఆదరణా తక్కువే
- నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



న్యూఢిల్లీ : నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గటెర్స్ ఓ సందేశం ఇస్తూ వృద్ధుల జ్ఞానం, అనుభవం వెలకట్టలేనివని కొనియాడారు. శాంతి, సుస్థిర అభివృద్ధిలో వారి కృషి ఎనలేనిదని ప్రశంసించారు. అయితే మన దేశంలో వృద్ధుల సంరక్షణ, వారి ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వం ఉదాశీనంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

పౌర సమాజంలో వృద్ధుల హక్కులు అంటే వారి ప్రాథమిక మానవ హక్కులే. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత, కర్తవ్యం ప్రభుత్వానిదే. కానీ మార్కెట్ ఆధారిత విలువలు పెద్దల సమస్యను ఏ మాత్రం పరిష్కరించలేక పోతున్నాయి. వృద్ధాప్యంలో కూడా ఎంత సమర్థవంతంగా పనిచేయగలరు, సమాజానికి ఏ విధంగా ఉపయోగ పడతారు అనే విషయాలనే పరిగణనలోకి తీసుకుంటు న్నారు. అయితే ఈ అంశాలలో వారు బలహీనులే. పెన్షన్, సంరక్షణ, ఆరోగ్య సంబంధమైన సమస్యలు వంటి వాటిపై పెట్టే ఖర్చు వృథా అని ప్రభుత్వం భావిస్తోంది.

ఐరాస సర్వే నివేదిక మండిపాటు

ప్రధాని మోడీ చెప్పినట్లు ఇప్పుడు మనం అమృత కాలంలో ప్రవేశించాం. ఈ సందర్భంగా దేశంలో వృద్ధులకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవడం సముచితంగా ఉంటుంది. మన దేశంలో 13.8 కోట్ల మంది సీనియర్ సిటిజన్లు ఉన్నారు. వీరిలో 5.3 కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారు. 1.1 కోట్ల మంది అంధులు. వీరికి ఎలాంటి వైద్య చికిత్స అందడం లేదు. జీవన భృతి కోసం 9.6 కోట్ల మంది ఇప్పటికీ పని చేయాల్సి వస్తోంది. వీరందరికీ పెన్షన్, పీఎఫ్, గ్రాట్యుటీ, వైద్య బీమా వంటి సదుపాయాలేవీ లేవు. 2031 నాటికి దేశంలో వృద్ధుల సంఖ్య 19.4 కోట్లకు చేరుతుంది. 2050 నాటికి ఆ సంఖ్య 34 కోట్లకు చేరుతుందని అంచనా. దేశంలో వృద్ధుల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి సర్వే నివేదిక ఆగ్రహం వ్యక్తం చేసింది. భారత్‌లో వృద్ధులకు తగిన స్థానం లేదని మండిపడింది. ఐరాస సర్వే నివేదిక ప్రకారం...భారత్‌లోని వృద్ధులలో 62.1% మందికి దీర్ఘకాలిక ఉపశమనం కలిగించే రక్షణ లేదు. 52.4% మందికి ప్రాథమికంగా కుటుంబ మద్దతు లేదు. పేదలైన వృద్ధులలో 90% మంది అసంఘటిత రంగానికి చెందిన వారే. మహిళలలో 20% మంది నిరుపేదలైన వితంతువులు. నిరుపేద వృద్ధులలో కేవలం 10% మందికి మాత్రమే పెన్షన్ లేదా ఆర్థిక మద్దతు లభిస్తోంది.

ఏం చేయాలి?

వృద్ధులపై వేధింపులు, నేరాలు కూడా అధికంగానే జరుగుతున్నాయి. వారిలో 25% మంది తమను పిల్లలే అవమానిస్తున్నారని చెబుతున్నారు. ప్రధాని మోడీ చెప్పినట్లు అమృతకాలంలో ప్రవేశించిన సందర్భంలో దేశంలోని వృద్ధులకు సంబంధించిన కఠోర వాస్తవాలు ఇవి. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం ఇప్పటికైనా వృద్ధుల విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వారికి సామాజిక భద్రతా పథకాలు అమలు చేయాలి. వృద్ధుల వల్ల సమాజానికి ఉపయోగం ఏమీ లేదని, పైగా వారు సమాజానికి భారంగా పరిణమించారని అనుకోకూడదు. వృద్ధుల ఆరోగ్యంపై వారి ఇంటి వద్దనే తగిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వృద్ధులు ఆనందంగా, ఉత్సాహంగా మనుగడ సాగించగలుగుతారు. అమృతకాలం దిశగా ప్రయాణం సాగిస్తారు.

ఆరోగ్య రక్షణ అంతంతే

వృద్ధుల ఆరోగ్య రక్షణ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. పాతిక శాతం మంది వృద్ధులు తమ ఆరోగ్య అవసరాల కోసం కుటుంబ సభ్యులు లేదా పొరుగువారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోంది. నిర్లక్ష్యానికి గురవుతూ ఒంటరి బతుకు బతుకుతున్న వారి సంఖ్య తక్కువేమీ లేదు. వృద్ధులలో 11% మంది ఒంటరిగానే జీవిస్తున్నారు. 2025 నాటికి అంటే మరో రెండు సంవత్సరాలకు 60 సంవత్సరాలు దాటిన వృద్ధులలో 25% మంది, 75 సంవత్సరాలు దాటిన వారిలో 40% మందిది ఒంటరి బతుకే. వృద్ధులలో 12% శాతం మంది తమను ఎవరూ పట్టించుకోవడం లేదని బాధపడు తున్నారు.

13% మంది తాము ఇంటిలోనే బందీలమై పోయామని వాపోతున్నారు. 21% మంది తమకు కుటుంబ సభ్యులు లేదా సామాజిక మద్దతు కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాముడైనా కృష్ణుడైనా ఎన్టీఆరే

(మొదటిపేజీ తరువాయి)

కొడితే మళ్లీ ఆగమవుదామా..? అభివృద్ధిలో భాగమవుదామా..? ఆలోచించండి.." అని ఐటీ, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఖమ్మం కార్పొరేషన్ ఎదుట శనివారం ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన సభలో కేటీఆర్ మాట్లాడారు. అభివృద్ధి సాగాలంటే, ప్రగతి రథ చక్రాలు ముందుకు కదలాలంటే అందరి ఆశీర్వాదం కావాలన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయని, అలవికాని హామీలను ఇక్కడ ఇస్తున్నారని తెలిపారు. డబ్బులిస్తే తీసుకోండి కానీ ఓటు మాత్రం కారు గుర్తుకు వేయాలన్నారు. నగరంలో రూ.1370 కోట్ల పనులకు శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఎన్టీఆర్‌తో కేసీఆర్‌కు పోలిక..

ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ వద్ద ఎన్టీఆర్ పార్కుతోపాటు కాంస్య విగ్రహాన్ని కేటీఆర్ ప్రారంభించారు. ఎన్టీఆర్‌తో కేసీఆర్‌కు పోలిక పెడుతూ.. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవం నేపథ్యంలో విగ్రహాన్ని ప్రారంభించామన్నారు. విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు అందర్నీ ఆదరించి.. పేదలను గుండెల్లో పెట్టుకున్నారన్నారు. చరిత్ర రాసినప్పుడు కొన్ని వాస్తవాలను మరుగున పడవేయలేమన్నారు. తెలుగు వారు ఉన్నారని దేశమంతా మనవైపు చూసేటట్టు చేసింది ఎన్టీఆర్ అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ఎంతో ఆప్తుడు ఎన్టీఆర్ అని, ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసిన మహానుభావుడని కొనియాడారు. రాముడు, కృష్ణుడు ఎలా ఉంటారో తెలియదని, ఆ రెండూ ఆయనేనని అన్నారు. అదే మాదిరిగా తెలంగాణవాళ్లు ఉన్నారని ఈ దేశం మొత్తం చాటిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. గురువు ఎన్టీ రామారావు చేయలేని పని, వారి శిష్యుడు కేసీఆర్‌చేసే అవకాశం ఉందన్నారు. దక్షిణ భారతదేశంలోనే ఏ ముఖ్యమంత్రి, ఎన్టీఆర్ కూడా హ్యాట్రిక్ సీఎం కాలేదని తెలిపారు. కానీ 'గురువును మించిన శిష్యుడిగా కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని' జోస్యం చెప్పారు. దాంతో ఎన్టీఆర్ ఆత్మ కూడా శాంతిస్తుందన్నారు. ఈ పర్యటనలో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపీలు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, మేయర్ పునుకొల్లు నీరజ, జడ్పీ, డీసీసీబీ, విత్తనాభివృద్ధి సంస్థ, సుడా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మెన్‌లు లింగాల కమలరాజ్, కూరాకుల నాగభూషణం, కొండబాల కోటేశ్వరరావు, బచ్చు విజయ్‌కుమార్, వైరా బీఆర్ఎస్ అభ్యర్థి బాణోత్ మదన్‌లాల్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంకటవీరయ్య ఆధ్వర్యంలో సత్తుపల్లిలో సభ నిర్వహించారు.

ఎన్టీఆర్ అభిమానుల ఆగ్రహం

ఎన్టీఆర్‌కు కేసీఆర్‌కు పోలిక పెట్టడం.. గురువును మించిన శిష్యుడు అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఎన్టీఆర్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని కేటీఆర్ ప్రారంభించడంతో రామారావు ఆత్మ శాంతించడం కాదు క్షోభిస్తుందని ఎద్దేవా చేశారు. ఎన్టీఆర్ అభిమాన సంఘాల ఆధ్వర్యంలో కేటీఆర్ ప్రారంభించిన విగ్రహాన్ని ఆదివారం పసుపునీళ్లతో శుద్ధి చేయనున్నట్టు ప్రకటించారు. ఎన్టీఆర్ విగ్రహం ప్రారంభ సందర్భంగా ఆయన ముఖంపై ముసుగు తొలగకపోవడంతో ఆ తర్వాత హైడ్రాలిక్ మిషన్ సహాయంతో తీశారు. తిరుగు పయనంలో కేటీఆర్ మళ్లీ ఆ విగ్రహం దగ్గరకు వచ్చి నాయకులతో కలిసి ఫొటోలకు పోజులిచ్చారు.

తుమ్మల, పొంగులేటిపై పరోక్ష విమర్శలు..

కొణిజర్ల మండలం అంజనాపురంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ శంకుస్థాపన సభలో కేటీఆర్ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై పరోక్ష విమర్శలు చేశారు. కేసీఆర్ పదవి ఇస్తే మంచోడు, ఇవ్వకుంటే చెడ్డోడని, పదవుల కోసం పార్టీలు మారే నాయకులు స్వార్థ రాజకీయాలు చేస్తున్నారన్నారు. 50 ఏండ్లుగా తెలంగాణకు అన్యాయం చేసిన కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వొద్దన్నారు.

విపక్ష నేతల అరెస్ట్

కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని ముందుగానే కాంగ్రెస్ నేతలు ప్రకటించడంతో వారిని పోలీసులు అరెస్టు చేశారు. వీరితో పాటు సీపీఐ(ఎం) నేతలు, వామపక్ష విద్యార్థి సంఘ నాయకులను అరెస్టు చేశారు. అయితే బీజేపీ నాయకులను మాత్రం నిర్బంధించకపోవడం చర్చనీయాంశమైంది. మిక్కిలినేని నరేంద్ర, కాంగ్రెస్ కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల, సైదులు, చోటాబాబా, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బి.రాంబాబు, ఎస్.నవీన్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణ, షేక్ బషీరుద్దీన్, టీడీపీ నుంచి నల్లమల రంజిత్, శ్రీనివాసరావు, చేతుల నాగేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలావుండగా భారీ వర్షం కారణంగా కేటీఆర్ భద్రాచలం పర్యటన రద్దయింది.

ట్విట్టర్ వార్

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలను మోసం చేయలేరని హెచ్చరించారు.

నిద్రలోనూ కమీషన్ల కలవరింతే... : రేవంత్

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను చూసి తండ్రికి చలి జ్వరం పట్టుకుంటే, కొడుకేమో పూర్తిగా మతి తప్పినట్టుగా మాట్లాడుతున్నారని టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి కౌంటరిచ్చారు. నిండా అవినీతిలో మునిగి, నిద్రలో కూడా కమీషన్ల గురించే కలవరించే మీరా కాంగ్రెస్ గురించి మాట్లాడేది?అని ప్రశ్నించారు. పక్క రాష్ట్రంపై నీ గాలి మాటలను కాసేపు పక్కనబెట్టి, తెలంగాణలో మీ కల్వకుంట్ల స్కామ్‌ల గురించి చెప్పాలని డిమాండ్ చేశారు. దళితబంధులో 30 శాతం కమీషన్లు దండుకుంటున్నామని స్వయంగా మీ అయ్యనే ఒప్పుకున్న సంగతి మరచిపోయావా? అని ఎద్దేవా చేశారు. లిక్కర్ స్కామ్‌లో మీ చెల్లి రూ.300 కోట్లు వెనకేసిందని దేశమంతా కోడైకూస్తోందన్నారు. భూములు, లిక్కర్ అమ్మితే తప్ప తెలంగాణలో పాలన నడుస్తలేదని కాగ్ కడిగేసిన విషయం తెలియదా? అని ప్రశ్నించారు. 'తెలంగాణలో ఎన్ని ప్రభుత్వ భూములను అమ్ముకున్నరో, ఎన్ని ఎకరాలను మీ రియల్ ఎస్టేట్ మాఫియాకు కట్టబెట్టిండ్రో, ఎంత మంది మీ బినామీ బిల్డర్లతో హైదరాబాద్ మాఫియా సామ్రాజ్యాన్ని నడిపిస్తున్నరో, ఎన్ని లక్షల చదరపు అడుగుల స్థలాలు మీ మాఫియా కబంధ హస్తాల్లో చిక్కుకున్నయో, అన్నీ లెక్కలతో సహా తేలుస్తాం.కాంగ్రెస్‌ను అడ్డుకోవడం నీ వల్ల కాదు. నీ అయ్య వల్ల కూడా కాదు' అని హెచ్చరించారు.

బీఆర్ఎస్ లూట్...సూట్ సర్కారు : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బీఆర్ఎస్‌ది లూట్, సూట్ సర్కార్ అంటూ ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ 'కే' టాక్స్ (కల్వకుంట్ల టాక్స్) వసూలు చేయడానికి అలవాటు పడిందని విమర్శించారు. కే టాక్స్ రూపంలో రూ.1000 కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. కేటీఆర్ ఎజెండా ఫ్యామిలీ ఫస్ట్, ప్రజలు లాస్ట్ అని ఎద్దేవా చేశారు. ఇదే తొమ్మిదేండ్లుగా బీఆర్ఎస్ చేస్తున్నదని తెలిపారు. మోసగాడు అయిన కేసీఆర్ ప్రజలను వంచనకు గురిచేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ అకౌంట్‌లో రూ.900 కోట్లు, వారి బినామీల అకౌంట్‌లో రూ.90 వేల కోట్లు జమ చేసుకున్నారని అన్నారు. 2024లో ఏర్పడనున్న కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి పరులను జైలుకు పంపడం ఖాయమని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో 30 లక్షల మంది వలస కార్మికులు

క్యూ కడుతున్న పారిశ్రామికవేత్తలు

- దేశంలో విద్యుత్ సంక్షోభానికి ప్రధాని మోడీ నిర్ణయాలే కారణం : విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రానికి 30 లక్షల మందికి పైగా అసంఘటితరంగ కార్మికులు వలస వచ్చారని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. వీరంతా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చారనీ, ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పనులు దొరక్క, ఉపాధి కోసం తెలంగాణలో ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. శనివారంనాడిక్కడి టీఎస్‌జెన్‌కో ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్)లో కొత్తగా నియమితులైన 1,362 మంది జూనియర్ లైన్‌మెన్‌లకు నియమక పత్రాల అందజేత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశంలో విద్యుత్ సంక్షోభానికి ప్రధాని నరేంద్రమోడీ తీసుకుంటున్న నిర్ణయాలే కారణమని ఆరోపించారు. మోటార్లకు మీటర్లు మొదలు అన్నీ ప్రయివేటుకు అప్పగించే చర్యలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతున్నదన్నారు. రాష్ట్రంలో కరెంటు పోతే వార్త అవుతున్నదనీ, దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటలు నాణ్యమైన విద్యుత్ తెలంగాణలో మాత్రమే అమలవుతున్నదని చెప్పారు.

దీనివల్ల విదేశాల్లోని పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నారనీ, ప్రభుత్వ అభివృద్ధి చర్యలకు ఇది ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. రాష్ట్రంలో రూ.లక్ష కోట్లతో విద్యుత్ రంగాన్ని అభివృద్ధి చేశామనీ, తొమ్మిదిన్నరేండ్లలో 35,774 ఉద్యోగాలు కల్పించామనీ, మరో 670 ఉద్యోగాల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ వస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాఖల్లో ఇప్పటి వరకు 1.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు జరిగాయన్నారు.

కొత్తగా 25 వేల పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామనీ, దీనివల్ల మరో 20 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి లభించిందని వివరించారు. తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందనీ, ఈ విజయాల వెనుక సీఎమ్‌డీలతో పాటు సిబ్బంది అంకితభావం కూడా ఉన్నదని ప్రశంసించారు. కేంద్రం ప్రయివేటీకరణ జాబితాలో ఉన్న బీహెచ్ఈఎల్‌ను కాపాడటంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న చొరవ చాలా గొప్పదని చెప్పారు. రాష్ట్రంలో నిర్మించిన విద్యుత్ ప్రాజెక్టులన్నింటినీ బీహెచ్ఈఎల్‌కే ఇచ్చి, ప్రభుత్వరంగానికి చేయూత ఇచ్చారని తెలిపారు. ప్రధాని మోడీ స్వరాష్ట్రంలో గుజరాత్‌లో వ్యవసాయరంగానికి కేవలం ఆరు గంటలు మాత్రమే విద్యుత్ ఇస్తున్నారనీ, ఇప్పటికీ అక్కడ పవర్ హాలిడేలు కొనసాగుతున్నాయన్నారు.

దామరచర్ల పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నదనీ, కానీ కేంద్రం ఇప్పటి వరకు పర్యావరణ అనుమతి ఇవ్వలేదని చెప్పారు. జూనియర్ లైన్‌ఉమెన్లుగా ఆరుగురు యువతులు కూడా ఎంపికయ్యారనీ, దేశంలో ఎక్కడా ఈ పోస్టుల్లో మహిళలు లేరని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్‌జెన్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకర్ రావు, టీఎస్-ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డి, డైరెక్టర్లు పర్వతాలు, టీ శ్రీనివాస్, జే శ్రీనివాస్‌రెడ్డి, మదన్ మోహన్‌రావు, కే.రాములు, గంప గోపాల్, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

రేపు డీఎస్ఈ వద్ద స్పౌజ్ టీచర్ల మౌనదీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం (డీఎస్ఈ) వద్ద స్పౌజ్ టీచర్ల కుటుంబాలు మౌన దీక్ష చేపట్టనున్నాయి. ఈ మేరకు స్పౌజ్ ఫోరం అధ్యక్షులు వివేక్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 13 జిల్లాల ఉపాధ్యాయ దంపతుల బదిలీల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగ దంపతులు రాష్ట్రంలో గడిచిన 20 నెలలుగా అనేక రూపాల్లో విన్నపాలు, విజ్ఞప్తులు చేశామని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో మౌనదీక్ష చేపడుతున్నామని వివరించారు.

సౌత్ ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ మేనేజింగ్ కమిటీ ఎన్నిక



హైదరాబాద్ : 1959లో జంట నగరాలలో స్థాపించబడిన ఒక ప్రధానమైన సాంస్కృతిక సంస్థ సౌత్ ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ మేనేజింగ్ కమిటీ ఎన్నికైంది. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన అన్వెల్ జనరల్ బాడీ మీటింగ్‌లో 2023-25కుగాను కొత్త మేనేజింగ్ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా విజ్ఞాన సమితి అధ్యక్షుడు శ్రీ సూరి వెంకటేశ్వర్లు ఈ క్రింది మేనేజింగ్ కమిటీ సభ్యులను ప్రకటించారు.

అధ్యక్షుడు : డాక్టర్ రీ. చక్రవర్తి
ఉపాధ్యక్షులు : జబామణి, గోపాల కష్ణన్, జస్టి. సుబ్బారావు, డాక్టర్ ఎన్ రమేష్ కుమార్, జస్టిస్ సివిఎన్ శాస్త్రి
కార్యదర్శి : నేలటూరి రాజశేఖర్
జా. కార్యదర్శి : డా. కె.వి.రమణ, కె.ఎన్.డి.మూర్తి
కోశాధికారి : బి. సుధీంద్ర కుమార్
సభ్యులు : శ్రీలత, రఘు, కె.ఎస్ రావు, జీ. రావు, శ్రీనివాసన్, డాక్టర్ కెఎన్ ప్రసాద్, మహీధర సీతారాం, శ్యామలా చిత్రావూరి, లొల్ల ఎస్ మూర్తి, రాజభూషణ రావు, వి. రామచంద్రన్

విదేశాల్లో ఉపాధి అవకాశాలపై 4 నుంచి అవగాహన

- కరీంనగర్, రామగుండం, మంచిర్యాలలో ఎన్‌రోల్‌మెంట్ : టామ్‌కామ్ సీఈవో విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అభివృద్ధి చెందిన దేశాల్లో నైపుణ్యం కలిగిన నర్సులు, కార్మికులకు ఉపాధి అవకాశాలపై ఈనెల నాలుగు నుంచి అవగాహన కల్పించాలని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) నిర్ణయించింది. అందులో భాగంగా యూఏఈ, ఆస్ట్రేలియా, మాల్టా, మారిషస్, జపాన్, జర్మనీల్లోని ఖాళీలకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కరీంనగర్, రామగుండం, మంచిర్యాల జిల్లాల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు టామ్‌కామ్ సీఈవో డాక్టర్ ఈ విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల నాలుగున కరీంనగర్‌లో, ఐదున రామగుండంలో, ఆరున మంచిర్యాలలో నమోదు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు రెజ్యూమ్, సంబంధిత డాక్యుమెంట్లతో ఈ డ్రైవ్‌కు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌ను చూడాలనీ, లేదంటే 8247838789/ 7893566493/ 9849639539 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఫార్మసీ స్పాట్ అడ్మిషన్ల గడువు 6 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్, బయోమెడికల్ ఇంజినీరింగ్, బయో టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎంసెట్ బైపీసీ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టే గడువును ఈనెల ఆరో తేదీ వరకు సాంకేతిక విద్యాశాఖ పొడిగించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇతర వివరాల కోసం https://tseamcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఈ-మైనింగ్ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించిన మంత్రి పట్నం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్ ఈ-మైనింగ్ మొబైల్ యాప్‌ను రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ (డీఎంజీ), జాతీయ సమాచార విజ్ఞాన కేంద్రం (ఎన్ఐసీ) హైదరాబాద్ సంయుక్తంగా ఈ-మైనింగ్ యాప్‌ను అభివృద్ధి చేశాయని మహేందర్‌రెడ్డి చెప్పారు. గనులు, ఇసుక, ఖనిజ రవాణా, తనిఖీలు, అక్రమార్కులకు అడ్డుకట్ట వేసేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. ఈ-చలాన్ పద్ధతితో జరిమానాలను ఆన్‌లైన్‌లో వసూలు చేసేందుకు వీలుంటుందన్నారు. దీంతో పారదర్శకత, వెంటనే రుసుము వసూలు చేయడానికి అనుమతులు ఇవ్వొచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీఎంజీ కాత్యాయనీ దేవి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు జాతీయ హోదా మరిచారు

- మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రధాని మోడీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించకుండా ఏ మొఖం పెట్టుకుని తెలంగాణ రాష్ట్రానికి వస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ ప్రశ్నించారు. హామీ అమలు చేస్తేనే తెలంగాణలో అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును జీర్ణించుకోలేని మోడీకి తెలంగాణలో ఏం పని అని ప్రశ్నించారు. కేంద్రం సాయం చేయకున్నా కేసీఆర్ కృషితో పాలమూరు ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చిందని తెలిపారు.ఇప్పటికైనా పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

6న సమ్మెలకు సంఘీభావం

- సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధికంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికుల పోరాటానిక ఈ నెల 6వ తేదీన సంఘీభావాలు తెలపాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కా రాములు, పాలడుగు భాస్కర్ రాష్ట్రంలోని కార్మిక వర్గానికి, సంఘాలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో తీర్మానం చేసినట్టు శనివారంనాడోక ప్రకటనలో పేర్కొన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనీ, అందరినీ పర్మినెంట్ చేయాలనీ, పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలనే డిమాండ్ల పరిష్కారం కోసం నిరవధికంగా సమ్మె చేస్తున్నారనీ, ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. సమ్మెలో మూడు రంగాల కార్మికులు పేద ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్నారనీ, అనేక రకాల ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. వీరంతా సామాజికంగా వెనుక బడిన వారనీ అలాంటి వారిపై ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తూ అరెస్టులు, అక్రమ కేసులతో భయభ్రాంతుల కు గురిచేస్తున్నారనీ ఇలాంటి చర్యలు తగవని హితవు పలికారు.

అవుట్ సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలి

- నిలోఫర్‌లో పొరుగుసేవల ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో ఉద్యోగులు ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపి నినాదాలు చేశారు. పొరుగుసేవల ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, రేడియోగ్రాఫర్లు, ఈఈజీ, ఈసీజీ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, నాల్గవ తరగతి ఉద్యోగులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లను బేషరతుగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 1271 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో మూడు సంవత్సరాలు పనిచేసిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పే అండ్ అకౌంట్ శాఖ నుండి జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే త్వరలోనే భవి ష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని వారు హెచ్చరించారు.

ఇదీ..'సచ్...వాలయం' అంటే..!

- బీఆర్ అంబేద్కర్ సచివాలయ భవనంపై సీనియర్ రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్స్ స్పందన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అతి తక్కువ సమయంలో అద్భుతంగా "న భూతోన భవిష్యత్" అనే విధంగా సచివాలయ నిర్మాణాన్ని చేసిన విధానాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వివరించారు. రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేసి సేవలందించిన రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకు ఆమె శనివారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో తేనీటి విందునిచ్చారు. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను యాదాద్రి ఆలయ ప్రసాదాలను రిటైర్డ్ అధికారులకు అందచేశారు. 1970 అనంతరం నుంచి ఇటీవలి కాలం వరకు రిటైర్ అయిన ఆల్ ఇండియా సర్వీస్ అధికారులు పెద్ద సంఖ్యలో తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఎ.కె.కుట్టి, సుజాతరావు, వీపీ జవహరి, పీసీ. పరేఖ్, కేవీ. రావు, రాజీవ్ శర్మ, ఎస్.కె.జోషి, జై భరత్ రెడ్డి, రస్తోగి, మిన్ని మాథ్యూస్, ఎ.కె.గోయల్, దినకర్ బాబు, జి.సుధీర్, టీ.ఎస్.అప్పారావు, జి.నాగిరెడ్డి, రేమండ్ పీటర్ తదితరులు ఉన్నారు. ముందుగా సచివాలయం ఎదుట గ్రూప్ ఫోటో దిగిన అనంతరం రిటైర్డ్ అధికారులు కొత్తగా నిర్మించిన దేవాలయం, మసీద్, చర్చిలను సందర్శించారు. అనంతరం, సెక్రెటేరియట్‌లోని 6వ అంతస్తుతోపాటు వివిధ ఫ్లోర్లను తిరిగి పరిశీలించారు.గత తొమ్మిదేండ్లలో సాధించిన రాష్ట్ర ప్రగతిని సీఎస్ అధికారులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ కె.అశోక్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వీడియో ప్రదర్శిం చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఎస్ఏ-1 పరీక్షలు తర్వాత నిర్వహించాలి

- ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్‌కు టీఎస్‌జీహెచ్ఎంఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో క్షేత్రస్థాయిలోని పరిస్థితులు, విద్యార్థులకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దసరా సెలవుల తర్వాత సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-1) పరీక్షలను నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (టీఎస్‌జీహెచ్ఎంఏ) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డిని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజుగంగారెడ్డి, కోశాధికారి బి తుకారాం శనివారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉన్నతి బేస్‌లైన్ పరీక్షలు, ఎఫ్ఏ-2 పరీక్షలు, ఎన్ఏఎస్ కోసం సంసిద్ధత పరీక్షలున్నాయని తెలిపారు. ఈ మూడు రకాల పరీక్షలు ప్రస్తుతం పాఠశాలల్లో నిర్వహించ బడుతున్నాయని పేర్కొన్నారు. సుమారు 70 వేల నుంచి 80 వేల మంది ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల్లో నిమగ్నమై ఉన్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఎస్ఏ-1 పరీక్షల నిర్వహణకు పాఠశాలల్లో అనుకూలత లేదని తెలిపారు. విద్యార్థులు ఏ పరీక్ష రాస్తున్నారో, దేనికి సన్నద్ధం కావాలో అర్థం కాని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అందుకే ఎస్ఏ-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని కోరారు. పరీక్షల నిర్వహణ వేళల్లో సరిబేసి విధానాన్ని అనుసరించాలని సూచించారు. ఉదయం 6,8,10 తరగతుల విద్యార్థులకు, మధ్యాహ్నం 7,9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తే అనువుగా ఉంటుందని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం- చార్మినార్
ఆదివారం | అక్టోబర్ 01, 2023 | www.navatelangana.com

మా భూమి మాకే ఇవ్వాలని వినతి



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ గ్రామ దళితులు..మా భూమిని మాకు ఇవ్వాలని కోరుతూ కందుకూరు ఆర్డీవో సూరజ్ కుమార్‌కు శనివారం దళిత నాయకులు గుడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ బడంగ్‌పేట్ దావూద్ ఖాన్ గూడ సర్వే నెంబర్ 02లో భూమి కోసం దళితులు చేపట్టిన దీక్షలు 63వ రోజుకు చేరుకున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కర్రె రమేష్, రొడ్డ అంజమ్మ, పుట్టగళ్ల ఆండాలు, కర్రె లక్ష్మమ్మ కర్రె ముత్యయ్య, రొడ్డ సత్తయ్య పాల్గొన్నారు.

' కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలి'



నవతెలంగాణ -అబ్దుల్లాపూర్ మెట్

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని సీపీఐ(ఎం) నాయకులు గుండె శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అబ్దుల్లాపూర్ గ్రామ రెవెన్యూ సర్వేనెం. 242/28, 29లో కొంతమంది ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని రెవెన్యూ అధికారులను కోరారు. లేదంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

అతి త్వరలోనే లారీల అడ్డా తొలగింపు

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ -వనస్థలిపురం

అతి త్వరలోనే ఇసుక లారీల అడ్డాను తొలగిస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆటో నగర్ ఇసుక లారీల అడ్డా తొలగింపులో భాగంగా శనివారం టీ.ఎస్.ఐ.ఐ.సీ ఎం.డి. నర్సింహారెడ్డిని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15 ఏండ్ల నుండి ఈ ఇసుక లారీల అడ్డా వలన దాదాపు చుట్టుపక్కల ఉన్న 15 కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, వృద్ధులు రాత్రి పూట అటువైపు నుంచి వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఆటో నగర్ లోపల దాదాపు 11 ఎకరాల స్థలంలో లారీలు పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. ఈ విషయంపై వారు స్పందించి..వెంటనే అనుమతి ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు. అతి త్వరలోనే లారీల బెడద నుండి ప్రజలకు పూర్తి స్థాయిలో విముక్తి లభిస్తుందన్నారు. అలాగే నూతనంగా కేటయించే స్థలంలో వారికి కనీస సౌకర్యాలైన తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు, పడుకోవడానికి తగిన వసతులు కల్పించాలని కోరినట్లు తెలిపారు. రెండు రోజుల్లో ఆటోనగర్ లారీల అడ్డా వద్ద సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి నర్సింహారెడ్డిని కూడా ఆహ్వానించినట్లు చెప్పారు. తర్వాత కొన్ని రోజుల కిందట ఆటో నగర్ పారిశ్రామిక ప్రాంతంలో చేపట్టిన రోడ్డు నిర్మాణంలో రోడ్డు వెడల్పు 7 మీటర్ల నుంచి11 మీటర్ల వరకు పెంచాలని కోరారు. స్పందించిన నర్సింహారెడ్డి మాట్లాడుతూ తప్పకుండా రోడ్డు వెడల్పు విషయంపై అధికారులకు ఆదేశాలు జారీచేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, హయత్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్ గౌడ్, శ్రావణ్, లక్ష్మణ్ రెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్ రెడ్డి, జలందర్ రెడ్డి, సుధాకర్, ప్రవీణ్ గౌడ్, సత్తిరెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేత



నవతెలంగాణ -తుర్కయంజాల్

వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు శనివారం తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్, మున్సిపాలిటీలలో దాదాపు 65 వేల మంది వివిధ కేటగిరీలలో కొన్ని ఏండ్లుగా పనిచేస్తున్నారని అన్నారు. ఇప్పటికీ వారికి సరైన వేతనాలు, ఉద్యోగ భద్రతను ప్రభుత్వం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సుప్రీం కోర్ట్ సరైన పనికి సరైన వేతనాలు ఇవ్వాలని తీర్పు ఇచ్చినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం అమలుచేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం ప్రకటించిన వేయి రూపాయాలను అన్ని కేటగిరీల వారికి ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్ లో మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్నట్లుగా రూ.21వేల వేతనాన్ని తెలంగాణలో కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో అక్టోబర్ 8 నుండి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. సమ్మె నోటీస్ అందజేసిన వారిలో సీఐటీయూ నాయ కులు ఎం సత్య నారాయణ, ఎన్ యాదగిరి, జంగయ్యలు ఉన్నారు.

3వ రోజుకు చేరిన మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె



నవతెలంగాణ - హయత్ నగర్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శనివారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా హయత్ నగర్ మండల కేంద్రంలో విజయవాడ జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ 3 రోజులుగా మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం దిగిరాకపోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వేతనాలు, మెస్ చార్జీలు పెంచాలని కోరారు. ఈ నిరసనలో సీఐటీయూ నాయకులు, బూర ప్రభాకర్, గుండె శివకుమార్, మండల సత్యనారాయణ, లక్ష్మి, నవనీత, మంజుల, శ్రావణి, అలివేల రమాదేవి, రంగమ్మ, పుష్ప పాల్గొన్నారు.

కొత్త మనోహర్ రెడ్డికి మేయర్ సవాల్



నవతెలంగాణ- బడంగ్ పేట్

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ బీఫాం కోసం డబ్బులు ముట్టజేసినట్టు కొత్త మనోహర్ రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం భావ్యం కాదని, ఆధారాలు ఉంటే నిరూపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సవాల్ చేశారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. కొత్త మనోహర్.. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డికి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ కోసం నేను డబ్బులు ఇచ్చినట్లు నిరూపిస్తే..నేను దేనికైనా సిద్ధమన్నారు. నేను మహేశ్వరం శివ గంగ దేవాలయంలో ఆదివారం 9:30 గంటలకు వస్తాను, కొత్త మనోహర్ రెడ్డికి దమ్ము ధైర్యం ఉంటే ఆలయానికి వచ్చి, ఆధారాలు చూపించాలని సవాల్ విసిరారు. మంత్రి హరీశ్ రావు కనీసం ఒక మహిళ అని కూడా చూడకుండా నాపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కొందరు కావాలనే కాంగ్రెస్ పార్టీపై బురద చల్లుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు బండారి మనోహర్, బాలు నాయక్, నాయకులు సత్యనారాయణ, బి.జంగయ్య, బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, టి. నరహరి గౌడ్, బాలు గౌడ్, శ్రీరాములు పాల్గొన్నారు.

'సరైన ధ్రువ పత్రాలు ఉంటే వాహనాలు తీసుకెళ్లొచ్చు'

నవతెలంగాణ- చైతన్యపురి

ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ రకాల కేసులలో పట్టుబడిన 38 బైకులు, ఒక ఆటోను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. వాహనాల యజమానులకు నోటీసులు ఇచ్చి సమాచారం ఇచ్చామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్ రావు తెలిపారు. యజమానులు వచ్చి సరైన పత్రాలు చూపించి.. వాటిపై ఉన్న చలాన్లను క్లియర్ చేసి వాహ నాలను తీసుకెళ్లాలని అన్నారు. పూర్తి సమాచారం కోసం 8712662446 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కమీషన్లు ఇచ్చే కాంట్రాక్టర్లకే బిల్లులు : సామ రంగారెడ్డి



నవతెలంగాణ - హయత్‌నగర్

కమీషన్లు ఇచ్చే కాంట్రాక్టర్లకే బీఆర్ఎస్ ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని అర్బన్ రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. శనివారం మన్సూరాబాద్ పరిధిలోని చంద్రపురి కాలనీలో ఉన్న జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి, అధికారమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. జీహెచ్ఎంసీ పరిధిలో రోజు ఎక్కడో ఒక చోట వందల కోట్ల రూపాయల పనులకు శంకుస్థాపన చేస్తున్నారే తప్పా.. చిన్న చిన్న కాంట్రాక్టర్లకు మాత్రం సరైన సమయానికి బిల్లులు ఇవ్వడం లేదన్నారు. దీంతో వారు అప్పుల పాలవుతూ ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు చాలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది మార్చిలో జీహెచ్ఎంసీ పరిధిలోనే 600కోట్ల రూపాయల బిల్లులు కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుండి రావాల్సిందన్నారు. అది ఇప్పుడు సెప్టెంబర్ నెలకు 100కోట్లు దాటాయని, వారికి వాయిదా పద్ధతిలో నెలకు 30కోట్ల రూపాయలు మాత్రమే ఇస్తాం అని ప్రభుత్వం చెప్పడం సబబేనా అని ప్రశ్నించారు. నేటి నుంచి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్లు ధర్నాకు దిగుతున్నారని, వారికి మద్దతుగా బీజేపీ ఉంటుందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో మరో సారి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తుందన్నారు. దీనిని ప్రజలు గమనించాలని కోరారు. త్వరలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే చేసిన చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కుల కబ్జాలపై ఛార్జ్ షీట్ విడుదల చేస్తామని తెలిపారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి, చెక్క అశోక్ కుమార్, కృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీ స్కీమ్‌లకు ఎవరూ..?



తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్.. రెండు సార్లు అధికారంలోకి రాకుండా ఓటమిపాలైంది. ఈ సారైనా విజయం సాధిండం కోసం మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, కాంగ్రెస్ యువ నాయకులు రాహుల్ గాంధీలు తుక్కుగూడ సభలో ఆరు గ్యారెంటీ స్కీములను ప్రకటించారు. నేటి నుండే తమ నాయకులు ఈ స్కీములను ప్రజల్లోకి తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాదు తద్వారా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఢిల్లీ అగ్ర నాయకులు భరోసాగా ఉన్నారు. కానీ ఎల్బీనగర్‌లో ఇప్పటివరకూ ఈ గ్యారెంటీ స్కీములపై ఎలాంటి ప్రచారానికి ఇంకా శ్రీకారం చుట్టలేదు. టికెట్ కోసం అభ్యర్థుల లొల్లి కొనసాగుతుండడంతో ఇప్పటికీ ఎమ్మెల్యే అభ్యర్థిని కాంగ్రెస్ పెద్దలు ప్రకటించలేదు. దీంతో ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీకి నాయకుడు లేని నావలాగా తయారయింది. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఆరు గ్యారెంటీ స్కీమ్‌లపై మాట్లాడే కాంగ్రెస్ నాయకుడు లేక పోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ - ఎల్బీనగర్

తుక్కుగూడలో కాంగ్రెస్ విజయ భేరి నిర్వహించారు. ఈ సభలో ఎల్ ఇండియా కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, కాంగ్రెస్ యువ నాయకులు రాహుల్ గాంధీలు హాజరై ఆరు గ్యారెంటీ స్కీములను ప్రకటించారు. నేటి నుండే ఈ స్కీములను తమ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తారని..తద్వారా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోని వస్తుందని ఢిల్లీ అగ్ర నాయకులు ధీమాగా ఉన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో అనేక నియోజకవర్గాల్లో ఇంటింటికీ ప్రచారం చేపట్టారు. కానీ ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఈ స్కీములను ప్రజల్లోకి తీసుకెళ్లే నాయకుడు లేకపోవడంతో ప్రచారం కొనసాగడం లేదు.

టికెట్ కోసం ఎదురుచూపులు..

ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఐదుగురు నాయకులు ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ కూడా ఉన్నారు. తమకు పార్టీ అవకాశం ఇస్తుందో లేదో, ఇప్పుడు ఎందుకు ప్రచారంలో డబ్బులు ఖర్చులు పెట్టాలని కాంగ్రెస్ నాయకులు ఆలోచనలో పడ్డారు. టికెట్ వచ్చే నాయకుడే గ్యారెంటీ స్కీములపై ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తారని టికెట్ ఆశించే నాయకులు మిన్నకున్నారు. అందుకే ఏ నాయకుడు కూడా ప్రచారానికి ముందుకు రావడం లేదు. కాంగ్రెస్ టికెట్లను పెద్దలు ఖరారు చేయకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

టికెట్ ఆశించిన మధుయాష్కీ గౌడ్ ఎల్బీనగర్‌లో కనబడడం లేదు..

ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్న మధు యాష్కీ గౌడ్ 40 రోజులు అవుతున్నా.. ఇప్పటివరకూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎలాంటి కార్యక్రమాలు, ప్రచారాలు చేపట్టలేదు. దీంతో నియోజకవర్గంలోని కార్యకర్తలు, అభిమానులు స్థానిక నాయకులకు అవకాశం కల్పించా లని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరు గ్యారెంటీ స్కీములను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను ఎవ రూ తీసుకుంటారని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ప్రచారానికి శ్రీకారం చుట్టిన బీఆర్ఎస్ నాయకులు ..

ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆత్మీయ సమ్మేళనం, మార్నింగ్ వాక్‌తో ప్రచారంలో దూసుక పోతున్నారు. టికెట్ లొల్లితో ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ ప్రచారంలో వెనుకబడిపోయింది.

గ్యారెంటీ స్కీములతో పాటు మరిన్ని..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక..ఆరు గ్యారెంటీ స్కీముల తోపాటు వరంగల్ రైతు డిక్లరేషన్, యువత, దళిత డిక్లరేషన్ అమలు చేస్తామని, వీటన్నింటినీ మేనిఫెస్టోలో పెడతామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క స్పష్టం చేశా రు. రాష్ట్ర వ్యవరాల ఇంచార్జి మానిక్ రావు ఠాక్రే ప్రతీ నియోజకవర్గంలో ఈ స్కీములపై ఇంటిం టికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని కాంగ్రె స్ నాయకులకు ఆదేశాలు ఇచ్చారు. కానీ ఎల్బీ నగర్‌లో కాంగ్రెస్‌నాయకులుస్పందించడం లేదు.

టికెట్ లొల్లితో నో ప్రచారం..

టికెట్ లొల్లితో ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌లో స్తబ్దత నెలకొన్నది. ఆరు గ్యారెంటీ స్కీములపై గ్యారెంటీ ఇచ్చేది ఎవరని కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు వాపోతున్నారు. ఎల్బీ నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఖరారు అయితేనే కదులుతామని కాంగ్రెస్ నాయకులు భీష్మించి కూర్చున్నారు. రాష్ట్రంలో అభ్యర్థులను ప్రకటించకుండా నాన్సుడు ధోరణితో వ్యవహరిస్తే మొదటికే మోసం వచ్చే పరిస్థితి వస్తుందని నాయకులు ఆందోళన చెందుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఏవిధంగా కాంగ్రెస్‌ను విజయ బాటలో ఎలా నడిపిస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పార్టీ పెద్దలు జోక్యం చేసుకొని పరిస్థితిని చక్క బెట్టకపోతే పరిస్థితులు చేయి దాటిపోతాయని పలువురు అంటున్నారు.

ఆపదలో ఉన్నప్పుడు పట్టించుకోని వారు టికెట్ అడుగుతున్నారు..

ఎల్బీనగర్ నియోజకవర్గంలో కరోనా, వరదల సమయంలో పట్టించుకోని నాయకులు టికెట్ అడుగుతున్నారని స్థానిక కాంగ్రెస్ నాయకులు వాపోతున్నారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను కాంగ్రెస్ సొమ్ము చేసుకోవడం లేదని, బూత్ స్థాయిలో కార్యకర్తల కొరత కాంగ్రెస్‌కు ఉందని వీటిని అధిగమించకుండా కాంగ్రెస్ విజయం ఎలా సాధిస్తుంది. 11 డివిజన్‌లలో కాంగ్రెస్‌కు ఒక లిం గోజిగూడలోనే కార్పొరేటర్ ఉన్నారు. ఇంత వరకూ కాంగ్రెస్ టికెట్ ప్రకటిం చకపోలే ఎలా విజయం సాధిస్తుందో కాంగ్రెస్ పెద్దలకే తెలియాలి. ఎల్బీనగర్‌లో గ్యారంటీ స్కీమ్ లకు గ్యారెంటీ ఇచ్చేది ఎవరో చూడాలి...

ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం ఎదుట నిరసన



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట శనివారం ఎల్బీనగర్ కాంట్రాక్టర్స్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శివ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి పను లు చేపడితే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. వెంకటేష్ అనే కాంట్రాక్టర్ బిల్లులు రాక ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ ఆత్మహత్య కు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌కు పలు మార్లు బిల్లులు చెల్లిం చాలని కోరినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వెంకటేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ నిరసనలో అసోసియేషన్ నాయకులు నర్సింహా, మల్లేష్, శంకర్, నరహరి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

'పారితోషకం మాకొద్దు.. కనీస వేతనం కావాలి'



నవతెలంగాణ - మీర్ పేట్

పారితోషకం మాకొద్దు.. కనీస వేతనం కావాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. కనీస వేతనాలతో పాటు ఇతర హామీలను పరిష్కరించాలని కోరుతూ శనివారం బాలాపూర్ చౌరస్తాలో ఆశా కార్యకర్తలు మానవహారం నిర్వహించి.. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం సీఐటీయూ బాలాపూర్ మండల నాయకులు యాదయ్య మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనం రూ.18వేలు పెంచాలన్నారు. 2021 జులై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పిఆర్సి ఏరియార్స్ వెంటనే చెల్లించాలని, కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ కూడా నెలకు రూ .1000 చొప్పున 16 నెలల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'వికలాంగుల పెన్షన్ రూ.10 వేలకు పెంచాలి'

నవతెలంగాణ - ధూల్ పేట్

వికలాంగుల పెన్షన్ రూ.10 వేలకు పెంచాలని, డబల్ బెడ్ రూం ఇండ్లలో వికలాంగులకు ఐదు శాతం కేటాయించాలని ఎన్పీఆర్డీ సంఘం నగర కార్యదర్శి ఆర్ వెంకటేష్ అన్నారు. అక్టోబర్ 9న జరిగే వికలాంగుల మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఎన్పీఆర్డీ నాంపల్లి జోన్ కమిటీ ఆధ్వర్యంలో మెహదీపట్నం ఎల్ఐసి పార్క్ దగ్గర శనివారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 ఎన్పీఆర్డీ చట్టం గుర్తించిన తెలంగాణ రాష్ట్రంలో సుమారు 43.04 లక్షల మంది వికలాంగులు ఉన్నారని తెలిపారు. వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 2016లో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని కోరారు. 2016 ఆర్పీడీ చట్టం సెక్షన్ 79 ప్రకారం వికలాంగుల కమిషన్ ఏర్పాటు చేసి చైర్మన్, సభ్యులను నియమించాలన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్‌ను రూ.4016 నుండి రూ.10 వేలకు పెంచాలనీ, పెండింగ్ లో ఉన్న ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆసరా పెన్షన్లకు ఆదాయ పరిమితి విధించే జీవో 17 రద్దు చేయాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో వికలాంగులకు రిజర్వేషన్స్ కల్పిస్తూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలన్నారు. ప్రతి వికలాంగుడి కుటుంబానికి 250 యూనిట్ల ఉచిత విద్యుత్, వైకల్య ధ్రువీకరణ పత్రం కలిగిన వికలాంగులకు ఆర్టీసీ, రైల్వేలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. 40 శాతం వైకల్యం కలిగిన వారందరికీ బస్ పాసులు ఇవ్వాలన్నారు.

ఉద్యోగ నియామకాల్లో శారీరక వికలాంగుల రోస్టర్ 10లోపు తగ్గించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. వికలాంగుల సంక్షేమం, సాధికారత కోసం వికలాంగుల బంధు పథకం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల్లో ఐదు శాతం వికలాంగుల కేటాయించాలన్నారు. 2016 చట్టం పేర్కొన్న విధంగా సాధారణ లబ్దిలో 25శాతం అదనంగా వికలాంగులకు అన్ని ప్రభుత్వ పథకాలలో చెల్లించాలన్నారు. గృహలక్ష్మి పథకంలో ఐదు శాతం, విద్యా ఉపాధి కోసం ప్రత్యేక పాలసీ ప్రకటించాలన్నారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆటిజం, వినికిడి పరీక్షలు, మానసిక వైకల్యం కలిగిన పిల్లల కోసం ప్రత్యేక థెరపీ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. వికలాంగుల వివాహ ప్రోత్సాహకం రూ.2.50 లక్షలకు పెంచాలని, ఇద్దరు వికలాంగులు వివాహం చేసుకుంటే రూ.5 లక్షల రూపాయల ప్రోత్సాహకం ఇవ్వాలని కోరారు. మానసిక వికలాంగుల కోసం ప్రభుత్వమే ప్రతి జిల్లా కేంద్రంలో మానసిక వికలాంగుల పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పి శశికళ, పి. సత్యనారాయణ, ఆరిఫ్, బసవరాజ్ కుమార్, రాములు, కిష్టయ్య పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు



నవతెలంగాణ- చైతన్యపురి

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ నూతన చైర్మన్ బక్కి వెంకటయ్యను కమిషన్ కార్యాలయంలో శనివారం తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు బేర బాలకిషన్ (బాలన్న) కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల సంఘాలు అనేక పోరాటాలు చేసిన అనంతరం దళితుల్లో సమన్యాయం పాటించి.. బక్కి వెంకటయ్యను కమిషన్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. హైదరాబాద్ నగరంలో మాల భవన్‌కు 5 ఎకరాలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రామచందర్, వర్కింగ్ చైర్మన్ తాళ్లపల్లి రవి, ముఖ్య సలహాదారులు రావుల అంజన్న తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-ఉప్పల్
ఆదివారం | అక్టోబర్ 01. 2023 | www.navatelangana.com

కోర్టు సముదాయంలో స్వచ్ఛత కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

మల్కాజిగిరి కోర్టుల సముదాయంలో శనివారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జడ్జి టీఆర్. మధుసూదన్‌రావు, సీనియర్ సివిల్ జడ్జి డి. కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి న్యాయ మూర్తులు గ్రూపులుగా ఏర్పడి న్యాయస్థాన భవన పరిసరాలను శుభ్రపరిచారు. నిత్యం పలు కేసులపై కోర్టుకు వచ్చి వెళ్లే కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు న్యాయస్థాన భవన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జె. విక్రమ్, జీవీ. మహేష్‌నాథ్, దేవి, మానస, చిరఘ మెహతా, కోర్టు సూపరింటెండ్స్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి : సర్పంచ్



నవతెలంగాణ-కీసర

మత్స్య కారులను ఆర్థికంగా బలోపేతం చేయడానికే ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ చేస్తుందని గోధుమకుంట గ్రామ సర్పంచ్ అకిటీ మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం గోధుమకుంట గ్రామంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మత్స్యశాఖ అధికారుల సహకారంతో అందచేసిన 45,000 వేల చేప పిల్లలను గ్రామ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని తీగల నారాయణ చెరువులో వదిలారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ కిరణ్ జ్యోతి ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సురేష్ రెడ్డి ,వార్డ్ సభ్యులు పుట్ట బాలరాజు గౌడ్, చీర శేఖర్, చీర రజితశ్రీ, సామల ప్రేమ్ నాథ్ రెడ్డి, తాండూరి సంధ్య దశరథ గౌడ్, నాచారం పద్మ మంచాల స్వరూప, జంగం శివ యాదవ్, కో ఆప్షన్ సభ్యులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, మత్స్యకారులు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానంలో కార్యక్రమంలో పాల్గొన్న బేతి



నవతెలంగాణ-కాప్రా

ఏఎస్‌రావు నగర్ డివిజన్ మార్కండేయ నగర్, పద్మశాలీ భవన్ గణపతి మండపం వద్ద నిర్వహించిన అన్నదానం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గణపతికి పూజ చేశారు. ఆయన వెంట అనుముల నరసింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కుమార స్వామి, దాస్, అనిల్‌కుమార్, నందికంటి శివ, పరమేష్, నవీన్ రెడ్డి, జంగారెడ్డి, నాగిరెడ్డి, మహిళలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రవాణా సౌకర్యానికి కృషి

- చెంగిచెర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కే. కవిత
- డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి 25 ఫిర్యాదులు, 5పరిష్కారం



నవతెలంగాణ-బోడుప్పల్

ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పిస్తూ ఆర్టీసీ సంస్థను లాభాల బాటలో కి తీసుకెళ్లడమే లక్ష్యమని ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే. కవిత తెలిపారు. శనివారం చెంగిచెర్ల డిపోలో డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల నుంచి 25 ఫిర్యాదులు రాగా 5 ఫిర్యాదులను వెంటనే పరిష్కరించినట్లు తెలిపారు. ప్రయాణికులకు అవసరమైన ఏర్పాట్లకు ప్రతినెలా డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఆనందరావు అసిస్టెంట్ (మేనేజర్) మెకానికల్ సాయి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ సూపరిండెంట్ (పర్సనల్) సత్యం, డిప్యూటీ సూపరిండెంట్ (ఫైనాన్స్) అశోక్ కుమార్, సూపర్‌వైజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆహార భద్రతలో ఎఫ్‌సీఐ పాత్ర కీలకం



నవతెలంగాణ-కాప్రా

ఆహార భద్రత కల్పించడంలో ఎఫ్‌సీఐ పాత్ర కీలకం అని తార్నాక డివిజన్ మేనేజర్ మృత్యుంజయ్ కుమార్ తెలిపారు. శనివారం చర్లపల్లి ఎఫ్‌సీఐలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతున్న ధాన్యం సేకరణ, నిల్వ, వ్యాగన్ విధి విధానాలను చర్చించారు. పేదలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు 1965లో ఎఫ్‌సీఐని ఏర్పాటు చేశారని తెలిపారు. పోషక ఆహారలోపాన్ని అధిగమించే ఒందుకు పోర్టిఫైడ్ రైస్‌ను (ఎఫ్ఆర్‌కె) పీడీఎస్ ద్వారా సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్వాలిటీ కంట్రోల్ ప్రొక్యూర్‌మెంట్ విధానం, కొత్తగా ప్రవేశపెట్టిన ఎఫ్ఆర్కే గురించి వివరించారు. నాణ్యమైన ప్రమాణాలను తనిఖీ చేయడానికి ఎఫ్ ఆర్కే దక్షిణ భారతదేశంలో ఎన్ఎబిఎల్ ల్యాబ్‌ను నిర్మించారని తెలిపారు. అది త్వరలో ప్రారంభం కాబోతున్నదని తెలిపారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఏజీఎం గజానంద్, డిపో క్వాలిటీ మేనేజర్ శంకర్ నాయక్, జనార్ధన్, రాజేష్, డిపో మేనేజర్ శ్రీనివాస్ నాయక్, కిషన్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ తెలంగాణ స్టేట్ మహిళా కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మండలం చౌదరిగూడ పరిధిలోని జాయ్ ఫౌండేషన్‌లో శనివారం నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ జాతీయ అధ్యక్షుడు జాన్‌మాస్క్ ఆదేశాలతో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు రెవరెండ్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ తెలంగాణ స్టేట్ మహిళా కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా కే. సునీతాపాల్, ఉపాధ్యక్షురాలిగా సుక్క జ్యోతి, కార్యదర్శిగా ఎం. దుర్గ, కోశాధికారిగా సిస్టర్ ప్రణీతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ.. క్రిస్టియన్ మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు కృషి చేయాలని సూచించారు. మహిళా అభ్యున్నతికి పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఘట్కేసర్ మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్‌పాల్, కార్యదర్శి సుక్క జాషువా, చౌదరిగూడ పాస్టర్స్ అసోసియేషన్ అభ్యులు పాల్గొన్నారు.

ఎరుకల సంఘం జెండా ఆవిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి కుమార్ ఆదేశాలతో కైలాసగిరి ఎరుకల సంఘం సభ్యులు శనివారం జెండావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఎరుకల కులాన్ని షెడ్యూల్ ట్రైబల్ జాబితాలో చేర్చిన సెప్టెంబర్30 తేదీని పురస్కరించుకుని కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ ఎరుకల సంఘం సభ్యులతో కలిసి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..1956 నుంచి76 మధ్య 20 ఏండ్లు అలుపెరుగని పోరాట ఫలితమే ఎరుకల కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చారని తెలిపారు. కూరాకుల మల్లికార్జున్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ రాంపల్లి నరసింహ, కాంగ్రెస్ నాయకులు అంజయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లేష్, నవీన్ గౌడ్, నవీన్, రాములు, భాస్కర్, ఎల్లయ్య, నల్లగొండ సమ్మయ్య లక్ష్మీ దుర్గవేణి, మహేశ్వరి, యాదమ్మ, నరేష్, సహదేవ్, చింటూ, నవీన్ పాల్గొన్నారు.

డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ ఆధ్వర్యంలో 5కె రన్



డ్యాన్స్ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి



5కె వాకథాన్ ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-సిటీబ్యూరో

డీజే పాటలకు మాస్ స్టెప్పులు వేస్తూ, తనదైన శైలిలో డైలాగ్స్ చెప్తూ మంత్రి మల్లారెడ్డి యువతలో జోష్ నింపే ప్రయత్నం చేశారు. యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిస కాకూడదు అంటూ మంత్రి హితవు పలికారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కూకట్‌పల్లిలోని మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కె వాకథాన్‌లో మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టేజీపై కుమారుడు భద్రారెడ్డి, వైద్యులు, యువతతో కలిసి డ్యాన్స్ చేస్తూ వారిలో ఉత్సాహం నింపారు. పాలమ్మిన పూలమ్మిన అంటూ.. తన డైలాగ్ చెప్తూ అందరినీ అలరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యం అని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం వ్యాయామం, యోగా, వాకింగ్ లాంటివి చేస్తూ ఉండాలని, తాను కూడా అదే చేస్తూ 70 ఏండ్ల వయస్సులో ఇంత ఉత్సాహంగా ఉన్నానని తెలిపారు. నేటి యువతలో కొందరు చెడు అలవాట్లకు బానిసై ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని, అలాంటి వ్యసనాలను విడనాడి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు సుధాకర్, ఆనంద్ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కరించాలని మల్లారెడ్డికి వినతి

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ, రాంపల్లి గ్రామంలోని దళితుల సమస్యలు పరిష్కరించాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి మల్లా రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రాంపల్లి గ్రామంలోని దళితులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైస్‌చైర్మెన్ మల్లేష్, కౌన్సిలర్లు, శ్రీనివాస్‌గౌడ్, కౌకుంట్ల అనంత్‌రెడ్డి, మాదిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు ఆంజనేయులు గౌడ్, సుధాకర్‌రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి మాజీ ఎంపీటీసీ మల్లేష్, ఎల్లమయ్య శ్రీనివాస్, పరమేష్, భాస్కర్, మల్లేష్, నర్సింగ్ రావు, యాదగిరి, బాలయ్య పాల్గొన్నారు.



మల్లారెడ్డితో రాంపల్లి గ్రామస్తులు

పేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

మధుర చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ రాగిడి లక్ష్మారెడ్డి సహకారంతో నాచారం డివిజన్ వెస్లీ హైస్కూల్లోని పేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ట్రస్ట్ సభ్యులు పలకల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. మధుర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రాగిడి లక్ష్మారెడ్డి 20 ఏండ్లుగా ఉప్పల్ నియోజకవర్గం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులకు నోటు బుక్స్, స్టడీ మెటీరియల్స్ అందజేస్తున్నారని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు అందజేస్తున్నారని చెప్పారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే వారికి సహకారం అందిస్తున్నారని చెప్పారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి, ప్రహరీ నిర్మాణం, స్టేజ్ ఆవరణలు, టాయిలెట్లు కట్టించారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మధుర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఎం.ఎ సమద్, అమీర్, కీసర రామ కృష్ణారెడ్డి, శివ, జితేందర్ రెడ్డి, పవన్ కుమార్, అజీజ్, మదన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి



- రైతు సహకార సంఘం చైర్మెన్ ఎన్.సుధాకర్‌రెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పూడూరు రైతు సహకార సంఘం చైర్మెన్ ఎన్.సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సొసైటీ కార్యాలయ ఆవరణలో వైస్‌చైర్మెన్ లావుడియా శ్యామ్‌లాల్ అధ్యక్షతన సొసైటీ ఎండీ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో 45వ సాధారణ సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం మొదట విడత రూ.25 వేల నుంచి రూ.50వేల వరకు రుణమాఫీ చేసిందన్నారు. రెండో విడుత రూ.50వేల నుంచి లక్ష లోపు రుణాలు మాఫీ చేసిందన్నారు. ఈ రుణాలు 11 డిసెంబర్ 2018 లోపు తీసుకున్నవారికి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. సొసైటీ ఆవరణలో ఫ్రూట్స్ అండ్ వెజిటేబుల్ క్లస్టర్ కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏంఎస్ఎంఈ ద్వారా నిర్మిస్తామన్నారు. దీంతో రైతులకు లాభం చేకూరుతుందన్నారు.

పదవీ విరమణ పొందిన విజయలక్ష్మీకి సన్మానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ కార్యాలయంలో స్పోర్ట్స్, ఎస్టేట్, డిపార్ట్‌మెంట్ ఎంక్వయిరీ హోదాలో పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన అడిషనల్ కమిషనర్ విజయలక్ష్మిని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ శనివారం గోల్కొండ హోటల్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీలో 34 ఏండ్లుగా వివిధ హోదాల్లో పనిచేసిన విజయలక్ష్మి అంకిత భావంతో సేవలందించారని కొనియాడారు. అనంతరం జీహెచ్ఎంసీ కార్యాలయంలో విజయలక్ష్మిని యూ.సీ.డీ. స్పోర్ట్స్, ఎస్టేట్, అడ్మిన్ ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు ఆమెతో పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వివిధ సర్కిళ్లలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులను కమిషనర్ రోనాల్డ్ రోస్ సన్మానించారు. ఎల్బీనగర్ జోన్ కాప్రా సర్కిల్‌లో హెల్త్ అండ్ శానిటేషన్‌లో పీ.హెచ్ వర్కర్‌గా సేవలు అందించిన ఎన్. పోచమ్మ, ఖైరతాబాద్ జోన్ గోషామల్ సర్కిల్ హెల్త్ సెక్షన్ వార్డు 5బీలో కామాటిగా పనిచేసిన భిక్షపతి, చార్మినార్ జోన్‌లో హెల్త్ సెక్షన్ వార్డు 22ఏ లో కామటోన్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన దానమ్మలను కమిషనర్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈ.వీ.డీ.ఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, సీసీపీ రాజేంద్ర ప్రసాద్ నాయక్, అడిషనల్ కమిషనర్లు యాదగిరిరావు, వి.కృష్ణ, ఉపేందర్ రెడ్డి, సరోజ, జయరాజ్ కెనడీ, జోనల్ కమిషనర్లు వెంకటేష్ దోత్రె, శ్రీనివాస్ రెడ్డి, మమత, ఏ.సీ ఎస్టేట్ గీతారాధిక, స్పోర్ట్స్ డైరెక్టర్ పాషా, యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్లు సౌజన్య, జాయింట్ కమిషనర్ మంగతాయారు, ఉమా ప్రకాష్, జయంత్, సెక్రటరీలక్ష్మి, స్పోర్ట్స్ కోచ్‌లు శ్రీనివాస్ గౌడ్, రఫ్, ఇంతియాజ్, వీరానంద్ పాల్గొన్నారు.

రామంతాపూర్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

- మాజీ కార్పొరేటర్ జోత్స్న



నవతెలంగాణ-ఉప్పల్

రామంతపూర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ రామంతపూర్ మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్న ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజంను కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధి జరగడం లేదన్నారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉందని వాపోయారు. డివిజన్‌లో గతంలో జరిగిన అభివృద్ధి తప్పా..రెండేండ్లుగా ఎలాంటి అభివృద్ధి జరగడం లేదన్నారు. పాలకులు ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ప్రజల కోరిక మేరకు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పదవులు ఉన్నా.. లేకున్నా ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. డివిజన్‌లోని వివేక్‌నగర్ మెయిన్ రోడ్ నుంచి కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్ వరకు సీసీ రోడ్, దోబీఘాట్ నుంచి రాజేంద్రనగర్ వరకు సీసీ రోడ్, ఈస్ట్ శ్రీనివాస్ పురంలో సీసీ రోడ్లు, రాంశంకర్ నగర్, ఈస్ట్ శ్రీనివాపురంలో స్ట్రామ్ వాటర్ డ్రైన్ లైన్, భరత్ నగర్‌లో మనస్వి మెడికల్ స్టోర్ నుంచి జీడీ బేకరీ వరకు రోడ్డు పనులకు నిధులు కేటాయించాలని కోరారు.

అతిపెద్ద మానీక్విన్స్ బొమ్మల కొలువు ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

దుబాయ్ కేంద్రంగా కలిగిన ప్రముఖ అంతర్జాతీయ ల్యాండ్ మార్క్ గ్రూప్ రిటైల్ చైన్, మ్యాక్స్ ఫ్యాషన్ ఆంధ్ర, తెలంగాణలో ఈ ఏడాది చివరి వరకు మా మాక్స్ ఫ్యాషన్ స్టోర్స్ 82 చేరనుంది. దసరా ఉత్సవాలు ప్రారంభం కానుండగా, వినియోగదారులను ఆకర్షించడం, లేటెస్ట్ ఫ్యాషన్ల అతి తక్కువ ధరకే లక్ష్యంగా నెల రోజుల పాటు మ్యాక్స్ ఈ వేడుకనులకు సిద్ధమైంది. హార్ట్ ఆఫ్ హైదరాబాద్ ఉన్న కేపీహెచ్‌బీ నెక్సస్ మాల్‌లో 30 నుంచి 40 అడుగుల భారీ బొమ్మల కొలువును ప్రారంభించింది. దీనితో పాటుగా మ్యాక్స్ ఈ పండుగ సీజన్‌లో బహుమతులు కొన్ని వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాల ను భాగస్వామ్యం చేసింది. పాపులర్ తెలుగు సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ కుమార్తె సితార ఘట్టమనేని ఈ ప్రచారాన్ని ప్రారంభించారు. సంయుక్తంగా వా రు 150కిపైగా మానీక్విన్స్ (బొమ్మలు) తో కూడిన బొమ్మల కొలు వును ఆవిష్కరించారు, ప్రతి ఒక్కటీ ఒక ప్రత్యేకమైన కథను వివరిస్తుంది. మ్యాక్స్ తాజా పండుగ కలెక్షన్‌తో ఇవి అలంకరించబడ్డాయి. బహుమతులు ఇచ్చే సంప్రదాయాన్ని సజీవంగా ఉంచుతూ ఎన్జీవోల నుంచి పిల్లలు, వద్దులకు దసరా కానుకలను అందజేశారు.

ఈ సందర్భంగా ల్యాం డ్‌మార్క్ గ్రూప్ మ్యాక్స్ ఫ్యాషన్-ఇండియా వైస్ ప్రెసిడెంట్ అండ్ మార్కెటింగ్ హెడ్ పల్లవి పాండే మాట్లాడుతూ "అతిపెద్ద బొమ్మల కొలువు, దసరా పెస్టివల్ ఆఫర్స్‌ను ప్రారంభించడం ద్వారా, మా కస్టమర్‌లకు షాపింగ్‌కు మంచి సంతోషాన్ని అందించడమే మా ప్రయత్నం. రోజువారీ ఫ్యాషన్ కోసం సాంప్రదాయ, లేటెస్ట్ ఫ్యాషన్ దుస్తులు అందించిడమే మా లక్ష్యం" అని తెలిపారు. నగరంలో ఈ వేడుకను ప్రారంభించడం పట్ల మేం సంతోషిస్తున్నాం. హైదరాబాద్ మాకు చాలా ప్రత్యేకం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలోని మా అమ్మకాల్లో 64శాతం ఈ నగరం నుంచి వస్తున్నాయి.

కష్టమర్లకు సేవలందించేందుకు, వారి పండుగ వేడుకల్లో అంతర్భాగంగా మారేందుకు ఎదురు చూస్తున్నాం " అని మ్యాక్స్ ఫ్యాషన్ రీజినల్ బిజినెస్ హెడ్ పెద్దిరాజు ఆనంద్ రామ్ తెలిపారు.

పైపులైన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ సీవరేజ్ బోర్డ్ ద్వారా రూ. 60కోట్లతో నిర్మిస్తున్న ఓఆర్ఆర్ ఫేస్ పైప్‌లైన్ పనులను కార్పొరే టర్ బన్నాల గీత పరిశీలించారు. శనివారం చిల్కానగర్ డివిజన్‌లోని అబ్దుల్ కలాం విగ్రహం నుండి చిల్కానగర్ చౌరస్తా వరకు వేస్తున్న 8 ఇంచెస్ వాటర్ పైప్‌లైన్ పనుల ను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఓ ఆర్ ఆర్ ఫేస్ టు వాటర్ పైప్‌లైన్ ద్వారా డివిజన్‌లో లో ప్రెషర్ సమస్య తీరుతుందన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్ర మంలో నాయకులు బన్నాల ప్రవీ ణ్, ప్రధాన కార్యదర్శి జగన్, బింగి శ్రీనివాస్, ముద్దం శ్రీనివాస్ యాదవ్ బాణాల నారాయణరెడ్డి, ఎండి హనీఫ్, ఎండీ హఫీజ్, సుందర్ బాలు,శ్యామ్, శివ, మరియు బస్తీ వాసులు పాల్గొన్నారు.

'డబుల్' ఇండ్లలో స్థానికులకు 10శాతం కేటాయించాలి

- ఒకటో వార్డు కౌన్సిలర్ సరితారమేష్



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో స్థానికులకు 10% ఇండ్లు కేటాయించాలని ఒకటో వార్డు కౌన్సిలర్ సరిత రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 258లో 6500 ఇండ్లు నిర్మించారని చెప్పారు. అప్పటి ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి ఇండ్లకు శంకుస్థాపన సమయంలో రాంపల్లి గ్రామస్తులకు 10% ఇండ్లు కేటాయించేలా చూస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అక్టోబర్ రెండో తారీఖున జరిగే ఇండ్ల డ్రాలో రాంపల్లి గ్రామస్తులకు 10% ఇండ్లు ఇవ్వాలన్నారు. స్థానికులకు 10 శాతం కేటాయించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేస్తామన్నారు. మంత్రి మల్లారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని స్థానికులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు.

రెవెన్యూ గ్రామంగా బార్సిగూడ



నవతెలంగాణ-కీసర

బోగారం అనుబంధ గ్రామమైన బార్సిగూడను ప్రభుత్వం రెవెన్యూ గ్రామంగా గెజిట్‌ను విడుదల చేసింది. మంత్రి మల్లారెడ్డి గ్రామానికి సంబంధించిన గెజిట్ పత్రాలను శనివారం గ్రామస్తులకు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ..గత ప్రభుత్వాలు చేయని పనిని బీఆర్ఎస్ చేసిందన్నారు. బోగారం గ్రామ కోఆప్షన్ సభ్యుడు డబ్బి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ.. మంత్రి మల్లారెడ్డి సహకారం తో బార్సిగూడను రెవెన్యూ గ్రామంగా గెజిట్ విడుదల చేయడం సంతోషం అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ బెస్త వెంకటేష్, కీసర మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి సభ్యుడు నర్సింహ్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నాపురం విగ్నేశ్వరుడి మండపం వద్ద అన్నదానం





నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరధిలోని చెన్నాపురం గణేష్‌డి వద్ద కొమ్మరాజుల దివ్యవెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం పూజ, మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అథితిగా మేడ్చల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరారు. అన్నదానం దాత కొమ్మరాజుల దివ్య వెంకటేష్‌లను మహేందర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్‌గుప్తా, కార్పొరేటర్లు లావణ్య, సతీష్,రాజ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, కో- ఆప్షన్ సభ్యులు మహమ్మద్ నూరుద్దీన్ ఫరూక్, శోభారెడ్డి,అధ్యక్షులు కొండల్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, రాజశేఖర్, బాల్‌రాజ్, మహేందర్ యాదవ్, తదితరులున్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి : మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-మల్కాజిగిరి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మళ్ళీ అధికారం కట్టబెట్టేందుకు ఉపయోగపడతాయని మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం ఈస్ట్ ఆనంద్ బాగ్‌లోని మాజీ కార్పొరేటర్ ఆకుల నర్సింగ్ రావు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అందరికీ అండగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా తాను కూడా పార్టీ శ్రేణులకు స్థానిక ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ కార్పొరేటర్ మురుగేశ్ బద్దం పరశురాం రెడ్డి, ఆకుల వంశీ కృష్ణ, కవిత మహిళా ప్రెసిడెంట్, గీత గుప్త,- వైస్ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్ రెడ్డి 'ఐ' హాస్పిటల్ ప్రారంభం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



ఓల్డ్ అల్వాల్ రిటైరేట్ కాలనీ మెయిన్ రోడ్‌లో వెంకటేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన 'ఐ' హాస్పిటల్‌ను శనివారం మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ ప్రారంబించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ వెంకటేష్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని రకాల కంటి పరీక్షలు నిర్వహించి కార్పొరేట్ వైద్యంలో తగ్గకుండా వైద్యం అందజేస్తామని చెప్పారు. వైట్ కార్డు హెూల్డర్స్‌కు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, బలవంత రెడ్డి, నాగే శ్వరావు, రాజసింహా రెడ్డి, గోపాల్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ నేతృత్వంలోనే ఆదర్శవంతమైన పాలన



● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో రూ.4.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌తో కలసి శనివారం పర్యటించారు. డివిజన్ పరిధిలోని హెచ్.పి రోడ్డు, సత్య సాయి నగర్, ఎల్ఐజీ, భరత్ నగర్ కాలనీ, ఇందిరాగాంధీపురం, శివశంకర్ నగర్, బతుక మ్మకుంట, గణేష్ టెంపుల్ వీధి, ఎల్బీఎస్ నగర్, తెనుగు బస్తీలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా ఎమ్మెల్యేకు స్థానికులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. తమ డివిజన్‌ను అభివృద్ధి చేసినందుకు స్థానికులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో ప్రధానంగా తన దృష్టికి వచ్చిన సమస్యలను, అదేవిధంగా భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రోడ్లు, డ్రయినేజీలను మంత్రి కేటీఆర్ సహకారంతో రూ. 122 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. 9 ఏండ్లలో అభివృద్ధి చేసి చూపెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌లో ఆహ్లాదకరమైన పార్కులు, వాకింగ్ ట్రాక్, రోడ్లు, డ్రయినేజీలు, వేశామని నియోజకవర్గంలో 90 శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా పూర్తి చేస్తామన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి



● జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సామాజికంగా వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా శనివారం కూకట్ పల్లి జోన్‌లో జీహెచ్ఎంసీ, రోటరీ క్లబ్ ఆఫ్ మొయినాబాద్, అజియస్ ఫెడరల్ సంయుక్త ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో షాపూర్ నగర్ నుండి సూరారం కట్ట మైసమ్మ టెంపుల్ వరకు సుమారు 5 కిలోమీటర్ల వరకు సెంట్రల్ మీడియన్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, జోనల్ కమిషనర్ మమత, కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు వివేకానంద, కూకట్ పల్లి జోన్ డిప్యూటీ కమిషనర్లు, రోటరీ క్లబ్ ఆఫ్ మొయినాబాద్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పెంపొందించే ఒదుకు వివిధ కార్యక్రమాల ద్వారా మొక్కలను పెంచి నగరవాసులకు కాలుష్యం లేని పర్యావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా జీహెచ్ఎంసీ నుండి బడ్జెట్ 10శాతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. నగరంలో 600 నర్సరీలను ఏర్పాటు చేసి నగరానికి అవసరమైన మొక్కలు తయారు చేయుటకు జరుగుతుందని ఆయన అన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హరితహారం కార్యక్రమం ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం జరుగుతుందని అన్నారు. వాహన కాలుష్యం ఇతర కాలుష్యం ద్వారా ప్రజలు అనారోగ్య పాలు కాకుండా నగరంలో హరితహారం ద్వారా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం జరుగుతుందని అన్నారు. నగరంలో 185 చెరువుల సుందరీకరణ చేపట్టి ప్రజలకు అవసరమైన వాకింగ్ ట్రాక్, కుర్చీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రభుత్వంతో పాటు ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం జరుగుతుందని, అందుకు ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. భావితరాలకు పరిశుభ్రమైన వాతావరణం అందించాలని, ఆసక్తిగల వారికి జీహెచ్ఎంసీ పూర్తి సహకారం అందిస్తోందని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు.

పచ్చని చెట్లు-ప్రగతికి మెట్లు"



● ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట/కుత్బుల్లాపూర్

"పచ్చని చెట్లు ప్రగతికి మెట్ల"ని ప్రతి ఒక్కరు ఇంటిముందు, కాలనీలలో, బస్తీలలో చెట్లు పెంచాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్ చౌరస్తా నుండి సూరారం వరకు రోడ్డు మార్గంలో జీహెచ్ఎంసీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమాన్ని గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రోస్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమతతో కలిసి ప్రారంభించిన అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తమ పరిధిలోలో హరితహారానికి కృషి చేస్తూ మొక్కలు నాటడంతోనే కాకుండా వాటి పరిరక్షణ కూడా తీసుకుని తెలంగాణ రాష్ట్రాన్ని హరిత వనంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణ మనందర బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ,సీనియర్ నాయకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని



● సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్

నవతెలంగాణ-బాలానగర్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని శనివారం బాలానగర్ మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఆరవ రోజు ఆశా వర్కర్లు బతుకమ్మలు ఆడి అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించకుండా, చర్చలు జరపకుండా నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తూ ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల ఆశలను అడిఆశాలు చేయకుండా వారి సమస్య లను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు సౌభాగ్యమ్మ, అనిత, సబియా, జీనా, మౌనిక, అశ్విని, సరళ, వినోద పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : మాజీ కార్పొరేటర్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నానని మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి అన్నారు. సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పకు సుమారు రూ.4 కోట్ల, జీవన్ జ్యోతి నగర్ కు రూ. 54 లక్షలు జై సంతోష్ నగర్‌కు రూ.45 లక్షలు సీసీ రోడ్డు, భూగర్భ డ్రయినేజీ పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరైన్నాయి. ఈ సందర్భంగా శనివారం డివిజన్‌కు చెందిన ప్రజలు, ఆయా కాలనీలా అసోసియేషన్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, దళిత సంఘాల నేతలు కార్పొరేట్ కార్యాలయంలో సురేష్ రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి, ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం సురేష్ రెడ్డి మాట్లాడు తూ...ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే, నిరంతరం అందుబాటులో ఉంటూ పరిష్కారం కోసం పని చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారులతో ఫోన్లో మాట్లాడి వెనువెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ రోడ్డు, భూగర్భ డ్రయినేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ల సహకారంతో డివిజన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఏఐటీయూసీ కార్యదర్శిగా శ్రీనివాస్ నియామకం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శిగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం రంగారెడ్డి నగర్ డివిజన్, గిరినగర్ ప్రాంతానికి చెందిన వంగాల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఏఐటీయూసీ కౌన్సిల్ సమావేశం షాపూర్ నగర్‌లోని పొట్లూరి నాగేశ్వరరావు భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కే. స్వామి అధ్యక్షతన వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శిగా శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సహాయ కార్యదర్శులుగా మహేందర్, దండు రమేష్, కోశాధికారిగా దేవీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.యూ సుఫ్, ఏఐటీయూ సీ మున్సిపల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్రన్ హాజరయ్యా రు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఏఐటీయూసీని బలోపేతం చేసి సంఘటిత, అసంఘ టిత కార్మికుల పక్షాన రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి వంగాల. శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతలను అందరిని కలు పుకు పోతూ సంఘటిత, అసంఘటిత కార్మిక, కర్షకుల, పక్షాన సమర్థవంతంగా పోరాటాలు చేస్తారని స్పష్టం చేశారు.

మున్సిపల్ కార్మికుల, ఉద్యోగుల వేతనాలకై సమ్మె పోరాటం



● సీఐటీయు మేడ్చల్ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్

నవతెలంగాణ-దుండిగల్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మిక అలాగే ఉద్యోగుల వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రతపై సీఐటీయూ రాష్ట్ర కమిటీ సమ్మె పిలుపునిచ్చింది. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణకి వేతనాల పెంపు ఉద్యోగ భద్రతకై సమ్మె నోటీసు శనివారం అందచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ మన కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఎన్ఎమ్ఆర్ ఫిక్స్ పే తదితర పద్ధతుల్లో పారిశుద్ధ్యం పార్కులు హరితహారం ఇంజనీరింగ్ వాటర్ వర్క్స్ స్ట్రీట్ లైటింగ్ విభాగాల్లో పారిశుధ్య కార్మికులు డ్రైవర్లు ఎలక్ట్రీషన్లు పంపు ఆపరేటర్స్ బిల్ కలెక్టర్లు వర్క్ ఇన్స్పెక్టర్లు కంప్యూటర్ ఆపరేటర్లు డేటా ఎంట్రీ ఆపరేటర్లు జవాన్లు ఎఫ్ఎస్సీలుగా పనిచేస్తున్నారన్నారు. సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తూ వివిధ కేటగిరీలో పనిచేస్తున్న వారందరికీ పని భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రెండో పీఆర్సీ కమిషన్ సిఫారసు చేయబోయే మధ్యంతర భృతిని మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల ఉద్యోగులందరికీ వర్తింపచేయాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్నట్లు రూ.21 వేల వేతనాన్ని తెలంగాణలో కూడా వెంటనే అమలు చేయాలన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని లేనియెడల 2023 అక్టోబర్ 8 నుండి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తామని తెలియజేస్తున్నామని తెలిపారు. అక్టోబర్ మూడో తేదీ చలో ఇందిరా పార్క్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె డిమాండ్స్ సాధనకై కార్యక్రమాలు నిర్వహించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ నిర్ణయించిన దానిలో భాగంగా కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నిజాంపేట కార్పొరేషన్ ఉపాధ్యక్షులు పీ. పెంటయ్య నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

వైపర్ విద్యార్థినిని అభినందించిన కళాశాల యాజమాన్యం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఆల్విన్ కాలనిలో నివాసం ఉంటూ, మెరిల్ హెల్త్ కేర్ రోబోటిక్ విభాగంలో ఉద్యోగం చేస్తున్న ,మెదక్ జిల్లా, నర్సాపూర్ మండలం చిప్పలుర్తి గ్రామానికి చెందిన వడ్ల రమ్యశ్రీ, నర్సాపూర్‌లోని విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కళాశాలలో, బి ఫార్మసీ 2023 సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి నందుకు కళాశాల యాజమాన్యం సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ క్యాంపస్ ప్లేస్మెంట్ ద్వారా మంచి ప్యాకేజీతో వివిధ కంపెనీల్లో అవకాశం రావడం జరిగినప్పటికీ, బి ఫార్మసీ చదివినందుకు వైద్య సేవలోనే ఉద్యోగం చేయాలనే సంకల్పంతో మెరిల్ హెల్త్ కేర్ రోబోటిక్ విభాగంలో చేరి ఉద్యోగం చేస్తున్నందున అభినందిస్తూ, విష్ణు ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషనల్ యాజమాన్యం, ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ అల్లూరి అధ్యక్షతన ముఖ్య అతిథిగా రవీంద్ర బాబు, గౌరవ అతిథి లక్ష్మి ప్రసాద్ డైరెక్టర్ ఆఫ్ బీవీఆర్ ఐటీల చేతుల మీదుగా శాలువాతో సత్కరించారు.

తెలంగాణను మొదటి స్థానంలో నిలిపిన కేసీఆర్



● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

60 సంవత్సరాలలో చేయని అభివృద్ధిని 9 సంవత్సరాలలో అభివృద్ధి చేసి దేశంలోనే తెలంగాణను మొదటి స్థానంలో నిలిపిన నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్, ఫతేనగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్లు పండాల సతీష్ గౌడ్, సబిహా గౌసుద్దీన్ తో కలిసి రూ.9 కోట్ల తో రోడ్డు, డ్రయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో ప్రధానంగా తన దృష్టికి వచ్చిన సమస్యలను, రోడ్డు, డ్రయినేజీలను మంత్రి కేటీఆర్ సహకారంతో రూ.122 కోట్లతో నియోజక వర్గంలోని అన్ని డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌లో ఆహ్లాదకరమైన పార్కులు వాకింగ్ ట్రాక్, రోడ్లు, డ్రయినేజీలు వేసామన్నారు. నియోజకవర్గంలో 90 శాతం పనులు పూర్తి చేశామని పెండింగ్‌లో ఉన్న పనులను కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో నైకా బ్యూటీ బార్

నవతెలంగాణ-సిటీబ్యూరో

నైకా నగరంలోని శరత్ సిటీ మాల్‌లో అద్భుతమైన ఈవెంట్‌తో అత్యంత విజయవంతమైన బ్యూటీ బార్‌లను తిరిగి తీసుకువచ్చింది. 200 మందికి పైగా అందాల ఔత్సాహికులు ప్రపంచ ప్రఖ్యాత మేకప్ కళాకారిణి అలియా బేగ్‌తో మాస్టర్‌క్లాస్‌కు చికిత్స పొందారు, అక్కడ వారు మేబెల్‌లైన్ న్యూయార్క్, హుడా బ్యూటీ, ఇన్నిస్‌ఫ్రీ, నైకా కాస్మెటిక్స్ వంటి కొన్ని అతిపెద్ద బ్రాండ్‌లను ఉపయోగించి అల్ట్రా గ్లామరస్ లుక్‌ని సృష్టించడానికి చిట్కాలు, ట్రిక్స్ నేర్చుకున్నారు. ప్రొఫెషనల్ మేకప్ కే బ్యూటీ. అవసరమైన మేకప్, హెయిర్, స్కిన్‌కేర్ ప్రొడక్ట్‌లతో మేక్‌ఓవర్‌లను ఫీచర్ చేస్తూ, హాజరైన ప్రతి ఒక్కరూ సెషన్‌ను ఆస్వాదించారని, అద్భుతంగా కనిపించేలా, అనుభూతి చెందేలా నైకా నిర్ధారిస్తుంది.

డెంగ్యూ వ్యాధి నివారణ పై అవగాహన సదస్సు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

జీహెచ్ఎంసీ ఆరోగ్య శాఖ, ఎంటమాలజి సిబ్బంది సమన్వయంతో పని చేసి డెంగ్యూ వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రభుత్వ హాస్పిటల్‌లో, డెంగ్యూ వ్యాధి లక్షణాలు వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చర్చించడానికి ఏర్పాటు చేసిన, అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరయ్యారు. జీహెచ్ఎంసి మెడికల్, ఎంటమాలజీ ఆశా వర్కర్లతో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా డెంగ్యూ వ్యాధి మెల్లిగా పెరుగుతుందని, ఈ సమయంలోనే జీహెచ్ఎంసీ ఆరోగ్య శాఖ, ఎంటమాలజీ సిబ్బంది సమన్మయంతో పని చేసి డెంగ్యూ వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఆశా వర్కర్లు కూడా ప్రజలతో మాట్లాడి అవగాహన తీసుకురావాలని తెలిపారు . ప్రజలు సైతం బాధ్యత తీసుకుని వారి ఇండ్లతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. చెత్తను వీధుల్లోనూ కాలువలోను కాకుండా, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మమత, డాక్టర్ మను పప్పన్, ఎంటమాలజి ఎఈ ఉష రాణి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాములుగౌడ్, వెంకటేష్ గౌడ్, రాజేందర్, వద్యమ్మ, ఎంటమాలజి సూపర్వైజర్ డి.నరసింహులు, వైద్య సిబ్బంది ప్రియాంక, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



4 నుంచి బతుకమ్మ చీరలు పంపిణీ

● మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కె.పద్మజారాణి

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ 4వ తేదీ నుంచి బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి కె.పద్మజారాణి తెలిపారు. బతుకమ్మ సందర్భంగా ప్రభుత్వం అందించే బతుకమ్మ చీరల పంపిణీ నిమిత్తం జిల్లా స్థాయిలో మూడు గోడౌన్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. శామీర్‌పేట మండలం మహిళా సమాఖ్య, 128-చింతల్, భగత్‌సింగ్ నగర్ కమ్యూనిటీ హాల్, గాజుల రామారం, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్, గాంధీనగర్, రామాంతపూర్, ఉప్పల్‌లో గో డౌన్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలో తెల్ల రేషన్ కార్డు కలగి, 18 ఏండ్లు నిండిన మహిళలు ఈ చీరలకు అర్హులు అని తెలిపారు. నేటి వరకు జిల్లాకు 3,45,000 బతుకమ్మ చీరలు వచ్చినట్టు తెలిపారు. అక్టోబర్ 3వ తేదీన మండలాలు, మున్సిపాల్టీలు, జీహెచ్ఎంసీల్లోని ఆయా ప్రాంతాలను తరలించనున్నట్టు తెలిపారు.

పాలమూరు ప్రాజెక్టును సందర్శించిన అధ్యాపకుల బృందం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం దాని అనుబంధ కళాశాలల్లో పనిచేస్తున్న యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల బృందం శనివారం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును సందర్శించారు. ఈ యాత్రను జేఎన్టీయూహెచ్ ఉపకులపతి కట్టా నర్సింహారెడ్డి, మెకానికల్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్న లు పాల్గొని లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దక్షిణ తెలంగాణకు వరప్రదాయనిగా తెలంగాణ ఆరు జిల్లాలకు తాగు, సాగు నీరు అందించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన " పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు" సందర్శనకు బయలుదేరి వెళ్లారన్నారు. తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడ్డాక, నీళ్ల విషయంలో స్వయసమృద్ధి సాధించే లక్ష్యంతో తెలంగాణ రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచే, విత్తన బాండాగారంగా ఉన్న తెలంగాణను ధాన్యగారాంగ మార్చే ఉద్దేశ్యంతో కాళేశ్వరం తరువాత చేపట్టిన అతి పెద్ద ఎత్తిపోతల పథకం "పాలమూరు రంగారెడ్డి " అని అన్నారు. రాబోయే భవిష్యత్ తరాలకు , తెలంగాణ రైతాంగానికి , యావత్ ప్రజానికి ఈ ఎత్తిపోతల ప్రాజెక్టు ఉద్దేశ్యాలను, లక్ష్యాలను వివరించే గొప్ప ప్రయత్నంలో భాగంగానే ఈ యాత్ర చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.రాజేష్ ఖన్నా, డా.కె.శ్రీనివాస్ రెడ్డి, డా.దశరథం, నరేందర్ రెడ్డి, డా.రాజేష్, డా.కరుణాకర్, డా.రమేష్, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అఖిల భారత మేడి క్షత్రియ సమాజ్ అధ్యక్షులుగా జగదీష్ ప్రసాద్ వర్మ ఎన్నిక



నవతెలంగాణ-బేగంపేట్

అఖిల భారత మేడి క్షత్రియ సమాజ్ అధ్యక్షులుగా రాంగోపాల్‌పేట డివిజన్‌కు చెందిన జగదీష్ ప్రసాద్ వర్మ ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. ఈ నెల 24 వ తేదీన రాజ స్థాన్ లోని పుష్కర్‌లో జరిగిన అఖిల భారత స్థాయి సమావేశంలో జగదీష్ ప్రసాద్ వర్మ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంత్రిని కలిసిన వర్మ అఖిల భారత మేడి క్షత్రియ సమాజ్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన జగదీష్ ప్రసాద్‌వర్మ శనివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి ఈ సందర్భంగా వర్మకు శుభాకాంక్షలు తెలిపారు.



2023వ సంవత్సరానికి గాను నూతన జూనియర్ లైన్‌మేన్ నియామకాలను మంత్రి జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నియమించారు. శనివారం వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజరాహిల్స్, జూబ్లీ హిల్స్ ఎర్రగడ్డ డివిజన్ విద్యుత్తు సంఫరా అంతరాయం లేకుండా పనిచేస్తున్నట్లు నూతన బాడీ తెలిపారు. అధ్యక్షులు సర్వేష్, ఉప అధ్యక్షుల వార్జన్,డివిజన్ కార్యదర్శి సంతోష్లు ఒక సంవత్సరం కాలం పాటు కొనసాగుతారని పోటీ లేని పక్షంలో రెండు సంవత్సరం ఈ బాడీ తోనే కార్యకలాపాలు కొనసాగిస్తారని అధ్యక్షులు వర్జన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హరి కుమార్,సురేష్ రాజు, శ్రావణ్రాలు పాల్గొన్నారు.

-నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రజలు ఆశీర్వదిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్/కంటోన్మెంట్



ప్రజలకు మేలు చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని, ప్రజలకు మరింత మేలు జరుగుతుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని మల్టి పర్పస్ ఫంక్షన్‌హాల్ లో ముస్లీం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముస్లీం మైనార్టీ మహిళలు 300 మందికి కుట్టు మిషన్ లు, 80 మంది ముస్లీం మైనార్టీ లకు లక్ష రూపాయలు చొప్పున ప్రభుత్వ ఆర్థిక సహాయం చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లీం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుం దని చెప్పారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించే శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్తీలలోని కమ్యునిటీ హాల్స్ లలో మరిన్ని శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేసుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొం దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ జిల్లా అధికారి ఎలియాస్ అహ్మద్, కార్పొరేటర్ లు కొలన్ లక్ష్మి, హేమలత, మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి, ఆకుల రూప, అత్తిలి అరుణ గౌడ్, మైనార్టీ నాయకులు ఖలీల్, అఖిల్, ఫహీం, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

- హైదరాబాద్, తమిళనాడు, మహారాష్ట్రా, శ్రీలంకలో ఏజెంట్లు
- ఇద్దరు ముఠాసభ్యుల అరెస్టు
- రూ.75లక్షల విలువగల 250కిలోల గంజాయి స్వాధీనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ కమిషనరేట్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులను ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.75లక్షల విలువగల 250కిలో గంజాయితోపాటు అశోక్‌లీల్యాండ్ లారీ, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం నేరేడ్‌మెంట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపిన వివరాల మేరకు. తమిళనాడుకు చెందిన మలయాళా స్వామీ, రామర్‌లు మరికొంత మందితో కలిసి ఒక ముఠాగా ఏర్పాడ్డారు. స్వామీ నగరంలోని చాంద్రాయాణగుట్టలో నివాసముంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తమిళనాడులో ఉంటున్న తన స్నేహితుడు రామర్‌ను కలిశాడు. ఇద్దరు కలిసి సులువుగా డబ్బులు సంపాదించాలని పథకం వేశారు. గంజాయిని సరఫరా చేయాలని నిర్ణయించుకున్న ఇద్దరు గంజాయి ట్రాన్స్‌పోర్టు చేసే కెరళాకు చెందిన రాజేష్, గంజాయి విక్రయించే ఒడిస్సాకు చెందిన చంద్రశేఖర్‌తో చేతులు కలిపారు. హైదరాబాద్, తమిళనాడు, మహారాష్ట్రా, శ్రీలంకా తదితర ప్రాంతాలల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నారు. వారి సహాయంతో ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఏజెంట్ల ద్వారా విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ బృందాలు, మీర్‌పేట్ పోలీసులతో కలిసి ప్రత్యేక నిఘా వేశారు. నగరశివారుల్లో లారీని స్వాధీనం చేసుకున్నారు. ఛాకచక్యంగా కేసును ఛేదించడంతో ఎస్‌వోటీ, మీర్‌పేట్ పోలీసులను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ కే.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలి



- గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్

నవతెలంగాణ-ఓయు

తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమంలో ఎంతో కీలకంగా పనిచేసి దాదాపు 40 మంది గిరిజన బిడ్డలు బలిదానాలు ఇచ్చారని, వారిలో ప్రవీణ్ నాయక్, బోజ్యా నాయక్, రేఖాబాయి,సాయుధ రైతాంగ పోరాటంలో టాను నాయక్ లాంటి ఎందరో త్యాగాలు చేశారని గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ,ఓయూజేఏసీ, కేయూ జేఏసీ తెలిపారు. గిరిజన లంబాడి ఉద్యమకారులకు, మేధావులకు, విద్యార్థి నేతలకు బిఆర్ఎస్ ప్రభుత్వం గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా రాజకీయ భాగస్వామ్యం ఇవ్వకుండా అణచివేస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు నాయక్,చీఫ్ కోఆర్డినేటర్ రమేష్ రాథోడ్, కేయు జేఏసీ నేత సుధీర్ నాయక్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ, ఓయూజేఏసీ, కేయూ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదిన్నర సంవత్సరాలు అవుతున్న జనాభాలో 10 శాతం ఉన్న గిరిజన లంబాడి నాయకులను ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులలో,రాజ్యసభసభ్యులలో, ఎమ్మెల్సీ స్థానాలలో, కార్పొరేషన్ చైర్మన్,రాజ్యాంగ బద్ధ పదవులలో తీవ్ర అన్యాయం చేసి గిరిజన లంబాడీ సమాజాన్ని అణిచివే స్తుందన్నారు. గిరిజనులను కేవలం ఓటు బ్యాంకు గానే బిఆర్ఎస్ ప్రభుత్వం చూస్తుంది గానీ ఎక్కడ కూడా ప్రభుత్వంలో భాగస్వామ్యం లేకుండా అణిచివేత అహంకార పూరిత ధోరణితోని పాలన కొనసాగించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ అధ్యక్షులు హనుమంతు నాయక్, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు రాజు నాయక్,సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అఖిల్ రాథోడ్, మహేష్ నాయక్, సునీల్ నాయక్, రాజేష్ నాయక్, సందీప్, కిషోర్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

గణపతి దేవాలయం హుండీ లెక్కింపు

నవతెలంగాణ-కంటోన్మెంట్



మోండా డివిజన్ రెజిమెంటల్ బజార్‌లో ఉన్న చారిత్రాత్మకమైన గణపతి దేవాలయం శనివారం హుండి లెక్కింపు కార్యక్ర మా న్ని దేవాలయ ప్రాంగణంలో పోలీసులు, సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మెన్ ఓదెల సత్య నారాయణ, ఈవో వినోద్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 24 రోజుల హుండీ లెక్కింపు చేయగా మొత్తం రూ.12 లక్షల 92, వేల 410లు వచ్చిందని అందరి సమక్షంలో ఆ మొత్తాన్ని దేవాలయకు చెందిన కెనరా బ్యాంక్ అధికారులకు తరలించామని, అందరి సహకారంతో వినాయక చవితి నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ శ్రీదేవి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జయరాజ్, సభ్యులు శ్రీశైలం, హనుమంతు, అశోక్ పాల్గొన్నారు.

పూర్తి సబ్సిడీతో ముస్లిం మైనారిటీలకు చెక్కులు అందజేత

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



డివిజన్ పరిధిలో ముస్లిం మైనారిటీలుకు పూర్తి సబ్సిడీతో రూ.1,00,000/-లను శనివారం రహమత్ నగర్ డివిజన్ శ్రీరాంనగర్ చౌరస్తాలో 80 మందికి లక్ష రూపా యల చెక్కులను జూబ్లీహిల్స్ శాసనసభ్యులు భారత రాష్ట్ర సమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ అందించారు. ముందుగా ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ ముబారక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభి వృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం కట్టుబడి ఉంది అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రం సంక్షేమ పథకాలను ప్రతి ఒక్క కుటుంబానికి అందుతున్నాయని, బీసీ లకు కులవృత్తుల పథకం కింద రూ.1,00,000/- అందజేశామని, అలాగే ముస్లిం మైనారిటీ ప్రజ లకు కుట్టుమిషన్‌లను, పూర్తి సబ్సిడీతో అందజేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రహమత్ నగర్ డివిజన్ కార్పొ రేటర్ సీఎన్‌రెడ్డి, యూసుఫ్‌గూడ డివిజన్ కార్పొరేటర్ రాజు కుమార్ పటేల్, డివిజన్ అధ్యక్షులు నజీర్, అప్పు ఖాన్, సంజీవ్, కృష్ణమోహన్, నాయకులు తన్నుఖాన్, ఫయాజ్, విజయ్ సింహా, సర్దార్, షరీఫ్, సిరాజ్, జబ్బార్,అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛ సేవాలో పాల్గొండి : డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయు

స్వచ్ఛ హి సేవ (షీ) 2023 జిహెచ్ఎంసి, రాంకీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాస్ క్లీనింగ్ ఆక్టివిటీ ను విజయవంతం చేయాలని డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి కోరారు. శనివారం జీహెచ్ఎంసీ సంబంధిత ఎస్ఎఫ్ఏ లు గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిని తార్నాకలో క్యాంప్ కార్యాల యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ రోడ్లు, వీధులలో చెత్త వేయవద్దని, జిహెచ్ఎంసి అధికారులు కూడా ప్రజలలో అవగాహన కల్పించి అనునిత్యంపరిసరాలుశుభ్రంఉంచాలని కోరారు.నేడు తార్నాక డివిజన్ లోని లాలా పేట్ ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో ఉ.10:00 గంటలకు జరగ బోయే ఈస్వచ్ఛత హిసేవమాస్‌క్లీనింగ్ ఆక్టివిటీను విజయవంతం చేయాలని కోరారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమని భేటీ బచావో, భేటీ పడావో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాధికారత బృంద జెండర్ స్పెషలిస్ట్ వాసవి అన్నారు. జిల్లాలోని ఎర్రగడ్డలో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్స్ సెక్టార్ మీటింగ్‌లో వాసవి, సవిత అంగన్‌వాడీ టీచర్లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళా సాధికారత, మహిళల చట్టాలు, హెల్ప్‌లైన్ నెంబర్ 181, 1098, 14567పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత బృందం సభ్యులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శోభారాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అక్టోబర్ 2,5 తేదీలలో ఇండ్లను పంపిణీ చేస్తాం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్



అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి పేద, మధ్య తరగతి ప్రజ లకు ఉచి తంగా అందిస్తున్న దేశంలోనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం బేగంపేట లోని పాటిగడ్డలో గల మల్టి పర్పస్ ఫంక్షన్ హాల్ లో 3 వ విడత ఆన్ లైన్ డ్రా లో ఎంపికైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్దిదారులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఎంతో గొప్పగా సొంత ఇంటిలో ఆత్మగౌ రవంతో బ్రతకాలనే ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సంకల్పం మేరకు తెలంగాణ ప్రభుత్వం 9600 కోట్ల రూపాయల వ్యయంతో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టిం దని వివరించారు. మొట్ట మొదటగా ఈ కార్యక్రమం సనత్‌నగర్ నియోజకవర్గ పరిది లోని ఐడీహెచ్ కాలనీలోనే ప్రారంభమైందని, కోట్లాది రూపాయల విలువైన స్థలాల్లో ఈ డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 3వ విడతలో నిర్వహించిన డ్రాలో 36,884 మందిని ఎంపిక చేయడం జరిగిందని, వీరికి అక్టోబర్ 2,5 తేదీలలో ఇండ్లను పంపిణీ చేయను న్నట్లు చెప్పారు. ఇండ్ల నిర్మాణం, పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని తెలిపారు పాటిగడ్డ లో కూడా 6 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఫంక్షన్ హాల్ కు అవసరమైన వంట పాత్రలు, టెంట్ హౌస్ సామాగ్రిని త్వరలోనే తాను ఏర్పాటు చేస్తానని మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి తలసాని సాయి కిరణ్‌యాదవ్, కార్పొరేటర్‌లు టి.మహే శ్వరి, కొలన్ లక్ష్మి, హేమలత, మాజీ కార్పొరేటర్ లు ఉప్పట తరుణి, అత్తిలి అరుణ గౌడ్, ఆకుల రూప, నాయకులు నరేందర్, శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులను శంకుస్థాపన

నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ కార్పొ రేటర్ జీహెచ్ఎంసీ బీజేపీ ఫ్లోర్ సెక్రటరీ కక్కిరేణి చేతన హరీష్ డివిజన్లోని రవీంద్ర నగర్, హబ్సి గూడ వీధి నంబర్ 5, 6 లలో సుమారు 66 లక్షలతో 300 ఎమ్ ఎమ్‌డయా డ్రయినేజ్ పైపులైను పనులకు స్థానిక ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డితో కలిపి శనివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా కార్పోరేటర్ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన ధ్యేయంగా డ్రయినేజీ పైపులు వేసే పని ప్రారం భించినట్లు వారు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను అదేశించారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు రజినీకాంత్ ,ఆసిఫ్ అలీ,బిజెపి నాయకుల సంజయ్ పటేల్ ,రుద్ర శేఖర్ స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ షాప్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-ఓయూ

సీతాఫలమండిలోని రేషన్ పంపిణీ షాప్ లో కార్పొరేటర్ సామల హేమ శనివారం తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లా డుతూ రేషన్ షాపుల ద్వారా పేద ప్రజలకు ప్రభుత్వం బియ్యం పంపిణీ చేపట్టిందన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం తదితర ఆహార పదార్థాలు ప్రజలకు అందు తున్నాయి అని తెలిపారు. రేషన్ కార్డులో ఉన్న సభ్యులు తప్పనిసరిగా రేషన్ షాపుల్లో కేవైసి చేసుకోవాలని కోరారు.

అక్టోబర్ నెల మొత్తం ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లులో సబ్ కోటాను తక్షణమే ప్రకటించాలి

నవతెలంగాణ-ఓయూ



రాజకీయ రంగంలో ఎస్సీ ఎస్టీ బీసీ మహిళల ప్రాతినిధ్యాన్ని నీరుగారుస్తూ అగ్రకుల మహిళల కోసం తెచ్చుకున్న మహిళా బిల్లును సమస్త మహిళల బిల్లుగా కేంద్రం అభివర్ణించడం సరికాదని విద్యార్థి జేఏసీ వ్యవస్థాపకులు మన అశోక్ యాదవ్,భారత యాదవ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధి రమేష్ యాదవ్, గిరిజన శక్తి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జ్యోత్సన నాయక్‌లు అన్నారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వేదికగా జరిగిన దేశవ్యాప్త నిరసన కార్య క్ర మంలో భాగంగా మహిళా బిల్లు ప్రతులను తగలబెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా బిల్లు అగ్రకుల స్వభావాన్ని కప్పిపుచ్చుకోవడమే రిజర్వేషన్ల స్ఫూర్తిని దెబ్బ తీసే విధంగా రిజర్వేషన్లకు తూట్లు పొడిచే విధంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు రిజర్వేషన్లతో కూడిన సబ్ కోటాను చేర్చాలని, జనగణన తో పాటు కులగణను చేపట్టాలని లేని యెడల ఈ దేశంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళల పట్ల కేంద్ర బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని వారు అభివర్ణించారు. రాష్ట్రపతి ద్వారా ఆమోద ముద్ర వేయడం సమస్త ఎస్సీ ఎస్టీ బీసీలలో ఉన్నటువంటి మహిళలను అవమానపరచడమేనని తక్షణమే మహిళా బిల్లులో సబ్ కోటాను ప్రవేశపెడుతూ జనగణనతో పాటు కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల కుట్రపూరితమైనటువంటి బిజెపి అగ్రవర్ణ భావాజాలాన్ని దేశవ్యాప్తంగా ఎండగడతామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ప్రవీణ్ కుమార్ నేత వీరస్వామి మాదిగ శరత్ గణేష్ సుదర్శన్ రాజేష్, విద్యార్థి పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల నిరసన



నవతెలంగాణ-కంటోన్మెంట్

తమకు ఇండ్ల కేటాయిం పులలో అన్యాయం జరిగిందని మారేడపల్లి డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరేండ్లు గా అద్దె ఇండ్లలో ఉంటున్నా మ ని, తమకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు వెంటనే మంజూరు చే యాలని మంత్రి శ్రీనివాస్ యాదవ్ కలవగా మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేశా రని దానికి వ్యతిరేకంగా మారేడపల్లి డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు శని వారం నిరసన ప్రదర్శించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ దీపికా నరేష్‌లో మద్దతుగా పాల్గొని లబ్ధిదారులకు సంఘీభావన తెలిపారు సంద ర్భం గా లబ్ధిదారులు మంత్రి శ్రీనివాస్ యాదవ్ కు వ్యతిరేకంగా నినాదలు చేశారు. సకాలం ఇస్తా మని సమాధానం చెప్పకుండా తమపై అనుచిత వ్యాఖ్యలు చేశారని లబ్ధిదారులు మంత్రి శ్రీని వాస్ యాదవ్ పై మండిపడ్డారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చొరవ తీసుకుని వారు మజురైన వెంటనే డిమాండ్ చేశారు

ఇంజనీరింగ్ విద్యార్థుల సిటీ అండ్ క్యాంపస్ టూర్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బిఈ మెదటి సంవత్సరం విద్యార్థులు శనివారం సిటీ అండ్ క్యాంపస్ టూర్‌కు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరాం వెంకటేష్ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు నగరంలో, ఉస్మా నియా విశ్వవిద్యాలయంలో వివిధ పర్యాటక, ఐటీ, టెక్నాలజీ, అసెంబ్లీ, అంబెద్కర్ విగ్రహం, పలు నగ రంలో ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలను సందర్శించారు. వీటితో పాటుగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పర్యటించారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరాం వెంకటేష్, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, డా.ప్రసన్న, డా.భారతి, రాజేందర్, శ్రావ్యతో పాటుగా 10 టూర్ కోఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

సేవలందించడంలో ఎటువంటి అలసత్వం వద్దు

- రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ప్రేమావతి

నవతెలంగాణ-బంజారాహిల్స్



సమాజానికి మేలైన సేవలు అందించే (అనాధలుగా) పిలిచే శిశు సంక్షేమ శాఖ శిశువులకు సేవలందించడంలో ఎటువంటి అలసత్వం వద్దని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ప్రేమావతి తెలిపారు.న్యాయ సేవలు సంరక్షణ పథకం, ఇంకా నెల వారీ కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని యూసుఫ్‌గూడలో ఉన్న ప్రభుత్వ అనాధ శిశు గృహన్ని హైదరాబాద్ మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి లీగల్ సర్వీసెస్ అధ్యక్షురాలు ఎస్.ప్రేమవతి సందర్శించారు. గృహంలో వున్న వందల సంఖ్యలో ఉన్న శిశువుల వివరాలను వారికి అందించే సౌకర్యాల గురించి అక్కడి శిశువులతోపాటు పనిచేస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ ఈ గృహ వసతిలో నివాసం పొంద ఎతున్న వారందరికీ గుర్తింపు కార్డుల అందజేయడం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి కృషి అభినందనీయమని తెలుపారు. రెయిన్ బో వైద్యులు వైద్య శిబిరం నిర్వహించి సదరం సర్టిఫికేట్లు త్వరితగతిన ఇప్పించినందుకు డాక్టర్ సోమేశ్వరావును ప్రత్యేకంగా అభినందించారు. సమస్యలు ఏమైన వుంటే హైదరాబాద్ మెట్రో పాలిటన్ లీగల్ సర్వీసెస్ కార్యదర్శి రాధిక జైస్వాల్ను సంప్రదిం చాలని అక్కడున్న విద్యార్థుల బాగోగులు చూసుకుంటు న్న వారికి సలహాలు, సూచనలు చేశారు. తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రో పాలిటన్ లీగల్ సర్వీసెస్ కార్యదర్శి రాధిక జైస్వాల్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి అక్కేశ్వరరావ్,తహసిల్దార్ శ్రీరాములు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శ్రీమతి శైలజగారు మధురానగర్ పోలీస్ అధికారులు,సేవా అధికార సంస్థ పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎరుకల జాతి ఆత్మ గౌరవ పోరాట జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



వెంగళరావునగర్ డివిజన్ జవహర్ నగర్ చౌరస్తా వద్ద ఆత్మగౌరవ పోరాట జెండాను ఎరకల సంఘం నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరుకల జాతి బీసీ జాబితా నుండి ఎస్టీ జాబితాలోకి చేర్చిన దినాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 30వ తేదీన ఎరుకల ఆత్మ గౌరవ పోరాట జెండాను ఆవిష్కరిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఎరుకల సంఘాలు అన్ని ఒక్కతాటిపైకి వచ్చి, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం ఐక్య ఎరుకుల సంఘం ఆధ్వర్యంలో ఎరుకల ఆత్మ గౌరవ జెండాను ఆవిష్క రించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూతడి రవి , కేతిరి సీతారాములు, రాయపురం మహేందర్, కేతిరి సాం బయ్య , పిట్టల లింగయ్య, పులిచేరి సురేష్, బెల్లంకొండ రవి , సుల్తాన్ కృష్ణ , తదితరులు పాల్గొనడం జరిగింది.

'ఎన్ఎంఎంఎస్ఎస్' స్కాలర్షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం : డీఈవో విజయకుమారి



నవతెలంగాణ-సిటీబ్యూరో

2023-24 విద్యా సంవత్సరానికి గాను 8వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, లోకల్ బాడీ, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మాత్రమే ఎన్ఎంఎంఎస్ఎస్ స్కాలర్షిప్ అర్హత పరీక్షకు అర్హులు అని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు. ఈ ఎన్ఎంఎంఎస్ఎస్ స్కాలర్షిప్ అర్హత పరీక్ష కోసం విద్యార్థులు తమ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించడానికి అక్టోబర్ 13వ తేదీ చివరి తేదీ అని తెలిపారు. మరిన్ని వివరాలు, దరఖాస్తుల కోసం http://bse.telangana.gov.in ను సంప్రదించాలని డీఈఓ కోరారు.



ఈసీఐఎల్ చౌరస్తాలో సమ్మె చేస్తున్న ఆశావర్కర్స్

నైజీరియా ఆరోగ్య సంరక్షణకు లైఫ్‌స్పాన్ హాస్పిటల్స్..

- నైజీరియా హైకమిషనర్ సమక్షంలో ఎంఓయూపై సంతకాలు
- ఆరోగ్య సంరక్షణ సదుపాయ ప్రమాణాలను పెంచే దిశగా ఒప్పందం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హెల్త్‌కేర్ యాక్సెస్‌ను ప్రపంచవ్యాప్తంచా పెంపొందించే దిశగా గణనీయమైన పురోగతిలో, లైఫ్‌స్పాన్ హాస్పిటల్స్, నైజీరియా శనివారం జీడిమెట్ల లైఫ్‌స్పాన్ హాస్పిటల్స్‌లో అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. రైమా ఇంటర్నేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ నైజీరియా, హైదరాబాద్ ఆధారిత లైఫ్‌స్పాన్ హాస్పిటల్స్ ఇండియా మధ్య అవగాహన ఒప్పందంపై భారతదేశానికి నైజీరియా హై కమీషనర్ హిజ్ ఎక్సలెన్సీ అంబాసిడర్ అహ్మద్ సూలే అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లైఫ్‌స్పాన్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర రామ్ మాట్లాడుతూ ఈ సహకారం నైజీరియాలో ఆరోగ్య సంరక్షణ లోటును పూడ్చటం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. లైఫ్‌స్పాన్ హాస్పిటల్స్ నైజీరియాలో అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులతో కూడిన అత్యాధునిక ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి కట్టుబడి ఉందన్నారు. భారతదేశంలోని నైజీరియన్ పౌరులకు తమ నిబద్ధతను విస్తరింపజేస్తామని తెలిపారు. అందుబాటులో ఉండే అధిక-నాణ్యత వైద్య సంరక్షణను అందిస్తారని, ఈ చొరవ రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడమే కాకుండా ఆరోగ్యకరమైన సమాజాలను పెంపొందించే భాగస్వామ్య లక్ష్యాన్ని కూడా చెబుతుంది అని తెలిపారు. హెల్త్‌కేర్ పురోగతిలో భాగస్వామ్యాన్ని ఒక ముఖ్యమైన మైలురాయిగా పేర్కొంటూ డాక్టర్ రామ్ మాట్లాడుతూ "తన పౌరులకు ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందించడానికి నైజీరియాలోని నేషనల్ హెల్త్‌కేర్ సిస్టమ్‌తో మా నైపుణ్యం వనరులను కలపడానికి అతని సహకారం ప్రయత్నిస్తుంది. హెల్త్‌కేర్ ప్రొవిజన్ స్టాండర్డ్స్‌ని పెంచే దిశగా ఈ భాగస్వామ్యం ఒక ముఖ్యమైన దశను సూచిస్తుంది" అని తెలిపారు. నైజీరియాలో హాస్పిటల్స్ స్థాపన, నైజీరియాలోని లైఫ్‌స్పాన్ హాస్పిటల్స్ ద్వారా నైజీరియన్ పౌరులకు వైద్య సదుపాయాలను అందించడం గురించి వివరించే ఈ సహకారానికి సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను ఎంఓయూ వివరిస్తుందని డాక్టర్ రామ్ నొక్కి వివరించారు.

మోత మోగిద్దాం కార్యక్రమం విజయవంతం



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలుగుదేశం పార్టీజాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టు నిరసిస్తూ ఆయనకు మద్దతుగా నగరంలో తెదేపా చేపట్టిన 'మోత మోగిద్దాం' కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. సికింద్రాబాద్ పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు పి.సాయిబాబా ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 7.గం.ల నుంచి 7.05 వరకు 5 నిమిషాలపాటు జగన్‌కు వినిపించేలా మోత మోగిద్దాం కార్యక్రమం విజయవంతగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ చంద్రబాబు నాయుడుని అక్రమ కేసుల్లో ఇరికించి పలు విధాలుగా ఆయనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. కేవలం రాజకీయ కక్ష్యతో ఆయనను ఏ విధంగానైనా అణిచివేయాలనే దుర్బుద్ధితో జగన్మోహన్ రెడ్డి చేస్తున్న కుట్రలో భాగమేనని విమర్శించారు. వెంటనే చంద్రబాబు నాయుడు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి చెవులు చిల్లులు పడేలా ఈరోజు మోత ముగిద్దాం కార్యాక్రమాన్ని సికింద్రాబాద్‌లోని అన్ని డివిజన్లలో నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పి.బాలరాజ్ గౌడ్, కట్ట రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో మిలాద్-ఉన్-నబీ ర్యాలీ



- పోలీసులకు దిశానిర్దేశం చేసిన సీపీ
- నగర వాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన సీపీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేడు మిలాద్-ఉన్-నబీ జులుస్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరంలో గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో పూర్తికావడంతో ఊపిరిపీల్చుకున్న పోలీసులు మిలాద్-ఉన్-నబీపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో నగరపోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పోలీస్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నుంచి పై అధికారులు పాల్గొన్నారు. మిలాద్-ఉన్-నబీ ఊరేగింపు గుల్జార్‌హౌజ్ నుండి ప్రారంభంమై మదీనా, చెత్తబజార్, మీరాలం మండీ మీదుగా మొఘల్‌పురా వరకు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు. ఎలాంటి అంవాఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో మిలాద్ పర్వదినోత్సవాన్ని పూర్తి చేయాలన్నారు. పోకిరీలు, ఆకతాయిలపై ప్రత్యేక దృష్టిసారించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలను అందించారు. గణేష్ శోభయాత్ర విజయవంతం కావడంతో పోలీస్ అధికారులను, నిర్వాహకులకు, నగర వాసులతోపాటు ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి సీపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గణేష్ ఉత్సవ వేడుకల్లో భాగంగా భద్రతలో పాల్గొన్న ప్రతొక్కరిని ప్రశంసించారు. అందరి సహాయసహకారంతో గణేష్ ఉత్సవాన్ని ప్రశాంతవాతావరణంలో పూర్తిచేశామని తెలిపారు. మిలాద్-ఉన్-నబీ ఊరేగింపును సైతం ప్రశాంతవాతావరణంలో పూర్తి చేస్తామని సీపీ తెలిపారు. బంజారాహిల్స్‌లోని కమాండ్‌కంట్రోల్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు సీపీలు విక్రంసింగ్ మెన్నన్, విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనాల నేపథ్యంలో హుస్సేన్‌సాగర్‌లో భారీగా వ్యర్థాలు

- నగరంలో 1092 టన్నుల వ్యర్థాల తొలగింపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో ప్రశాంతవాతావరణంలో వినాయక నిమజ్జన ప్రక్రియ పూర్తయింది. దాంతో జీహెచ్ఎంసీ అధికారులు నగరంలో నిమజ్జనం చేసిన ప్రాంతాలతోపాటు హుస్సేన్ సాగర్‌ను క్లీన్ చేసే పనిలో పడ్డారు. గణేశ్ నిమజ్జనాల నేపథ్యంలో హుస్సేన్‌సాగర్‌లో వ్యర్థాలు పేరుకుపోయాయి. గణపతి నిమజ్జనం పూర్తయిన నేపథ్యంలో ఈ వ్యర్థాలను తొలగించే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. హుస్సేన్ సాగర తీరంలో ఉన్న వ్యర్థాలను క్రేన్లు, ప్రత్యేక వాహనాల సాయంతో తొలగిస్తున్నారు. గణేష్ ఉత్సవాలు ప్రారంభమైన రోజు నుంచి ఇప్పటి వరకు నగరంలో 111ట్రిప్పుల్లో 1092 టన్నుల వ్యర్థాలను తొలిగించారు. ఆ వ్యర్థాలన్నింటిని ఎప్పటికప్పుడు వాహనాల్లో తరలిస్తున్నారు. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, పీవీ నరసింహారావు మార్గ్‌లతోపాటు నగరంలోని 33 ప్రాంతాలల్లో గణేష్ నిమజ్జనం అనంతరం పేరుకుపోయిన వ్యర్థాలను జీహెచ్ఎంసీ కార్మికులు తొలగిస్తున్నారు. రోడ్లపై కూడా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. వ్యర్థాల తొలిగింపుల్లో అంతా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, ఇనుము, చెక్కలు, కర్రలు వెలికి తీస్తున్నారు. 111ట్రిప్పుల్లోలల్లో ఇప్పటి వరకు దాదాపు 1092 టన్నుల వ్యర్థాలను జీహెచ్ఎంసీ సిబ్బంది తొలిగించింది. మరో మూడు రోజులు వ్యర్థాలను తొలగించే ప్రక్రియ కొనసాగనుంది.

విద్యార్థులకు దంత పరీక్షలు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ప్రభుత్వ మాడపాటి హనుమంతరావు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు రోహిణి ఫౌండేషన్, కింగ్ కోఠి క్లస్టర్ సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ హెల్త్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని రోహిణి ఫౌండేషన్ చైర్మన్ సిహెచ్ సంపత్ కుమార్ రెడ్డి అన్నారు. విద్యార్థుల్లో పోషక ఆహార లోపం, రక్తహీనత లాంటి సమస్యలు గుర్తించి విద్యార్థులకు ఉచితంగా మందులను, టూత్ పేస్ట్ బ్రష్ కిట్లను ఉచితంగా అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలోఅర్ బి ఎస్ కే ఫార్మసిస్ట్ అలేఖ్య. డెంటల్ డాక్టర్ హారిక, డాక్టర్ సఫియా, డాక్టర్ దీక్షిత, డాక్టర్ సారా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోన్ యాప్‌ల వేధింపులకు వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

ఆన్‌లైన్‌లోన్ యాప్‌ల వేధింపులకు ఓ యువకుడు బలైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసు కుంది. బోరబండి పరిధిలో నివాసముండే డి.విజయ్ అనే వ్యక్తి ప్రయివేట్ ఉద్యోగం చేస్తూ తన అవసరాలకు లోన్ యాప్‌ల ద్వారా రుణం తీసుకున్నాడు. వేధింపులకు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్ని నెలల కిందట మనీగ్రైన్ అనే యాప్ ద్వారా అతని అవసర నిమిత్తం కొంతరుణం తీసుకొని తిరిగి చెల్లించాడు. అయినప్పటికీ ఫోన్‌లో మెసేజులు చేస్తూ, మార్ఫింగ్ వీడియోలతో విజయను బెదిరి ంచడంతో ఆత్మహత్యకు పాల్ప డినట్లు అతని కుటుంబ సభ్యుల ఫిర్యాదులో పేర్కొన్నారు. మేరకు కేసు నమోదు చేసుకున్న బోరబండ పోలీ సులు దర్యాప్తు చేసి, లోన్ యాప్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- **తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ**



నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రభుత్వం వెంటనే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శనివారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలోఅమరావదీ లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షే మార్గం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ అంశాన్ని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొం దుపరిచి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు స్పష్టమైన హామీ ఇచ్చిందని, ఇంత వరకు హామీ అమలుపరచలేదన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి 1000 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ ఆర్యవైశ్యులను ఆదుకొని ఉపాధి అవకాశం కల్పించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఉద్యమాన్ని దశలవారీగా ఉధృతం చేస్తామన్నారు. అన్ని నియోజకవర్గాలలో నామినేషన్లు వేసి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలో ఆర్గనైజింగ్ కార్యదర్శి రేణిగుంట్ల గణేష్ గుప్తా, కోశాధికారి కొండ్లె మల్లికార్జున్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఉప్పల శారద, కోశాధికారి కల్వా సుజాత, ఉపేందర్, శ్రీ లత, కల్వ సుజాత, సామ్రాజ్య లక్ష్మి, వెంకటేశ్వర్లు, రామక్రిష్ణ, ఆగిరి వెంకటేష్, శ్యామ్, చీకోటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

రాబోయే ఎన్నికల్లో బీజేపీ వలలో చిక్కొద్దు

- **బహుజన్ ముక్తి పార్టీ (బిఎంపి) జాతీయ అధ్యక్షుడు ప్రవేంద్ర ప్రతాప్ సింగ్**



నవతెలంగాణ-ముషీరాబాద్

రాబోయే ఎన్నికల్లో బిజెపి వేసే వల నుండి జాగ్రత్తగా యావత్ ప్రజానీకాన్ని అప్రమత్తంగా ఉండాలని బహుజన్ ముక్తి పార్టీ (బీఎంపీ) జాతీయ అధ్యక్షుడు ప్రవేంద్ర ప్రతాప్ సింగ్ అన్నారు. బహుజన రాజ్యాధికార సాధనకు బహుజన్ ముక్తి పార్టీ (బీఎంపీ) రాష్ట్ర మహాసభ శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగింది. బహుజన్ ముక్తి పార్టీ (బీఎంపీ) రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ సభాధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు ముఖ్య అతిథిగా బహుజన్ ముక్తి పార్టీ (బీఎంపీ) జాతీయ అధ్యక్షుడు ప్రవేంద్ర ప్రతాప్ సింగ్ హాజరై మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యాలయాలను వైద్యశాలలను పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేశాయన్నారు. ప్రయివేట్ రంగంలో అక్రమంగా విద్యాలయాలకు వైద్యశాలలకు అనుమతులు ఇస్తూ వేల లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ శ్రామిక కులాల ప్రజలకు మెరుగైన విద్య వైద్యాన్ని అందకుండా చేస్తున్నారన్నారు. ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించి శ్రామిక కులాల ప్రజల ఓటు హక్కును నిర్వీర్యం చేసి వారిని బానిసత్వ స్థాయికి దిగజార్చారని తెలిపారు. వేల కోట్ల రూపాయల మోసం చేసిన వారిని దేశం నుండి సురక్షితంగా బయట దేశాలకు పంపిన చౌకిదారులున్నారని,రాబోయే ఎన్నికల్లో బీజేపీ వేసే వల నుండి జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉపాధిని గుంజుకుని, రెండు పూటల రోటి లేకుండా బిజెపి చేసిందని ధ్వజమెత్తారు.

ఈ కార్యక్రమంలో బహుజన్ ముక్తి పార్టీ (బిఎంపి) జాతీయ ఉపాధ్యక్షులు దాస్ రాం నాయక్, భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వలిగి ప్రభాకర్, రాష్ట్రీయ మూలనివాసి సంఘ్ రాష్ట్ర కన్వీనర్, అడ్వకేట్ వి.మాధవ కృష్ణారెడ్డి, రాష్ట్రీయ ముస్లిం మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్ అబ్దుల్ ఖదీర్, బహుజన కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి రాజుల సాంబయ్య, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు వట్టం ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను వీడే ఆలోచనలో మాజీ కార్పొరేటర్ బద్రినాథ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ఆపరేషన్ ఆకర్షపై దృష్టి సారించిన కాంగ్రెస్.. బీఆర్ఎస్ లోని అసంతృప్త నేతలను చేర్చుకు చేర్చుకునేందుకు ప్రాధాన్యతనిస్తోంది. ఈ క్రమంలో సనత్ నగర్ నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్ బద్రినాథ్ యాదవ్ ఆ పార్టీ నేతలు సంప్రదింపులు జరిపారు. శనివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డినీ బద్రినాథ్ కలిశారు. టీడీపీలో ఉన్నప్పటి నుంచి ఇరువురి మధ్య పరిచయముండడంతో బద్రినాత్ యోగక్షేమాలను టీపీసీసీ చీఫ్ అడిగి తెల్సుకున్నారు. కాంగ్రెస్‌లో చేరాలని, పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చినట్టు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ నగర నేతలో అనిల్ కుమార్ యాదవ్, తోటకూర జంగయ్య యాదవ్ లతో కలిసి రేవంత్ వద్దకు వెళ్లిన బద్రీనాథ్. సనత్ నగర్ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరినట్టు సమాచారం. టికెట్ల కేటాయింపుపై అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంటుందని, సర్వేల ఆధారంగా ఎంపిక ఉంటుందని రేవంత్ చెప్పారు. రెండు, మూడు రోజుల్లో బద్రినాథ్ కాంగ్రెస్ పార్టీ లోచేరే అవకాశ ముంది. సనత్ నగర్ నియోజకవర్గంలో బహిరంగ సభ నిర్వహించాలని ఆయన భావిస్తున్నట్లు అనుచరులు తెలిపారు.

4న గుర్రం జాషువా జయంతి

- **సమతా సాహితీ వేదిక అధ్యక్షురాలు కాకుమాను శశి శ్రీ**



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రముఖ సాహితీ మిత్ర స్వర్గీయ కాకుమాను ప్రసాదరావు స్థాపించిన సమతా సాహితీ వేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 4వ తేదీన సాయంత్రం మహాకవి, నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ గుర్రం జాషువా 128వ జయంతి సభ కార్యక్రమాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నట్లు వేదిక అధ్యక్షురాలు కాకుమాను శశి శ్రీ, సిరికొండ స్ఫూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షురాలు శశి శ్రీ అధ్యక్షతన జరిగే ఈ సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఏసీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చేతన, ప్రముఖ కవులు ఆచార్య శికామణి, డాక్టర్ కోయ కోటేశ్వరరావు, డాక్టర్ పసునూరి రవీందర్, ప్రముఖ న్యాయవాది చింతల శ్రీకాంత్, మానవ హక్కుల కార్యకర్త విశ్వనాథ్ తదితర ప్రముఖులు పాల్గొంటారని ఆమె తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-బంజారాహిల్స్

గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖైరతాబాద్ మార్కెట్ రహ దారి పక్కన శ్రీ సాయి ఎలక్ట్రానిక్ షాప్ వద్ద పడుకొని ఉన్న పురుష వ్యక్తి సుమారు 40 నుండి 50 సంవత్సరాల వయస్సు ఉన్న ఆయన గత కొన్ని రోజులుగా అదే ఫుట్‌పాత్‌పై నివసిస్తూ భిక్షాటన చేస్తున్నట్లు సమాచారం. శనివారం షాపు యజమాని అలాగే స్థానికులు సహకారంతో 12 గంటలు సమయంలో ఆ వ్యక్తి కనీసం కదిలికలు లేకుండా ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న వారు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. వివరాల కోసం ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ తో పాటు విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

మోహిని చెరువు స్మశాన వాటిక అభివృద్ధి కృషి



- **ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్**
- **నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

నవతెలంగాణ-అంబర్‌పేట

మరో మహా ప్రస్థానం లాగా మోహిని చెరువు స్మశాన వాటిక అభివృద్ధి చేస్తానని మరో మహా ప్రస్థానం లాగా మోహిని చెరువు స్మశాన వాటిక అభివృద్ధి చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధిలోని మోహిని చేరువు స్మశాన వాటికను రూ.2 కోట్ల 75 లక్షల నిధులతో చేపట్టనున్న బాగ్ అంబర్ పేట డివిజన్ రామకృష్ణా నగర్ లోని మోహిన్ చెరువు స్మశాన వాటిక అభివృద్ధి పనులకు కార్పొరేటర్ పద్మావెంకటొరెడ్డితో కలిసి శంకు స్థాపన చేశారు. అభివృద్ధి పనుల్లో భాగంగా స్మశాన వాటికలో కొత్త ఆఫీస్ గదులు, షెడ్లు, ప్రాంగణం లోపల సీసీ రోడ్లు, చుట్టూ ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, నీటి పైప్ లైన్లు, విద్యు త్ దీపాలు వంటి మొదలైన సదుపాయాలు ఏర్పాటు కానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అలాగే నిర్ణీత గడువు లోగా పనులను పూర్తి చేయించి ఎన్నో ఏళ్లుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను తీర్చాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, పులిజాల గెలవయ్య, మధుసూదన్ రెడ్డి, దిలీప్, మిరియాల రవీందర్, మిరియాల శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి



- **న్యూ అంబేద్కర్‌నగర్‌లో త్వరలో డ్రయినేజీ పనులు ప్రారంభిస్తాం : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్**

నవతెలంగాణ-అంబర్‌పేట

స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం గోల్నాక డివిజన్ పరిధిలోని న్యూ అంబేద్కర్ నగర్ బస్తీలో స్థానిక అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్య లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలు కోరినట్లు పలు మౌలిక సదుపాయాలను కల్పిస్తానమని అలాగే స్థానిక కమ్యూనిటీ హాల్ ను కూడా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా త్వరలోనే బస్తీలో 40 లక్షల నిధులతో డ్రయినేజీ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, వెంకుల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

తొలగించిన ఫార్మసిస్టులను వెంటనే విధుల్లోకి చేసుకోవాలి

- **అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్**



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

తొలగించిన ఫార్మసిస్టులను వెంటనే ప్రభుత్వం విధుల్లోకి తీసుకోవాలనితెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కోఠి డీఎంఈ కార్యాలయం ముం దు ప్రభుత్వం తొలగించిన ఫార్మసిస్టులు ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ కొన్ని ఏండ్లుగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసిస్టులుగా విధులు నిర్వహించిన వారిని ప్రభుత్వం తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం కొత్తగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రులలో వీరిని ఫార్మసిస్టులుగా తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఈ మధ్య కాలంలో టీఎస్ పీఎస్ సీ ద్వారా రెగ్యులర్ ఫార్మసిస్టులో నియామకాలు జరిగాయని చెప్పారు. ఈ నియామకాలతో ఔట్ సోర్సింగ్‌లో పనిచేసిన ఫార్మసిస్టులను తొలగించడం అన్యాయమన్నారు. 20 ఏళ్లుగా పని చేస్తున్న వీరిని ఇప్పుడు తొలగించడం వీరి కుటుంబాలు రోడ్డున పడ్డాయని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా వీరి పట్ల పునరాలోచించి కొత్తగా ఏర్పాటు అయిన మెడికల్ కాలేజీలు, జనరల్ హాస్పిటల్ లో వీరిని భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఆసు పత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దుర్గం శ్రీనివాస్ వినతి పత్రం అందజేసిన ప్రభుత్వం తొలగించిన ఫార్మసిస్టులు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఫార్మసిస్టులు తదితరులు పాల్గొన్నారు.

దోమలగూడలో నూతన వీడీసీసీ రోడ్డు పనులు ప్రారంభం

- **ఎమ్మెల్యే ముఠా గోపాల్**



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడ డివిజన్ లోని దోమలగూడలో హైదరాబాద్ స్టడీ సర్కిల్ రోడ్డు , ఎం సి హెచ్ కోటర్స్ ఈ సేవ సెంటర్ వద్ద 50 లక్షల వ్యయంతో నూతన వీడీసీసీ రోడ్డు పనుల ను స్థానిక కార్పొరేటర్ రచన శ్రీ తో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన వీడీసీసీ రోడ్డు అత్యంత పటిష్టాత్మకంగా చేపడుతున్నామన్నారు. గతంలో ఈ ప్రాంతంలో తేలికపాటి వర్షాలు సంభవించిన మోకాళ్ళ లోతు వరద నీరు రోడ్ల పైన నిలిచి పేదవారి ఇండ్లు నీట మునిగాయని తెలిపారు. ఇప్పుడు అటువంటి వాటికి తవు లేకుండా డ్రయినేజీ వ్యవస్థను ఆధునీకరించి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్యదర్శి సాయి కృష్ణ సీనియర్ నాయకులు రామచందర్ , లక్ష్మీ గణపతి దేవాలయ చైర్మెన్ ముచ్చకృతి ప్రభాకర్, హనుమాన్ దేవాలయ చైర్మన్ రాజశేఖర్ గౌడ్, కల్వ గోపి మధు, జీహెచ్ఎంసి డిఈ సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో హుండీ లెక్కింపు



నవతెలంగాణ-ముషీరాబాద్

కవాడిగూడ డివిజన్ లోని దోమలగూడ హనుమాన్ దేవాలయంలో శనివారం ఆలయ ఈఓ దేవానాదం, హనుమాన్ దేవాలయ చైర్మన్ గొల్ల గడ్డ రాజ శేఖర్ గౌడ్, ఇన్‌స్పెక్టర్ సురేఖ వాణి పర్యవేక్షణలో దేవాలయ ప్రాంగణం లోని మూడు హుండీ లను ఆలయంలోని ఓపెన్ స్లాబ్‌లో లెక్కించారు. దేవాలయంలోని హుండీల ద్వారా ఆరు నెలలకు గాను ఒక లక్షా యాభై రెండువేల ఎనిమిది వందల ముప్పై ఐదు రూపాయల నగదు భక్తులు సమర్పించారని తెలిపారు, ఈ లెక్కింపు కార్యక్రమానికి సలంద్రి శ్రీనివాస్ యాదవ్, అంగటి సంతోష్ ,వేణుగోపాల్, మురళీకృష్ణ, ఆర్కే ప్రసాద్, మహేందర్, పంతులు మహేందర్, ప్రభు శేషాచలం ప్రభాకర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ, ఏసీబీ దాడులకు ఆమ్ ఆద్మీ పార్టీ భయపడదు

- **ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పై సీబీఐవి తప్పుడు కేసులు**
- **బీజేపీ ప్రతీకార రాజకీయాలు ఆప్ గొంతును అణిచివేసే ప్రయత్నం**
- **ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్**



నవతెలంగాణ-హిమాయత్ నగర్

బీజేపీ సీబీఐచే ఎన్ని అక్రమ కేసులు పెట్టించినా ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సామాన్యుల ప్రయోజనాల కోసం పోరాడుతూనే ఉంటారని, బీజేపీ ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతూ ఆప్ గొంతును అణిచివేసేందుకు ఎన్ని కుట్రలు పన్నిన భయపడేది లేదని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఢిల్లీ ముఖ్య మంత్రి అరవింద్ కేజ్రీవాల్ అధికారిక నివాసం పునరుద్ధరణలో ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బీజేపీ అధికార దుర్వినియోగంతో సీబీఐను ప్రయోగించి మళ్లీ తప్పుడు కేసులు పెట్ట దానికి ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు.పునరుద్ధరణ చేసింది పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అని అరవింద్ కేజ్రీవాల్ కి ఏమి సంబంధమని, అరవింద్ కేజ్రీవాల్ పై సీబీఐ ప్రాథమిక విచారణ పేరుతో కేసును నమోదు చేయడం బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ ప్రతీకార రాజకీయాలకు నిదర్శనమని ఆయన మండిపడ్డారు. శనివారం హిమాయత్‌నగర్, లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, ఎం.ఎ.మజీద్, అధికార ప్రతినిధులు పరీక్షిత్ రాజ్, ప్రవీణ్ యాదవ్, ఆప్ మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, దివ్యంగుల విభాగం అధ్యక్షులు దర్శనం రమేష్ లతో కలసి దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రధాని మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షాలు తమ శక్తినంతా ఉపయోగించి సీబీఐచే అరవింద్ కేజ్రీవాల్ పై 50కి పైగా కేసులు పెట్టించారని, సీబీఐ విచారణ, దర్యాప్తు చేస్తుందన్నారు. బీజేపీ ఎన్ని కుట్రలు పన్నిన, దాడులు, విచారణలు చేసిన అరవింద్ కేజ్రీవాల్ సామాన్యుల ప్రయోజనాల కోసం పోరాడుతూనే ఉంటారని, ప్రపంచంలోనే భారత్‌ను నంబర్ వన్‌గా చేస్తానని కేజ్రీవాల్ ప్రమాణం చేశారని, ఇందుకు ఎంతటి మూల్యం చెల్లించడానికైనా ఆయన సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు.వెంటనే సీబీఐ తన తప్పుడు కేసులు ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో సామాన్యుల తిరుగుబాటు తప్పదని దిడ్డి సుధాకర్ బీజేపీ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- **బాధితురాలు, ఎమ్మార్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి జున్ను సంతోష**



నవతెలంగాణ-హిమాయత్ నగర్

దళితురాలైన తన వ్యవసాయ భూమిని ఆక్రమించిన పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అరా చకాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేశాననే ఆక్రోశంతో తనపై పోలీ సుల ద్వారా అక్రమ కేసులు పెట్టించారని బాధితురాలు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జున్ను సంతోష ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం హిమాయత్ నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు జున్ను సం తోష మాట్లాడుతూ ఆత్మకూరు మండలం, గుడేపాడు చెరు వు శిఖం సర్వే నెంబర్ 791లో తమ ఉమ్మడి కుటుంబానికి చెందిన 25 ఎకరాల భూమిని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆక్ర మించుకున్నాడని ఆరోపించారు.హైదరాబాద్ లాలా పేట లోని బంధువుల దగ్గర ఉన్న తనను గత నెల 13న ఆత్మ కూరుపోలీసులు అరెస్టు చేసి హన్మకొ ండ సుబేదారి పోలీస్ స్టేషన్‌లో రాత్రి 10 గంటల వరకు నిర్బంధించారని ఆరోపించారు.ఆ సమయంలో ఆత్మకూరు సీఐ, ఎస్ఐ, ఏసీపీలు మహిళనని చూడకుం డా తీవ్ర పదజా లంతో దూషించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.తనకు భూమితో ఎలాంటి సంబంధం లేదన్నట్లుగా బాండ్ పేపర్ల మీద సంతకాలు చేయా లని వేధించారని ఆరోపించారు. తనను గొంతు కొసుకొని ఆత్మహత్య చేసుకోవాలని బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు.పలుమార్లు ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసిన పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేద న్నారు. ఎమ్మెల్యేకు వత్తాసు పలుకుతున్న పోలీసులపై వెంటనే చర్యలు తీసు కోవాలని, తన భూమిని కబ్జా చేసిన ఎమ్మెల్యేపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని, పూర్తి విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని ఆమె సీఎం కేసీఆర్‌ను కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గాయాలతో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ ఏ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం బేగం పేట్ నేచర్ క్యూర్ రైల్వే స్టేషన్ మధ్యన రైలు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడి ఉన్నాడని స్థానికులు సమాచారం అందించారని, వెంటనే చికిత్స నిమిత్తం ఉస్మానియా తరలించామన్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుని వయసు 40ఏళ్లు ఉంటాయని చెప్పారు. ఎవరైనా అతని బంధువులు ఉంటే నాంపల్లి రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 8768 125 449 సంప్రదించాలన్నారు.

అక్టోబర్ 3 నుంచి 6 వరకు ఎల్బీ స్టేడియంలో కుస్తీ పోటీలు



గొర్ల సాయిరాం యాదవ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

భారత్ వ్యాయామశాల స్పోర్ట్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు 'మోడీ కేసరి' పేరుతో కుస్తీ పోటీలు-2023ను ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు గొర్ల సాయిరాం యాదవ్ తెలిపారు. ఈ మేరకు శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కుస్తీ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుస్తీ పోటీలకు సంబంధించి 3వ తేదీన పోటీదారులకు శారీరక పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.బరువు కేటగిరీలో 50 కేజీల నుంచి 125 కేజీల పోటీల్లో ప్రైజ్ మనీ రూ.2 వేల నుంచి 10 వేలు, కాకా బాల్ కేసరి టైటిల్-యు16, 42-46 కేజీల విభాగంలో ప్రైజ్ మనీ రూ.3 వేల నుంచి 15 వేలు, వీర సావర్కర్ యువ కేసరి టైటిల్, ఆల్ ఇండియా నేషనల్ ప్లేయర్స్ బౌట్, 65-75 కేజీల విభాగంలో ప్రైజ్ మనీ రూ.10 వేల నుంచి 50 వేలు, ఆఖరుకు 80-110 కేజీల విభాగంలో రూ.11 వేల నుంచి 1 లక్ష ప్రైజ్ మనీతో పాటు మోడీ కేసరి టైటిల్ ను గెలుచుకునే అవకాశాన్ని కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.6వ తేదీ సాయంత్రం ఎల్బీ స్టేడియంలో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథిగా పాల్గొనే కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా టైటిల్‌ను అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ట్రస్ట్ నిర్వాహకులు పిట్టల చంద్రశేఖర్, కొంపల్లి అరవింద్ కుమార్, సంతోష్ ఫైల్వాన్, గులాబ్ సింగ్, సలాం ఫైల్వాన్, అస్లాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు చూసే బీఆర్ఎస్‌లో చేరికలు

- **ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్**



నవతెలంగాణ-అంబర్‌పేట

సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ పార్టీలో యువత విద్యార్థులు మేధావులు పార్టీలో చేరుతున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం బీజేవైఎం అంబర్‌పేట డివిజన్ ఉపాధ్యక్షుడు డి.రాజేష్, గంగపుత్ర సంఘం నేత యాదయ్య ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే తన నివాసంలో వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు.

చదువే ఆమె ఆయుధం

కూలికి వెళితే తప్ప రోజు గడవని కుటుంబంలో పుట్టారు. చదువుకుంటే తప్ప ఈ సమాజంలో గౌరవంగా బతకలేం అనే మాటలు వింటూ పెరిగారు. అందుకే అక్షరాలనే తన ప్రాణంగా మలుచుకున్నారు. చదువునే తన ఆయుధం చేసుకున్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఉస్మానియా యూనివర్సిటీ హిందీ విభాగానికి అధిపతిగా నిలిచారు. ఐదుగురు చెల్లెళ్లకు మంచి జీవితాన్ని ఇచ్చారు. ఆమే **ప్రొ.నివర్తి మాయావతి.** ఆమె స్ఫూర్తిదాయక జీవిత పరిచయం నేటి మానవిలో...





తెలంగాణలోనే అత్యంత వెనుకబడి ప్రాంతమైన ఆదిబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి గ్రామంలో మాయావతి పుట్టారు. తండ్రి నివర్తి వాగ్‌బిజే. ఆయన ఒక మిల్లులో హమాలీగా పని చేసేవాడు. తల్లి సునంద పొలంలో కూలి పనులు చేసేది. వీరికి ఆరుగురు సంతానం. ఐదుగురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. అందరిలో మాయనే పెద్దది. బుద్ధుడు, అంబేద్కర్, జ్యోతిబాపూలే, సావిత్రీబాయి, బసవేశ్వర్ ప్రభావం ఆ కుటుంబంపై ఎక్కువగా ఉండేది. పండగలంటే వీరికి ఆ మహానుభావుల జయంతులు, వర్ధంతులే. ఆ ప్రభావంతోనే నిరుపేద కుటుంబమైనా తండ్రి పిల్లల్ని చదివించాలనుకున్నాడు. ఆయన ప్రోత్సహంతో మాయ ఊళ్ళోనే పదోతరగతి పూర్తి చేశారు. చదువుకుంటూనే కుటుంబ అవసరాల కోసం సెలవల్లో బీడీలు చుట్టడానికి, పత్తి, కలుపు తీయడానికి, కూరగాయాలు తెంపడానికి వెళ్ళేవారు. అలా పది పూర్తి చేసి ఇంటర్ కోసం హైదరాబాద్ వచ్చారు.

ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తూ...

ఏదైనా పని చేసుకుంటే తప్ప చదువుకోలేని పరిస్థితి. దాంతో ముషీరాబాద్ సోషల్ సెల్ఫేర్ హాస్టల్లో ఉంటూ బడిచౌడీలోని హిందీ మహావిద్యాలయ సాయంత్రం కాలేజీలో చేరారు. అక్కడే ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. ఓ లెక్చరర్ సహాయంతో ఇంటర్‌లో ఉన్నప్పుడే ప్రింటింగ్ ప్రెస్‌లో పనికి చేరారు. రోజుకు పది రూపాయలు ఇచ్చేవారు. ఉదయం పది గంటల నుండి సాయంత్రం 4 గంటలకు వరకు పనికి పోవాలి. అటునుండి అటే కాలేజీకి. కాలేజీలో అందరూ చక్కగా రెడీ అయి వస్తే తను మాత్రం పనికి పోయి మురికి బట్టలతో వెళ్ళేవారు. దాంతో మాయకు చాలా ఏడుపొచ్చేది. కానీ ఏదేమైనా చదువుకోవాలనే కోరికతో తన బాధలన్నీ మర్చిపోయేవారు. కాలేజీలో చేరేటపుడే ఐదేండ్ల పాటు ప్రతి ఏడాది క్లాస్ ఫస్ట్ వస్తే గోల్డ్‌మెడల్ ఇస్తారని తెలుసుకున్నారు. ఎలాగైనా ఆ మెడల్ తనకే రావాలని చాలా కష్టపడి చదివారు. చివరికి గోల్డ్‌మెడల్ సాధించారు. తన తర్వాత చెల్లెళ్లను కూడా ఒక్కొక్కరిని హైదరాబాద్ తీసుకొచ్చి కాలేజీలో చేర్పించారు. డీటీపీ నేర్చుకుని ఆ జాబ్‌లో చేరారు. అక్కడ వారానికి ఏడు వందలు ఇచ్చేవారు. దాంతో ఆమె కష్టాలు కొంత వరకు తీరాయి. తర్వాత హెచ్.సి.యులో ఎం.ఏ హిందీలో చేరారు. అయితే అప్పుడే బీఎడ్ రాస్తే అందులో సీటు వచ్చింది. దాంతో ప్రొఫెసర్స్ సలహాతో ఎం.ఏ మధ్యలో ఆపేసి ముందు బీఎడ్ పూర్తి చేశారు. తర్వాత మళ్ళీ ఎంట్రన్స్ రాసి ఎం.ఏ కూడా పూర్తి చేశారు. అక్కడ కూడా రెండు గోల్డ్‌మెడల్స్ తెచ్చుకున్నారు. అలాగే మెరిట్ స్కాలర్‌షిప్ కూడా వచ్చింది.

దళిత సాహిత్యంపై...

బీఎడ్ పూర్తి చేయడంతో స్కూల్ అసిస్టెంట్‌గా జాబ్ సంపాదించారు. కుటుంబానికి మరింత అండగా నిలిచారు. చెల్లెళ్ల చదువుపై మరింత దృష్టి పెట్టారు. అదిలాబాద్‌కు చెందిన భరత్ వాగ్మారేతో ఆమె పెండ్లి జరిగింది. భర్త సలహాతో ఉద్యోగానికి సెలవు పెట్టి ఎం.ఫిల్ పూర్తి చేశారు. హిందీ - మరాఠీ తులనాత్మక అధ్యయనంలో దళిత సాహిత్యంపై ఆమె తన ఎంఫిల్ పూర్తి చేశారు. 'హిందీ ఔర్ మరాఠీ దళిత్ ఆత్మ కథావోంమే దళిత్ అస్మిత' అనే సబ్జెక్ట్‌పైనే తన ఎం.ఫిల్, పి.హెచ్‌డీ చేశారు. అంటే హిందీ, మరాఠీలో వచ్చిన స్ఫూర్తిదాయక జీవిత చరిత్రలను అధ్యయనం చేయడం.

తండ్రి మరణంతో...

పీహెచ్‌డీ తర్వాత తెలంగాణ యూనివర్సిటీలో జాబ్ కోసం అప్లయ్ చేశారు. ఇంటర్వ్యూలో సెలక్ట్ అయ్యారు. 2008లో అక్కడ జాయిన్ అయ్యారు. అప్పటి నుండి నిజామాబాద్‌లోనే ఉండేవాడు. అయితే 2007లో మాయ తండ్రి చనిపోయాడు. దాంతో చెల్లెళ్ళ పెండ్లి బాధ్యత ఈమె తీసుకోవల్సి వచ్చింది. అందుకే తెలంగాణ యూనివర్సిటీలో లీవ్ పెట్టి హైదరాబాద్ వచ్చి ఉస్మానియాలో ట్రై చేస్తే పోస్ట్ వచ్చింది. హైదరాబాద్ వచ్చిన తర్వాత చెల్లెళ్లందరికీ పెండిండ్లు చేశారు. వాళ్ళందరూ ఇప్పుడు మంచి కుటుంబాల్లో సెటిల్ అయ్యారు. తమ్ముడికి కూడా ఒక దారి చూపించారు.

బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా

మామ కుటుంబంలో సమాజ సేవకులు చాలా మంది ఉన్నారు. తన భర్త కూడా సోషల్ వర్కరే. మాయ కూడా తన సొంత ఊరు వెళ్ళినప్పుడల్లా అక్కడి బుద్ధ విహార్‌కి వెళ్ళి పిల్లలకు అవగాహన సదస్సులు పెడుతుంటారు. పేద పిల్లలకు కావల్సిన సహకారం అందిస్తుంటారు. ఆమె చెల్లెళ్ళలో ఒకరు హైదరబాద్‌లో ఆనాథ ఆశ్రమాన్ని నడుపుతున్నారు. అలాగే మాయవతి మొన్నటి వరకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా కూడా పని చేశారు. తను ఆ బాధ్యతల్లో ఉన్నప్పుడు ప్రస్తుత సమాజానికి అవసరమైన సిలబస్‌ను పాఠ్యపుస్తకాల్లో పెట్టేందుకు ఎంతో కృషి చేశారు. ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టి కాలేజీలు, యూనివర్సిటీలు అంటే ఏమిటో తెలియని ఆమె పాఠ్యపుస్తకాలు రూపొందించే స్థాయికి ఎదిగారు. పీహెచ్‌డీలు చేసే విద్యార్ధులకు సహకరిస్తున్నారు. ఇలా తన జాతికే కాకుండా ఎందరో మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు.

- సలీమ
- శ్రీనివాస్
ఓయూ రిపోర్టర్

దు:ఖం ఆగలేదు

'పి. హెచ్‌డీ చేసే సమయంలో వారి జీవితాలు నన్ను చాలా ప్రభావితం చేశాయి. రీసర్చ్ వర్క్ చేసేటపుడు చాలా ఏడుపొచ్చింది. 'మీరు చదువుకుంటే ఊరంతా ఎవరు శుభ్రం చేస్తారు' అన్న అగ్రకుల అహంకారం చూశాను. ఓ తల్లి తిండి లేక బిడ్డకు పాలివ్వలేక పోతే ఆ బిడ్డ చని పోయిన సంఘటర చదివినప్పుడు దు:ఖం ఆగలేదు. ఇలా ఎన్నో దుర్భరమైన జీవితాలను నా రీసర్చ్ ద్వారా ఈ ప్రపంచానికి పరిచయం చేయగలిగాను. అంటరాని వారంటే ఎప్పుడూ ఊరవతలే ఉండాలి. మరుగు దొడ్లు శుభ్రం చేయాలి, రోడ్లు శుభ్రం చేయాలి. ఇంతటి దారుణమైన జీవితాన్ని దళితులు అనుభవిస్తున్నారు. భయంకరమైన ఆర్థిక సమస్యలు. వర్ణ వ్యవస్థను సృష్టించి శూద్రులు పై కులాల వారందరికీ సేవలు చేయాలని నిర్ణయించారు. ఇలాంటి సమాజంలో దళితులు గౌరవంతో బతకాలంటే చదువు మాత్రమే ఆయుధం అని నేను నమ్ముతున్నాను' అంటారు మాయాదేవి.

కాలాన్నీ, వయసునూ ఆపలేం. రెండూ సాగిపోతూనే ఉంటాయి. అయితే... ముసలితనాన్ని కాస్త వాయిదా వేయవచ్చు. కొంతమంది 40 ఏండ్ల నుంచే ముసలి వారిలా కనిపిస్తారు. కొంత మందికి 80 ఏండ్లు వచ్చినా చురుగ్గానే ఉంటారు. ఇందుకు ప్రధాన కారణం వాళ్లు తినే ఆహారమే. మనం తినే పదార్థాలకూ, మన శరీరం, ఆరోగ్యానికీ సంబంధం ఉంటుంది. వయసులో ఉన్నప్పటి నుంచే సరైన ఆహారం తింటూ ఉంటే త్వరగా ముసలితనం రాదు. వచ్చినా అనారోగ్యాలు పెద్దగా ఉండవు. అలాంటి పరిస్థితి రావాలంటే డాక్టర్లు కొన్ని రకాల పదార్థాల్ని తినడం మానేయమంటున్నారు. ఎప్పుడో ఒకసారి తింటే పర్లేదు గానీ రెగ్యులర్‌గా మాత్రం వాటిని తినకూడదు. అవేంటో తెలుసుకుందాం.

వీటికి దూరంగా ఉండండి

- పిజ్జాలు, బర్గర్లు టేస్టీగా ఉంటాయి కానీ... ఆరోగ్యాన్ని సర్వనాశనం చేస్తాయి. ఇవి మన చర్మంపై ఉండే కాంతిని పూర్తిగా పోగొడతాయి. అంతేనా శరీర భాగాలకు కొవ్వును అతికిస్తాయి. ఫలితంగా పొట్ట వచ్చేస్తుంది. దాని చుట్టూ కొవ్వు పేరుకుంటుంది. అది వస్తే చాలు... చాలా రోగాలు వచ్చేందుకు దారి తీస్తుంది. ఫాస్ట్ ఫుడ్ ఎంత తింటే... అంతలా ఫ్యాటీ యాసిడ్స్ పెరుగుతాయి. ఫాస్ట్ ఫుడ్ తినేవాళ్లకు హార్ట్ ఎటాక్ వచ్చే ప్రమాదం ఎక్కువ. దాన్ని ఎంత తగ్గిస్తే... అంతలా మీరు ముసలితనానికి దూరమవుతారని డాక్టర్లు చెబుతున్నారు.
- కేక్‌లు, పేస్ట్రీలు, ఫ్యాట్స్... ఇవన్నీ మనలో కొవ్వును పెంచుతాయి. కొవ్వు ఎంత పెరిగితే ముసలి తనం అంత త్వరగా వస్తుంది. సో.. వాటికి దూరంగా ఉండాలి.
- చిప్స్ బాగా ఇష్టంగా తినే అలవాటుంటే ఒక్కసారి ఆలోచించండి. వాటిని ఫ్యాటీనూనెలో వేపుతారు. సాల్ట్ ఎక్కువగా వాడుతారు. అలాంటివి తింటే ఆరోగ్యం పాడై పోతుంది. అవి మీకు తెలియకుండానే మీ శరీర భాగాలను నాశనం చేసి ముసలితనం త్వరగా వచ్చేలా చేస్తాయి.
- ఎనర్జీ డ్రింకులు, కూల్ డ్రింకులు తాగడం మానేయడం మేలు. వాటి బదులు ఫ్రూట్ జ్యూస్‌లు తాగితే మేలు. ఇలాంటి డ్రింక్స్ కూడా బాడీలో నీటిని కోల్పోయేలా చేస్తాయి. వీటిలోని కెఫైన్ శరీరానికి హాని చేస్తుంది. త్వరగా ముసలితనం వచ్చేలా చేస్తుంది.



ఒకప్పుడు బీజేపీ నేతను...

- ఇప్పుడు గవర్నర్‌ను : డాక్టర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తాను ఒకప్పుడు బీజేపీ నేతనే తప్ప ప్రస్తుతం గవర్నర్‌నని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ తెలిపారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లుకు రాష్ట్రపతి సంతకం చేసిన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు లింగ సమానత్వానికి సంబంధించి చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందని ఆమె అభివర్ణించారు. తనపై రాళ్లు వేసేవారు, పూలువేసే వారుంటారనీ, వాటిని తాను పట్టించుకోకుండా ప్రజా సేవ చేస్తానని తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయించాలి

- సీఎస్ శాంతి కుమారికి వినతి :డీజేహెచ్ఎస్ ప్రతినిధి బృందం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయించాలని కోరుతూ డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధి బృందం శనివారం సచివాలయంలో సీఎస్ శాంతికుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఎస్ స్పందిస్తూ జర్నలిస్టుల ఇండ్ల కోసం తమ వంతు కృషి చేస్తామంటూ హామీ ఇచ్చారు. సొసైటీ అధ్యక్షులు బొల్లోజు రవి, ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాస్, ట్రెజరర్ సి హెచ్ అయ్యప్ప, డైరెక్టర్లు దండా రామకృష్ణ, డి.కుమార్, సభ్యులు శ్రీలత తదితరులు సీఎస్‌ను కలిసిన వారిలో ఉన్నారు. "డీజేహెచ్ఎస్' సభ్యులకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో విజయవంతంగా ముందుకెళ్తుందనీ, ఈ క్రమంలో జర్నలిస్టులకు కూడా ఇండ్లు కేటాయించాలని కోరారు.

చంద్రబాబు అరెస్టు దురదృష్టకరం

(మొదటిపేజీ తరువాయి)

కర్మాగారానికి శనివారం మంత్రి హరీశ్‌రావు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో ఆంధ్రాలో ఒక ఎకరా భూమి అమ్మితే తెలంగాణలో వందల ఎకరాల భూమి కొనేవారమని, నేడు పరిస్థితి మారిందని ఆంధ్రాలో వందల ఎకరాల భూములు అమ్మితే తెలంగాణలో ఎకరా భూమి వస్తుందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఒక మంచి మాట అన్నారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ వచ్చిందని, రాష్ట్రంలో జై జవాన్ జై కిసాన్ అనే నినాదాన్ని నిజం చేశారని అన్నారు. రైతులను లక్షాధికారులను చేయాలని నాటి నినాదమని, అది నేడు కేసీఆర్ వల్ల నిజమైందని అన్నారు. 50 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు, ఎర్రబారిన నేలలు మిగిలాయని, గాలిలో దీపం లాగా కరెంటు ఉండేదని, సిగ్గు లేకుండా కాంగ్రెస్ నాయకులు కరెంటు సరఫరా పై వ్యాఖ్యలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నేడు కేసీఆర్ పాలనలో నీటి తీరువాలేదని, కరెంటు బిల్లులు లేవని, ఉచిత కరెంటు ఇస్తున్నామని, రైతు బంధు ఇచ్చి ఆదుకుంటున్నామని, ఒక గుంట భూమి పంట ఎండిందా అని అన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ పాలకులకు సోయి లేదు

బీజేపీ, కాంగ్రెస్ పాలకులకు సోయిలేక, దూరదృష్టి లేకపోవడంతోనే ప్రతి సంవత్సరం రూ.1.56 కోట్ల విలువైన మంచి నూనెను దిగుమతి చేసుకుంటున్నామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. దేశంలో ఒక వ్యక్తి సంవత్సరానికి 19 కిలోల నూనె వాడుతున్నాడని, అందులో 40 శాతం మనదేశంలో ఉత్పత్తి అయితే, 60 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, అందుకు గత పాలకులకు ముందుచూపు లేకపోవడమే కారణమని అన్నారు. మన కూరల్లోకి విదేశీ నూనెలను ఉపయోగించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్యే సతీష్, ఎఫ్డిసి చైర్మెన్ ప్రతాపరెడ్డి, ఆయిల్ ఫెడ్ కమిషనర్ హనుమంతరావు, ఎండి సురేందర్ రెడ్డి, చైర్మెన్ రామకృష్ణారెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జెడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆశాలకు పారితోషికాల పేరుతో కేవలం రూ.9750 ఇస్తూ పని భారం మోపుతూ.. దేశంలోనే మూడు సార్లు పారితోషికాలు పెంచామని పాలకులు గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. టార్గెట్లు, పని ఒత్తిడి వల్ల ఆశాలు చిన్న వయస్సులోనే బీపీ, షుగర్, థైరాయిడ్, గుండెపోటు వంటి రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని, 6 నెలల పీఆర్సీ బకాయిలు, 18 నెలల కరోనా రిస్క్ అలవెన్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం వెంటనే యూనియన్‌తో చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్, ఐద్వా నగర కార్యదర్శి నాగలక్ష్మి, సీఐటీయూ నగర సహాయ కార్యదర్శులు మహేందర్, ఎం.సత్యనారాయణ, నాయకులు పి.మల్లేష్, ఆశా వర్కర్స్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు యాదమ్మ, ఎం.అనిత కోశాధికారి రాణి తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో ఆశాలు మానవహారంగా ఏర్పడ్డారు. రాజేంద్రనగర్‌లోని హైదర్‌గూడ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. వికారాబాద్ జిల్లాలో పరిగిలో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాల్లో ఆశా కార్యకర్తలు నిర్మల్-భైంసా జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. లోకేశ్వరంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి మానవహారం నిర్వహించారు.

కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కండ్లకు నల్ల గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలను నిరసిస్తూ చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం పెద్దతండలో ప్రధాన రహదారిపై ఆశాలు మానవహారం చేపట్టారు. మధిరలో భారీ ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. మధిరలో ఎమ్మెల్యే భట్టి విక్రమార్క సంఘీభావం తెలిపారు. భట్టికి ఆశాలు వినతి పత్రం అందజేశారు.

నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆశాలు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో మానవహారం నిర్వహించారు. మర్రిగూడలో సమ్మెకు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. నాంపల్లి మండలంలో ఆశాలు తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు.

ఓట్ల కోసం పాట్లు..

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు సెటిలర్ల 'బలాబలాల' గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినట్టు తెలిసింది. వారి ఓట్లు లేకపోతే తాము ఎన్నికల్లో గెలవలేమంటూ అధినేత వద్ద తమ గోసను వెళ్లబోసుకున్నారు కాబోలు.. ఇప్పుడు మాట మార్చి సెటిలర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

నష్ట నివారణా చర్యలు...

ఈ క్రమంలో పలు నియోజకవర్గాల్లో సెటిటర్ల బలాబలాలను పసిగట్టిన కేసీఆర్ ఆఘమేఘాల మీద నష్ట నివారణా చర్యలకు ఆదేశించారు. అందుకే కేటీఆర్ రంగంలోకి దిగి... సెటిలర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. వాస్తవానికి ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు మంత్రి పువ్వాడ అజయకుమార్... తొలుత జూనియర్ ఎన్టీఆర్‌ను ఆహ్వానించారని వినికిడి. కానీ మారిన పరిస్థితుల నేపథ్యంలో కేటీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరించి, తానే ఆ సభకు ముఖ్య అతిథిగా హాజరై, ఎన్టీఆర్‌ను వేనోళ్లా కీర్తించారు. ఇదే సమయంలో అన్నగారిని, సీఎం కేసీఆర్‌ను పోలుస్తూ 'కేసీఆర్‌కు ఎన్టీఆర్ రాజకీయ గురువు...' అని చెప్పటం ద్వారా సెటిలర్లలో ఉన్న ఆగ్రహాన్ని, అనుగ్రహంగా మార్చుకునేందుకు ప్రయత్నించారని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు సిద్ధిపేట కేంద్రంగా హరీశ్‌రావు సైతం చంద్రబాబు అరెస్టును తప్పుబట్టారు. మరి ఈ నష్ట నివారణా ప్రయత్నాలు ఫలిస్తాయా..? లేదా..? అన్నది ఎన్నికల తర్వాత గానీ తెలియదు.

ఆనాటి కేసీఆర్ మాటలు...

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఓ టెర్మినల్‌కు ఎన్టీఆర్ పేరు పెట్టాలనే ప్రస్తావన వచ్చినప్పుడు గతంలో అసెంబ్లీలో సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేసుకుంటున్నారు. 'ఎన్టీఆర్ నాకు రాజకీయ గురువు. ఆయన ప్రోత్సాహంతోనే నేను నాయకుడిగా ఎదిగాను. కానీ ఒక ఆంధ్రా వ్యక్తి పేరును తెలంగాణ ప్రాంతంలోని టెర్మినల్‌కు ఎలా పెడతారు. మీరు అంతగా పెట్టాలనుకుంటే మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు పేరును ఆ టెర్మినల్‌కు పెట్టండి...' అంటూ కేసీఆర్ అప్పట్లో వ్యాఖ్యానించటం గమనార్హం.

బీజేపీ ఎంపీ అనుచిత తీరు

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహరించిన తీరు ఇప్పుడు తీవ్ర వివాదాస్పదమవుతున్నది. మహిళా ఎమ్మెల్యే సమ్మతి లేకుండానే సదరు ఎంపీ ఆమె భుజాల మీద చేతులు వేసి అనుచితంగా ప్రవర్తించాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బీజేపీ ఎంపీ తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన తీరును నెటిజన్లు తప్పుబడుతున్నారు. ఒక మహిళా ఎమ్మెల్యేపై అందరి ముందు ఒక ఎంపీ ఇలా చేతులు వేయటం ఏమిటనీ ప్రతిపక్షాలు సైతం ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

ఈ ఘటన యూపీలోని అలీఘడ్‌లో చోటు చేసుకున్నది. అలీగఢ్ ఎంపీ సతీశ్ గౌతమ్, స్థానిక ఎమ్మెల్యే ముక్తా రాజాలు కోల్ ప్రాంతంలో సెప్టెంబర్ 25న దీన్ దయాల్ ఉపాధ్యాయ జన్మదినం సందర్భంగా జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో సతీశ్ గౌతమ్.. ముక్తా రాజా చేతిలో చేయి వేసి నవ్వాడు. అనంతరం ఆమె భుజాలపై చేతులు వేశాడు. ఎంపీ తీరుతో మహిళా ఎమ్మెల్యే ఇబ్బందికరంగా భావించింది. అతనిని వెంటనే ఆ చర్య నుంచి నిరోధించింది. ఈ సమయంలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు అక్కడే ఉన్నారు. ఈ ఘటనతో వారంతా ఆశ్చర్యానికి లోనయ్యారు. ఎంపీ తనపై చేతులు వేయటంతో అసౌకర్యానికి గురైన మహిళా ఎమ్మెల్యే వెంటనే తన సీటును మార్చుకున్నది. ఎంపీ, ఎమ్మెల్యే మధ్యలో మరో బీజేపీ నాయకుడు కూర్చున్నాడు.

సోషల్ మీడియాలో ఆగ్రహం

వీడియో వైరల్ అయిన వెంటనే ప్రజలు బీజేపీ నాయకుడి అసభ్యకరమైన చర్యపై విస్తృతంగా విమర్శించారు. మహిళల భద్రతపై కాంగ్రెస్ ప్రశ్నలు లేవనెత్తింది. ఇది సంస్కారవంతమైన బీజేపీ వాస్తవికత అని కాంగ్రెస్ పార్టీ జాతీయ మీడియా ప్యానలిస్ట్ సురేంద్ర రాజ్‌పుత్ అన్నారు. సతీష్ గౌతమ్ చర్యను బాధిత మహిళా ఎమ్మెల్యే వ్యతిరేకిస్తున్నట్టు చూపుతున్న ఘటనను కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ కూడా ఖండించింది.

విత్తన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలి

- రైతుల సమావేశంలో టి సాగర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గద్వాల నడిగడ్డ ప్రాంతంలోని ఎర్ర తెగులు సోకి నష్టపోయిన పత్తి విత్తిన రైతులకు పరిహారం ఇప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ విమర్శించారు. పత్తి విత్తన సాగును సుమారు 50 వేల ఎకరాలలో ఇరవై ఏండ్లుగా సాగు చేస్తున్నారని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఫౌండేషన్ సీడును నాటిన తర్వాత అతివృష్టి, అనావృష్టి, నకిలీ విత్తనాల వల్ల ఎర్ర తెగులు వైరస్ సోకడం వల్ల 2015,16 నుంచి వేల ఎకరాలలో పంటలు నష్టపోతున్నారని తెలిపారు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పెద్ద ఎత్తున నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గద్వాల కలెక్టర్, వ్యవసాయ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్యాకెట్టు ధర 700 రూపాయల చెల్లించాలనీ, పంటలకు బీమా సౌకర్యం కల్పించాలనీ, ఎకరానికి వడ్డీ లేని రుణం రూ. 2లక్షలు, జిల్లింగ్ అయిన తర్వాత రెండు నెలలు డబ్బులు రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పిల్లల గుండె ఆపరేషన్లు నిరంతర ప్రక్రియ

- నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లోని పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో గుండె చికిత్సల క్యాంపు నేటితో ముగించడం లేదని, చిన్న పిల్లలకు గుండె ఆపరేషన్లు నిరంతరం జరుగుతూనే ఉంటాయని ఆస్పత్రి డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి భీరప్ప వెల్లడించారు. బ్రిటన్ వైద్యుల సహకారంతో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన చిన్నారుల గుండె ఆపరేషన్లు విజయవం తమైన సందర్భంగా శనివారం నిమ్స్ లర్నింగ్ సెంటర్‌లో యూకే డాక్టర్లకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీరప్ప మాట్లాడుతూ.. ఈ వారంలో కనీసం 500 మంది చిన్నారులకు స్క్రీనింగ్ చేసినట్టు తెలిపారు. చిన్నారుల్లో సమస్య తీవ్రతను గుర్తించి నిమ్స్‌లోని స్పెషాలిటీ బ్లాక్‌లో ప్రతి గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రూం నెంబర్ 10లో ప్రత్యేకంగా కార్డియాలజీ ఓపీ కన్సల్టేషన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డాక్టర్ అంబిరిస్ రావు మాట్లాడుతూ.. ఈ దఫా 15 ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేశామని, మిగతా వారికి కూడా ఆపరేషన్లు నిరంతరంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గోపాల్, డాక్టర్ రమణ, వైద్యుల బృందం, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడాల్సిన సమయమిది

(మొదటిపేజీ తరువాయి)

మనం ఒక్కటైతే విజయం సాధించగలం' అన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, మన భవిష్యత్తుకు ముప్పు పొంచి ఉందని, ఆర్ఎస్ఎస్‌కు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ విమర్శించారు. 'దాదాపు 100 ఏండ్లుగా ఆర్ఎస్ఎస్ తన కేంద్ర లక్ష్యాల నుంచి కదలలేదు. ముసుగు మారుతుంది. కానీ లక్షణం కాదు. ఆర్ఎస్ఎస్‌తో ఎప్పుడూ రాజీపడని పార్టీ కాంగ్రెస్' అని ఆయన అన్నారు. సదస్సులో చర్చలను వివరిస్తూ సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయ సాధనకు కృషిచేయాలని తాము నిర్ణయించుకున్నామని అన్నారు. 'మేము వాలంటీర్లను రిక్రూట్ చేస్తాము. శిక్షణ ఇస్తాము. పర్యవేక్షిస్తాము. డిసెంబరు నాటికి వాలంటీర్లను ఏర్పాటు చేస్తాం' అని చెప్పారు. కమ్యూనిస్ట్ మార్క్సిస్ట్ పార్టీ (సీఎంపీ) నాయకుడు సీపీ జాన్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య ధర్మాలను ధ్వంసం చేసిన శక్తులపై పోరాడాల్సిన సమయం ఇదేనని తీర్మానం స్పష్టం చేసిందన్నారు.

లిప్‌స్టిక్‌లు పెట్టుకున్నవాళ్లే...

- మహిళా రిజర్వేషన్‌పై ఆర్జేడీ నేత వివాదాస్పద వ్యాఖ్యలు



పాట్నా : ఇటీవల పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై కొందరు రాజకీయ నాయకులు వివాదాస్పద రీతిలో స్పందిస్తున్నారు. మహిళా రిజర్వేషన్‌పై ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతు న్నారు. బీహార్‌కు చెందిన ఆర్జేడీ నేత అబ్దుల్ బారీ సిద్ధికీ ఈ జాబితాలో చేరాడు. మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో లిప్‌స్టిక్‌లు పెట్టుకున్న, బాబ్ కట్ చేసుకున్న మహిళలు ముందుకొస్తారని అన్నారు. బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అబ్దుల్ బారీ మాట్లాడుతూ.. "మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందింది కాబట్టి ఇకపై లిప్‌స్టిక్‌లు పెట్టుకునే ఆడవాళ్లు, బాబ్ కట్ చేసుకునే ఆడవాళ్లు మహిళా రిజర్వేషన్ పేరు చెప్పి హంగామా చేయటం మొదలు పెడతారు చూడండి" అని అన్నారు. అయితే, ఈయన వ్యాఖ్యలపై స్వంత పార్టీ నేతలతో సహా ఇతర పార్టీల నుంచి సైతం విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. గ్రామస్థులకు అర్థమయ్యే విధంగా చెప్పటం కోసం తాను అలా మాట్లాడాల్సి వచ్చిందని అబ్దుల్ బారీ తన వ్యాఖ్యలను సరి చేసుకునే ప్రయత్నం చేశారు. ఈ రిజర్వేషన్ బిల్లుకు మొదటి నుంచి తమ పార్టీ మద్దతిస్తున్నదని గుర్తు చేశారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఆర్జేడీ బిల్లుకు మద్దతిచ్చిందనీ, అయితే బిల్లులో ఓబీసీలను చేర్చకపోవటంపై మాత్రం తమ పార్టీ తీవ్ర స్థాయిలో విభేదించిందని ఆయన చెప్పారు.

నవచిత్రం


మోహన్‌లాల్

లూసిఫర్ 2తో లైకా ప్రొడక్షన్స్ మాలీవుడ్ ఎంట్రీ

మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ కాంబినేషన్‌లో రూపొందిన 'లూసిఫర్' సినిమా ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇదే చిత్రాన్ని తెలుగులో 'గాడ్‌ఫాదర్'గా రీమేక్ చేసి చిరంజీవి సైతం ఘనం విజయం సాధించారు. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా 'ఎల్2ఇ: ఎంపురాన్' చిత్రం ఇదే కాంబోలో తెరకెక్కనుంది. అయితే ఈ సినిమా ఆంటోని పెరంబవూర్ చైర్మన్‌గా కొనసాగుతున్న ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌తో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ కలయికలో జి.కె.ఎం.తమిళ్ కుమరన్ నేతృత్వంలో రూపొందనుండటం విశేషం.

'సంస్కృతి, సాంప్రదాయలకు విలువనిచ్చే మాలీవుడ్‌లోకి లైకా ప్రొడక్షన్స్ సంస్థ అధినేత సుభాస్కరన్ అడుగుపెట్టడం ఆనందంగా ఉంది. అలాగే లైకా ప్రొడక్షన్స్ మలయాళంలో సినిమాలు తీయటానికి సిద్ధమవటం అనేది చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఎంతో దోహదం చేయటమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులకు ఎన్నో కొత్త కథాంశాలతో సినిమాలను చూసే అవకాశాలను కలిగించొచ్చు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం మాతో చేతులు కలపడం ఆనందంగా ఉంది' అని ఆశీర్వాద్ సినిమాస్ సంస్థ పేర్కొంది.

మంచు విష్ణు 'కన్నప్ప'లో మోహన్ లాల్

హీరో మంచు విష్ణు పాన్ ఇండియా సినిమాగా నిర్మిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై 'మహాభారత్' సిరీస్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ సినిమాలో ప్రభాస్ ఓ ముఖ్య పాత్రను పోషించబోతున్న విషయం తెలిసిందే. తాజాగా మరో స్టార్ మోహన్ లాల్ సైతం ఇందులో ఓ ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు. ప్రస్తుతం 'కన్నప్ప' టీం న్యూజిలాండ్‌లో ఉంది. పరుచూరి గోపాలకృష్ణ గారు, విజయేంద్ర ప్రసాద్, తోటపల్లి సాయి నాథ్, తోట ప్రసాద్, నాగేశ్వర రెడ్డి, ఈశ్వర్ రెడ్డి.. తదితరులు ఈ స్క్రిప్ట్‌ను అద్భుతంగా మలిచారని మంచు విష్ణు చెప్పారు.


పవన్ కళ్యాణ్

ఉస్తాద్.. యాక్షన్ షెడ్యూల్ పూర్తి

పవన్‌కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ సినిమా ప్రస్తుతం యాక్షన్-ప్యాక్డ్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ రానున్న రోజుల్లోనూ ఎగ్జైటింగ్ అప్‌డేట్స్‌తో వస్తామని మేకర్స్ శనివారం అనౌన్స్ చేశారు. వర్క్స్ జరుగుతున్న తీరుతో చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేసింది.'గబ్బర్ సింగ్' లాంటి సెన్సేషనల్ హిట్ తర్వాత పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబోలో వస్తున్న చిత్రం కావడంతో పాటు సినిమా గ్లింప్స్‌కి సర్వత్రా అద్భుతమైన స్పందన రావడంతో ఈ సినిమా ఇప్పటికే హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేసింది. పైగా ఈ సినిమాలోనూ పవన్ కళ్యాణ్ మరోసారి పోలీసుగా అలరించబోతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్‌లో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు' అని చిత్ర బృందం తెలిపింది.


ఇషా రెబ్బా

సర్‌ప్రైజ్ చేసే సినిమా

సుధీర్ బాబు, హర్షవర్ధన్ కలయికలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'మామ మశ్చీంద్ర'. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పిపై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు నిర్మించారు. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ ద్విభాషా చిత్రాన్ని సృష్టి సెల్యులాయిడ్ సోనాలి నారంగ్, సృష్టి సమర్పిస్తున్నారు. ఈనెల 6న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తున్న సందర్భంగా నాయిక ఈషా రెబ్బా మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'హర్షవర్ధన్ దర్శకత్వంలో ఈ సినిమా చేయటం, ఇందులో విశాలాక్షి పాత్రకు నేను అయితే బావుంటుందని హీరో సుధీర్ బాబు నా పేరు సజెస్ట్ చేయటం హ్యాపీగా అనిపించింది. ఇది చాలా మలుపులు, ఎంటర్‌టైనర్‌మెంట్ ఉన్న కథ ఇది. ఇందులో ప్రతి పాత్రకు ప్రాముఖ్యత ఉంటుంది. అలాగే ఒక బ్యాక్ స్టోరీతోపాటు ప్రతి పాత్రకు లేయర్స్ ఉన్నాయి. సుధీర్ బాబు ట్రిపుల్ రోల్ లుక్స్‌తో పాటు డైలాగ్స్ కూడా భిన్నంగా ఉంటాయి. మూడు పాత్రల్లో ఆయన అద్భుతంగా నటించారు. ఇక ప్రతి పది నిమిషాలకు ఒక సర్‌ప్రైజ్ చేసే ఎలిమెంట్ ఉంది. మృణాలిని రవితో పని చేయడం మంచి అనుభవం. ప్రస్తుతం తమిళంలో విక్రమ్ ప్రభు ప్రాజెక్ట్ చేస్తున్నాను. తెలుగులో మరో మూవీ త్వరలోనే స్టార్ట్ అవుతుంది' అని ఈషా తెలిపింది.

ఇందులో నా పాత్ర పేరు వైరల్ విశాలాక్షి. టిక్ టాక్ వీడియోలు చేసే పాత్ర. ఇలాంటి పాత్ర చేయడం నాకు చాలా కొత్త. వైరల్‌గా ఉండే వీడియోస్ చేసే నా పాత్ర చాలా హైపర్‌గా ఉంటుంది.


అద్భుతమైన లైఫ్ డ్రామా

నవీన్ చంద్ర, స్వాతిరెడ్డి ప్రధాన పాత్రలలో నటించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. దర్శకుడు శ్రీకాంత్ నాగోతి ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించగా, క్రిషివ్ ప్రొడక్షన్స్, హ్యాండ్‌పిక్డ్ స్టోరీస్ బ్యానర్ పై యశ్వంత్ ములుకుట్ల నిర్మించారు.

ఈ చిత్రం ఈనెల 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో నిర్మాత యశ్వంత్ మీడియాతో మాట్లాడుతూ, 'ఇదొక ఒక లైఫ్ డ్రామా. ప్రతి ఒక్కరి లైఫ్‌లో హనీమూన్ పీరియడ్ బ్యూటీఫుల్‌గా ఉంటుంది. అయితే అది లైఫ్ లాంగ్ ఉండాలని లేదు. దీనితో పాటు ఎత్తుపల్లాలు ఉంటాయనేది వాస్తవం. ఈ వాస్తవాన్ని చూపించే ప్రయత్నం చేసేది ఈ చిత్రం. ఇందులో ఓ పాత్రకు అమెరికా నుంచి వచ్చిన అమ్మాయి కావాలి. అలాగే నటన కూడా వచ్చి ఉండాలి. అందుకే శ్రేయాని ఎంపిక చేశాం. ఈ పాత్రను తను చాలా అద్భుతంగా చేసింది. ఇక నవీన్‌చంద్ర, స్వాతిరెడ్డి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇది గొప్ప థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా. దాదాపు అన్నీ లైవ్ లోకేషన్స్‌లో సింక్ సౌండ్‌తో షూట్ చేశాం. అచ్చు రాజమణి అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఆడియన్స్‌కి ఖచ్చితంగా ఒక డిఫరెంట్ అనుభూతినిస్తుంది. ముఖ్యంగా ఈ సినిమా స్క్రీన్ ప్లే చాలా కీలకంగా ఉంటుంది. దీన్ని రవికాంత్ అద్భుతంగా చేశారు. ఈనెల 6న ఎక్కువ సినిమాలు విడుదలవుతున్నప్పటికీ మాకు థియేటర్స్ సమస్య లేదు. ఎన్ని రిలీజ్ అవుతున్నా మన ఆడియన్స్ ఎవరు అనేది ఎంపిక చేసుకోవడం చాలా ముఖ్యం. మా ఆడియన్స్‌ని ఇప్పటికే మేం ఎంపిక చేసుకున్నాం. మా జోనర్ చాలా డిఫరెంట్. ట్రైలర్ రిలీజ్ తర్వాత బజ్ పెరిగింది. బిజినెస్ పరంగా కూడా హ్యాపీగా ఉన్నాం' అని అన్నారు.


యశ్వంత్ ములుకుట్ల

మేడమ్.. చీఫ్ మినిస్టర్


రేవతి, పట్నం మహేందర్‌రెడ్డి

ఎస్.ఆర్.పి ప్రొడక్షన్స బ్యానర్‌పై తొలి చిత్రంగా రూపొందుతున్న 'మేడమ్ చీఫ్ మినిస్టర్' శనివారం అన్నపూర్ణ స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఘనంగా మొదలైంది. డా.సూర్య రేవతి మెట్టకూరు కథానాయికగా నటిస్తూ, స్వీయ దర్శక నిర్మాణంలో తెరకెక్కిస్తున్నారు. ఆమెపై చిత్రీకరించిన తొలి షాట్‌కు తెలంగాణ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి క్లాప్ ఇచ్చారు. 'ప్రస్తుతం సమాజం ఉన్న పరిస్థితులను చూసి, ఓ సినిమా ద్వారా ఆ పరిస్థితులను చెప్పాల నిపించింది. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఉన్న ఈ సినిమా యువతకు బాగా కనెక్ట్ అవుతుంది. 5 భాషల్లో నిర్మితమవుతున్న ఈ సినిమా పొలిటికల్ సినిమా కాదు.. పబ్లిక్ సినిమా. ప్రపంచంలో ఇండియా అనేది చాలా గొప్పది అని ఈ సినిమాతో చెప్పాలనుకున్నా' అని రేవతి చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

అమృతకాలం ఎప్పుడొస్తుందో...!?

మహిళా సాధికారతపై చిత్తశుద్ధి ఏది?

- మాటలు ఘనం...చేతలు శూన్యం
- అఘాయిత్యాలు జరుగుతున్నా నోరు మెదపరు
- రిజర్వేషన్ల అమలుపై కుంటిసాకులు చెబుతారు



న్యూఢిల్లీ : ఈ సంవత్సరం చివరలో ఐదు రాష్ట్రాల శాసనసభలకు, వచ్చే సంవత్సరం ఏప్రిల్-మే నెలల్లో లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించుకుంది. చట్టసభలలో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పించి వారికి విధానాలు, చట్టాల రూపకల్పనలో సముచిత ప్రాతినిధ్యం కల్పించడమే తన లక్ష్యమని గొప్పగా చెప్పుకుంది. అయితే మాటలు కోటలు దాటి చేతలు గడప దాటని సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు మహిళా సాధికారత విషయంలోనూ మోడీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో పరిశీలిస్తే బండారం బయటపడుతుంది.

మహిళా బిల్లు సెప్టెంబర్ 21న రాజ్యసభ ఆమోదం పొందగానే పార్లమెంట్ వెలుపల కన్పించిన దృశ్యాన్ని ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి. రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చి, దానిని పార్లమెంటులో ఆమోదింపజేసినందుకు కృతజ్ఞతగా మహిళా సభ్యులంతా మోడీకి జేజేలు పలికిన ఆ దృశ్యాన్ని వీక్షించి కమలనాథులు ఉబ్బి తబ్బిబయ్యారు. మే 28న పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవం జరిగిన రోజు మహిళా మల్లయోధులను వీధుల్లో ఈడ్చుకెళ్లిన దృశ్యాలు కూడా ఇంకా దేశం మరిచిపోలేదు. ఈ రెండు ఉదంతాల మధ్య ఎంత తేడా ఉన్నదో గమనించాలి.

నిర్బంధాలు... అణచివేతలు

ప్రజాస్వామ్య పరిరక్షణలో మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని చెప్పుకుంటున్న పాలకులు... వారిపై దాష్టీకాలు జరుగుతుంటే అదేమని ప్రశ్నించే అవకాశం కూడా ఇవ్వడం లేదు. నిరసనలు, ఆందోళనలను బలప్రయోగంతో అణచివేస్తున్నారు. మణిపూర్‌లో మహిళల పై జరిగిన అఘాయిత్యాలను ప్రపంచమంతా గమనించింది. ఈ దారుణాలకు సంబంధించి సామాజిక మాధ్యమాలలో వీడియోలు కూడా వైరల్ అయ్యాయి. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం అంటూ పెద్ద పెద్ద మాటలు చెప్పే పాలకులు ఈ దారుణాలను చూసి కనీసం చలించిన పాపాన పోలేదు. మణిపూర్‌లోనే కాదు... దేశంలోని అనేక ప్రాంతాలలో మహిళల పట్ల పైశాచికంగా వ్యవహరిస్తున్న ఉదంతాలను గురించి ప్రతిరోజూ వింటూనే ఉన్నాము.

మాటలకే పరిమితం

మహిళా సాధికారత వాస్తవ రూపం దాల్చాలంటే విధానపరమైన నిర్ణయాలలో మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ పెద్దలు ప్రవచిస్తుంటారు. కానీ మాటలకు, చేతలకు ఎక్కడా పొంతన లేదు. ఏకాభిప్రాయం లేదన్న సాకు చూపి మహిళా రిజర్వేషన్ బిల్లుపై విపరీతమైన కాలయాపన చేశారు. చివరికి హడావిడిగా బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేసుకొని చేతులు దులుపుకున్నారు. అమలు మాత్రం ఇప్పుడే కాదంటూ చావు కబురు చల్లగా చెప్పారు. బిల్లులోని క్లాజ్ 5 (1) ప్రకారం... జనగణన, నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తర్వాతే మహిళా బిల్లు అమలులోకి వస్తుంది. వచ్చినా పదిహేను సంవత్సరాలు మాత్రమే రిజర్వేషన్లు అమలులో ఉంటాయి.

అమృత్‌కాల్, సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ వంటి మాటలు వినసొంపుగానే ఉన్నా ఆచరణలో మాత్రం నీటి మీద రాతలుగా మారుతున్నాయి.

ఈ ప్రశ్నలకు బదులేది?

ఒక చట్టం అమలును కొంతకాలం నిలిపివేయడం, దానిని ఇతర ప్రభుత్వ చర్యలతో ముడిపెట్టడం, పైగా అమలుకు కాలపరిమితి నిర్ణయించడం..గతంలో ఎన్నడూ జరగలేదు. 2021లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని చేసిన ప్రకటనకు ఇది భిన్నంగా ఉంది. అప్పుడు మోడీ ఏమన్నారంటే...అమృతకాలం పాతిక సంవత్సరాలు. అయితే అప్పటి వరకూ వేచి ఉండాల్సిన అవసరం లేదు. ఇప్పుడే మొదలు పెట్టాలి. ఒక్క క్షణం కూడా వృథా కాకూడదు. ఇదే సరైన సమయం. మన దేశం మారాలి. ప్రజలుగా మనం కూడా మారాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా మనమూ మారాల్సి ఉంటుంది... మరి అప్పుడు ప్రధాని చెప్పిందేమిటి? ఇప్పుడు చేసిందేమిటి? మహిళా బిల్లును వెంటనే ఎందుకు అమలులోకి తీసుకురాలేదు? దానికి సరైన సమయం ఇంకా రాలేదా? మహిళా రిజర్వేషన్ల విషయానికి వచ్చేసరికి అప్పుడు చెప్పిన మాటలన్నీ మర్చిపోయారా?

కుంటిసాకులతో కాలయాపన

2026 తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిన వారు ఇప్పుడు ఇంత హడావిడిగా బిల్లును ఎందుకు ఆమోదించాల్సి వచ్చింది? ఇది కేవలం ఎన్నికల వేళ మహిళలను మభ్యపెట్టడానికేనని అర్థమవుతోంది. ఇక్కడ ఇంకో విషయాన్ని గమనించాల్సి ఉంది. రిజర్వేషన్ల కారణంగా సీట్లు కోల్పోయే వారిని బుజ్జగించడానికే ఈ ఎత్తు వేశారు. బిల్లును ఆమోదింపజేసుకునేందుకు అవసరమైన సంఖ్యాబలం 2014 నుండే ప్రభుత్వానికి ఉంది. అనేక బిల్లుల విషయంలో ప్రతిపక్షాల నుండి అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ మందబలంతో వాటిని ఆమోదించుకున్న ఉదంతాలు అనేకం. వ్యవసాయ చట్టాలు, కార్మిక నిబంధన లు వీటికి ఉదాహరణలు. కానీ మహిళా బిల్లు విషయంలో మాత్రం ఏకాభిప్రాయం కొరవడిందన్న సాకు చెప్పారు. వాస్తవానికి మహిళా సాధికారత విషయంలో మోడీ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదు. అనేక ప్రభుత్వ విధానాలు మహిళా లోకానికి నష్ట దాయకంగా ఉంటున్నాయి. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు సం బంధించిన సమాచారం సభ్య సమాజానికి ఆందోళన కలిగిస్తోంది. మహిళ లకు సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడం లేదు. వారిపై ఇంటిపని భారం పెరుగుతోంది. ప్రతిరోజూ మహిళలపై దౌర్జన్యాలు, దాష్టీకాలు, అకృత్యాలు, లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయి. వాస్తవాల గుట్టును చరిత్ర రట్టు చేస్తుంటే పాలకులు మాత్రం మహిళా సాధికారత అంటూ తీపి కబుర్లు చెబుతూనే ఉన్నారు. ప్రజలను మభ్యపెడుతూనే ఉన్నారు.

మర్రిగూడ తహసీల్దార్ ఇంట్లో ఏసీబీ దాడులు

- ఏకకాలంలో 15 చోట్ల సోదాలు
- భారీగా నగదు, ఆస్తుల గుర్తింపు
- మహేందర్‌రెడ్డి అరెస్టు, ఏసీబీ కోర్టులో హాజరు



నవతెలంగాణ-మర్రిగూడ

ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో నల్లగొండ జిల్లా మర్రిగూడ తహసీల్దార్ మహేందర్ రెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.2కోట్ల 50లక్షలు, కిలోల కొద్దీ బంగారం బయటపడిందని సమాచారం. గతంలో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన మహేందర్‌రెడ్డి అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నాడు. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయనే కచ్చితమైన సమాచారంతో ఏసీబీ బృందాలు రంగంలోకి దిగాయి. మహేందర్ రెడ్డి నెల కిందటే బదిలీపై నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల తహసీల్దార్‌గా వచ్చారు. మొత్తం మహేందర్ రెడ్డికి సంబంధించిన 15 చోట్ల ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. ఓ బృందం మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించింది. కార్యాలయ సిబ్బందిని గంటల తరబడి అధికారులు విచారించారు. బినామీ పేర్ల మీద, బంధువుల పేర్ల ఉన్న ఆస్తుల వివరాలను సేకరిస్తున్నట్టు సమాచారం. హైదరాబాద్‌లోని వనస్థలిపురం హస్తినాపురంలోని శిరిడీసాయి నగర్‌లో ఉన్న ఆయన నివాసంలోనూ ఏసీబీ అధికారులు సోదాలు చేసి భారీగా నగదు, బంగారాన్ని గుర్తించారు. పెట్టెల్లో దాచిన సుమారు రూ.2కోట్లు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. స్థిర, చరాస్తులకు సంబంధించిన కీలక పత్రాలను గుర్తించారు. అక్రమాస్తులు సుమారు రూ.4.75కోట్లుగా ఏసీబీ అధికారులు తేల్చారు. తహసీల్దార్‌ను అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు.

ఎన్‌కౌంటర్లన్నీ పోలీసు ఆత్మరక్షణ చర్యలే !

సుప్రీంకు తెలియచేసిన యుపి సర్కార్

న్యూఢిల్లీ : పోలీసు ఎన్‌కౌంటర్లన్నీ ఆత్మరక్షణ చర్యలేనని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వ్యాఖ్యానించింది. వీటిపై సక్రమంగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరుగుతాయని, వీటి గురించి దాచిపెట్టడానికి ఏమీ వుండదని పేర్కొంది. తమ పోలీసుల చర్యల విచారణలకు సంబంధించి 286 పేజీల నివేదికను రాష్ట్ర ప్రభుత్వంసుప్రీం కోర్టుకు అందచేసింది. "నిందితులు మరణించిన ఘటనల్లో పోలీసుల ఆత్మరక్షణ చర్యలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తాం. 2017 నుండి చోటు చేసుకున్న పోలీసు ఎన్‌కౌంటర్ ఘటనల్లో హత్యకు గురైన నేరస్తులకు సంబంధించిన వివరాలు, దర్యాప్తు ఫలితాలు అన్నింటినీ సేకరించాం, ప్రతి నెలా పోలీసు ప్రధాన కార్యాలయంలో వాటిని పరిశీలిస్తాం. ప్రభుత్వంపై వచ్చే తీవ్రమైన ఆరోపణలు పూర్తిగా తప్పుడు ఆరోపణలు, అసమర్థనీయమైనవి." అని యుపి స్పెషల్ టాస్క్ ఫోర్స్ అదనపు డైరెక్టర్ జనరల్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున తెలియచేశారు. గ్యాంగ్‌స్టర్ నుండి రాజకీయ నేతగా మారిన అతిక్ అహ్మద్ ఎన్‌కౌంటర్‌కు సంబంధించి ఆయన సోదరి ఆయేషా నూరీ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రభుత్వం ఈ నివేదికను అందచేసింది. ఏప్రిల్‌లో రోజుల వ్యవధిలో తన సోదరులిద్దరి, మేనల్లుడి హత్యకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర పోలీసులే కారణమని ఆమె ఆరోపించారు. న్యాయ పరిధిలోకి రాని ఈ హత్యల గురించి ఆమె చేసిన ఆరోపణలపై స్పందించాల్సిందిగా సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

మేమేం తలుపులు మూసుకుని కూర్చోలేదు..

ఆధారాలుంటే ఇవ్వండి.. కెనడాకు స్ట్రాంగ్ మెసేజ్.

న్యూఢిల్లీ: ఖలిస్తాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కెనడా, ఇండియా మధ్య తీవ్ర వివాదానికి దారి తీశాయి. కెనడా ప్రధాని మాట్లాడుతూ.. ఈ హత్యలో భారత ప్రేమయం ఉందని ఆరోపించారు. అయితే ఆయన వ్యాఖ్యలకు భారత్ కూడా గట్టిగానే స్పందిస్తోంది. అమెరికా పర్యటనలో ఉన్న భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కెనడాకు గట్టిగానే బదులిచ్చాడు. కెనడా చేసిన ఆరోపణలపై ఆధారాలు ఉంటే చూపించాలని అన్నారు. ఉగ్రవాదంపై ఉదాసీన వైఖరే ఇక్కడ ప్రధాన సమస్య, దీన్ని పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లిన జైశంకర్ అక్కడి మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కెనడా-ఇండియా మధ్య ఉద్రిక్త పరిస్థితులపై మీడియా ప్రశ్నలు అడిగింది. "హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత ఏజెంట్ల ప్రమేయం ఉందని కెనడా ఆరోపిస్తోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి కెనడా వద్ద నిర్దిష్ట సమాచారం ఉంటే భారత పరిశీలించేందుకు సిద్ధంగా ఉందని, మేమేం తలుపులు మూసుకుని కూర్చోలేదు. కానీ కెనడా ఆ వివరాలు ఇవ్వాలి కాదా..!" అని జైశంకర్ అన్నారు. ఈ అంశంపై ఇరు దేశాలు చర్చించి, విభేదాలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కెనడా ప్రభుత్వంతో భారత్ చాలా కాలంగా ఇబ్బందులు పడుతోందని, ఉగ్రవాదంపై వారి ఉదాసీన వైఖరే ఇందుకు కారణమని జైశంకర్ అన్నారు. భారత్ లో నేరాలకు పాల్పడిన వ్యక్తులు కెనడాలో ఉన్నారని, వారిని అప్పగించాల్సిందిగా భారత్ కోరినప్పటికీ కెనడా ప్రభుత్వం పట్టించుకోలేదని, భారత వ్యతిరేఖ శక్తులు తమ పనిని కొనసాగిస్తూనే ఉన్నాయని జైశంకర్ ఫైర్ అయ్యారు. భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో మా దౌత్య కార్యాలయాలపై దాడులు చేయడంతో పాటు దౌత్యవేత్తలను బెదిరించడం ఆమోదయోగ్యం కాదని అన్నారు. ఈ ఏడాది జూన్ నెలలో కెనడాలోని బ్రిటిష్ కొలంబియా సర్రే నగరంలో ఖలిస్తాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ ని గుర్తుతెలియని వ్యక్తులు గురుద్వారా వద్ద కాల్చేశారు. అయితే ఈ హత్యను భారత్ ఏజెంట్లే చేశారని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో అక్కడి పార్లమెంట్ లో ఆరోపించారు. దీంతో ఇరు దేశాల మధ్య వివాదం ముదిరింది. కెనడా భారత దౌత్యవేత్తను బహిష్కరిస్తే, ఇందుకు ప్రతిగా భారత్ కూడా కెనడా దౌత్యవేత్తను బహిష్కరించింది. కెనడా ఆరోపణల్ని అసంబద్ధ, ప్రేరేపిత వ్యాఖ్యలుగా భారత్ కొట్టిపారేసింది. కెనడా ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారిందని భారత విదేశంగశాఖ ధ్వజమెత్తింది.

'గృహలక్ష్మి'లో అవకతవకలపై రాస్తారోకో

- బీఆర్ఎస్ నేతలనే ఎంపిక చేస్తున్నారని తండావాసుల ఆగ్రహం



నవతెలంగాణ-ఆత్మకూరుఎస్

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్‌ఎస్ మండలంలోని కొత్తతండాలో గృహ లక్ష్మి పథకం అమలులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ గ్రామస్తులు సూర్యాపేట - దంతాలపల్లి రహదారి పై శనివారం రాస్తారోకో చేశారు. రోడ్డుపై అడ్డంగా కట్టెలు వేశారు. ఈ సందర్భంగా కొత్తతండా మహి ళలు మాట్లాడుతూ.. అర్హులకు గృహలక్ష్మి పథకం వర్తింపజేయకుండా అనర్హులైన అధికార పార్టీ నాయకులను ఎంపిక చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండ్లు, వ్యవసాయ భూములు ఉండి బీఆర్ఎస్‌లో పనిచేస్తున్న వారినే ఎంపిక చేయడం ఏంటని ప్రశ్నించారు. అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పనులు చేస్తున్న పేదలను ఎంపిక చేయకపోవడం దారుణమన్నారు. పోలీసులు తండావాసులకు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. అదేవిధంగా పాతర్లపహాడ్ ఎక్స్‌రోడ్డు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఒకవైపు మహాత్మా గాంధీ, మరో వైపు గాడ్సే..

ఎంపీ ప్రచారంలో రాహుల్ గాంధీ..

భోపాల్: మధ్యప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీకి మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. గత దశాబ్దకాలం నుంచి ఆ రాష్ట్రంలో బీజేపీనే అధికారంలో ఉంటోంది. అయితే ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి శాయశక్తుల ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కీలక నేత రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య పోరును మహాత్మా గాంధీ, గాడ్సేల మధ్య పోరుగా అభివర్ణించారు. రాహుల్ గాంధీ బీజేపీ పార్టీని మహాత్మా గాంధీ హంతకుడు నాథురామ్ గాడ్సేతో పోల్చారు. ఎంపీలోని షాజాపూర్ లో జరిగిన 'జన్ ఆక్రోశ్' ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఇది రెండు సిద్ధాంతాల మధ్య పోరాటమని, ఓ వైపు కాంగ్రెస్ పార్టీ ఉంటే మరోవైపు బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఉన్నాయని, ఒక వైపు మహాత్మా గాంధీ ఉంటే మరో వైపు గాడ్సే ఉన్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ సోదరభావం పెంచితే, బీజేపీ ద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని ఆయన ఆరోపించారు. బీజేపీ ఎక్కడికెళ్లినా ద్వేషాన్ని వ్యాప్తి చేస్తుందని, మధ్యప్రదేశ్ యువత, రైతులు వారిని బీజేపీని అసహ్యించుకుంటున్నారని, ప్రజలకు వారు ఏం చేశారు, ప్రజల నుంచి వారు అదే పొందుతారు అని రాహుల్ గాంధీ అన్నారు. భారత్ జోడో యాత్ర చేస్తున్న సమయంలో మధ్యప్రదేశ్ కి చెందిన రైతులు తనను కలిశారని, వారు నాతో చాలా చెప్పారని, ఈ రాష్ట్రంలో బీజేపీ చేసిన అవినీతి దేశంలో ఎక్కడా జరగలేదని రాహుల్ ఆరోపించారు. రైతులు పండించిన పంటకు సరైన ధర లభించట్లేదని, ఛత్తీస్‌గఢ్ లో బియ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2500 ఇస్తోందని ఆయన అన్నారు.

'నిందితుడిని నిరవధిక కాలం ఖైదు చేయడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే !'

ముంబయి : విచారణ పూర్తయ్యేవరకు ఒక వ్యక్తిని నిరవధికంగా ఖైదీ చేయరాదని, అది, రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని బాంబే హైకోర్టు పేర్కొంది. జంట హత్యల కేసులో నిందితుడైన ఒక వ్యక్తికి బెయిల్ మంజూరు చేస్తూ బాంబే హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పూనే జిల్లాలోని లోనావాలా పోలీసులు 2016 సెప్టెంబరులో అరెస్టు చేసిన ఆకాష్ సతీస్ చండాలియాకు ఈ నెల 26న ఏకసభ్య ధర్మాసనం జస్టిస్ భారతి డాంగ్రే బెయిల్ మంజూరు చేశారు. ఆరోపణల తీవ్రతకు, విచారణ ముగియడానికి పట్టే సుదీర్ఘ కాలానికి మధ్య సమతూకం వుండాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొంది. నేరం యొక్క తీవ్రత, దాని హేయమైన స్వభావం ఒక కోణం, దాన్ని కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సి వుంటుంది. అయితే అదే సమయంలో బెయిల్‌పై నిందితుడిని విడుదల చేసే విచక్షణను కూడా గమనంలోకి తీసుకోవాలని కోర్టు వ్యాఖ్యానించింది. నిందితుడిని సుదీర్ఘకాలం ఖైదుగా వుంచడమనే అంశాన్ని కూడా కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం వుందని పేర్కొంది. నిర్దిష్ట కాలపరిమితిలో విచారణను పూర్తి చేయడానికి ఆదేశాలు జారీ అయినప్పటికీ ఇటువంటి పరిస్థితుల్లో ఎలాంటి ఫలితాన్ని ఇవ్వడం లేదని, అందువల్ల బెయిల్‌పై నిందితుడిని విడుదల చేయడం తప్ప మరో మార్గం లేకుండా పోయిందని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

స్కాట్లాండ్ గురుద్వారాలో భారత్ హై కమిషనర్ ప్రవేశాన్ని

అడ్డుకున్న రాడికల్ సిక్కు గ్రూపులు

న్యూఢిల్లీ : బ్రిటన్‌లో భారత్ హై కమిషనర్ విక్రమ్ దొరైస్వామి శుక్రవారం స్కాట్లాండ్‌లో గురుద్వారాలో ప్రవేశించనీయకుండా రాడికల్ సిక్కు గ్రూపులు అడ్డుకున్నాయి.

గ్లాస్గో గురుద్వారాకి చెందిన కమిటీతో దొరైస్వామికి సమావేశం వుందని తమకు తెలిసిందని ఖలిస్తానీ అనుకూల యువత తెలిపారు. దాంతో కొంతమంది వ్యక్తులు ఆయనను లోపలకు రానివ్వకుండా అడ్డుకున్నారని, వెంటనే ఆయన అక్కడ నుండి వెళ్ళిపోయారని మీడియా కథనాలు తెలిపాయి. ఈ సందర్భంగా చిన్నపాటి ఘర్షణ చోటు చేసకుందని అక్కడ యువత తెలిపారు. ఇక్కడ జరిగినదానితో గురుద్వారా కమిటీ కూడా సంతోషంగా లేదని ఖలిస్తానీ మద్దతుదారు ఒకరు మీడియాకు తెలిపారు. బ్రిటన్‌లోని ఏగురుద్వారాలోనూ భారత అధికారులెవరినీ స్వాగతించేది లేదన్నారు. హై కమిషనర్‌కు విందు కోసం టబుల్స్ సిద్ధం చేసి వుంచడం సిక్కు యూత్ యుకె పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పేజ్‌లో వుంచిన వీడియోలో కనిపిస్తోంది. అయితే హై కమిషనర్‌కు ఆహ్వానాన్ని పంపడంపై గురుద్వారా కమిటీ సభ్యుడొకరు ఘర్షణ పడడంతో సమస్య తలెత్తింది. కెనడాలో ఏం జరుగుతోందో మాకు తెలుసు, భారత్ వైఖరిని బహిరంగంగా ఖండిస్తూ, భారత దౌత్యవేత్తలను కెనడా ప్రధాని బహిష్కరించడం మాకు చెంపపెట్టు వంటిదన్నారు. వీసా దరఖాస్తుల పేరుతో అధికార హోదాలో ఎవరు గురుద్వారాకు వచ్చినా ఇదే జరుగుతుందని రాడికల్ సిక్కు గ్రూపుకు చెందిన ఒకరు తెలిపారు.

దౌత్యవేత్తలకు భద్రత కల్పించండి

బ్రిటన్‌లోని భారత హై కమిషనర్‌కి భారత్ అదనంగా భద్రత కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. లండన్‌లోని అధికారులతో భారత్ ఈ విషయాన్ని ప్రస్తావించింది. ప్రస్తుతం లండన్ పర్యటనలో వున్న దొరైస్వామికి అదనంగా భద్రత కల్పించాల్సిందిగా బ్రిటన్ అధికారులను కోరింది.

హామీల అమలుపై అలసత్వం..!

కార్మికులకు నెరవేరని సొంతింటి కల

- మారుపేర్ల సవరణలోనూ తీవ్రజాప్యం
- అపరిష్కృతంగా సింగరేణి కార్మికుల సమస్యలు
- నేడు మంచిర్యాల జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన
- త్వరలో సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు

సింగరేణి కార్మిక క్షేత్రంలో సమస్యలు యథాతథంగా ఉన్నాయి. కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై సందిగ్ధం నెలకొంది. 2018లో సింగరేణి ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కార్మికుల సొంతింటి కల నెరవేరకపోవడం.. మారుపేర్ల సవరణలోనూ తీవ్ర జాప్యం కావడం వంటి సమస్యలు అలాగే ఉన్నాయి. మరోపక్క ఈనెల 28వ తేదీన సింగరేణి ఎన్నికలు నిర్వహించేందుకు యాజమాన్యం సన్నాహాలు చేస్తుండటంతో గుర్తింపు సంఘమైన టీబీజీకేఎస్‌కు ఇబ్బందికర పరిస్థితి ఎదురు కానుందనే సంకేతాలు వినిపిస్తున్నాయి. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో కొత్త గనుల ప్రారంభం తప్పితే ఏదీ పరిష్కారం కాలేదు. ఆదివారం మంత్రి కేటీఆర్ మంచిర్యాల జిల్లాలోని మందమర్రి, రామకృష్ణాపూర్ ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నల్లబంగారు నేలగా పిలువబడే సింగరేణిలో కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయి. ఎన్నో ఏండ్లుగా పరిష్కారానికి నోచుకోకపోవడంతో తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. మరోపక్క 2018 ఏడాదిలో సింగరేణి ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం పలు హామీలు గుప్పించింది. ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్)ను గెలిపిస్తే వివిధ సమస్యలు పరిష్కరిస్తామని భరోసా కల్పించింది. ఆరు కొత్త గనులను ప్రారంభిస్తామని, బ్లాక్‌లను సింగరేణికే అప్పగిస్తామని, కార్మికుల మారుపేర్లు సవరిస్తామని, వారసత్వ ఉద్యోగాలకు అర్హత వయసును 35ఏండ్ల నుంచి 40ఏండ్లకు పెంచుతామని, ఒక్కో కార్మికుడికి రూ.10లక్షలు వడ్డీలేని రుణం అందిస్తామని హామీనిచ్చింది. పది వేల కొత్త క్వార్టర్ల నిర్మాణంతోపాటు కార్మికుల సొంతింటి కలను నెరవేరుస్తామని ఆ సంఘం కార్మిక నేతలు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం హామీలతో మెజార్టీ డివిజన్లల్లో టీబీజీకేఎస్‌కే కార్మికులు మద్దతు పలికి గెలిపించారు. కానీ, ఇచ్చిన హామీల్లో కొన్ని కొత్త గనులను తెరిపించిన ప్రభుత్వం మిగతా వాటిని విస్మరించిందనే ఆరోపణలున్నాయి. మరోపక్క వడ్డీలేని రుణం స్థానంలో కార్మికులే రుణం తీసుకుంటే కంపెనీనే ఆ రుణానికి వడ్డీ చెల్లిస్తుందని చెబుతుండటం కార్మికుల్లో అసంతృప్తికి కారణమవుతోంది. మరోపక్క మారుపేర్ల సవరణ లేకపోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.



మంత్రి పర్యటనపై ఆశలు..!

మంచిర్యాల జిల్లా మందమర్రి, రామకృష్ణాపూర్‌లో మంత్రి కేటీఆర్ ఆదివారం పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు ఇదే నెల చివరి వారంలో జరగనున్నాయి. ఈ క్రమంలో మంత్రి కేటీఆర్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తారని.. వాటి పరిష్కారానికి భరోసా లభిస్తుందని కార్మికులు ఆశలు పెట్టుకున్నారు. వారసత్వం కోల్పోయిన వారు సుమారు వంద మంది ఉంటారు. వీరికి ఇప్పటి వరకు ఉద్యోగాలు కల్పించలేదు. ఏండ్ల నుంచి ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్నా ఇప్పటికీ నెరవేరడం లేదు. తాజాగా వీరి ఉద్యోగాల కల్పన అంశంపైనా ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తిగా మారింది. మరోపక్క ఎన్నికలకు సమయం దగ్గర పడటంతో మరోసారి టీబీజీకేఎస్ ఎన్నికల్లో విజయం సాధించాలని భావిస్తోంది. ఈ తరుణంలో గతంలో ఇచ్చిన హామీల్లో అనేకం అపరిష్కృతంగా ఉన్నాయి. ఫలితంగా టీబీజీకేఎస్ తరఫున పోటీ చేసే ఆశావహులకు ఈ సమస్య ఇబ్బందికరంగా మారనుందనే ప్రచారం జరుగుతోంది. తాజాగా మంత్రి కేటీఆర్ జిల్లాలో పర్యటిస్తున్న దృష్ట్యా గతంలో ఇచ్చిన హామీలపై అమలుపై నిర్ణయం వెలువరిస్తారని కార్మికులు భావిస్తున్నారు. కొత్తగా ఇంకా ఏమైనా హామీలు ఇస్తారా అని కార్మికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మంత్రి నుంచి సానుకూల ప్రకటన వచ్చే అవకాశం ఉందని కార్మికవర్గంలో చర్చ జరుగుతోంది.

ఈ ఏడాది సాధారణ వర్షపాతం!

ఎల్‌నినో ప్రభావాన్ని తుడిచిపెట్టిన సానుకూల అంశాలు : ఐఎండి వెల్లడి

న్యూఢిల్లీ : నాలుగు మాసాల వర్షాకాలం ముగిసింది. భారత్‌లో దీర్ఘకాల సగటైన 868.6 మిల్లీమీటర్లుగా వుండగా, ఈ ఏడాది సాధారణ వర్షపాతం 820 మిల్లిమీటర్లుగా నమోదైంది. ఎల్‌నినో పరిస్థితులు తలెత్తే ప్రమాదం వుందని తొలుత అంచనా వేశారు కానీ కొన్ని సానుకూల అంశాలతో అది తుడిచిపెట్టుకుపోయిందని భారత వాతావరణ శాఖ శనివారం తెలిపింది. దీర్ఘకాల సగటులో 94 నుండి 106శాతం వర్షపాతాన్ని సాధారణమైనదిగా పరిగణిస్తారు.

అయితే, రుతుపవనాల సమయంలో దేశవ్యాప్తంగా సాధారణ సంచిత (క్యుములేటివ్) వర్షపాతం అంటే ప్రాదేశిక, తాత్కాలిక వర్షపాతం కాదు. వివిధ ప్రాకృతిక కారణాల వల్ల తలెత్తే అంతర్లీన ఒడిదుడుకులు, మార్పులనేవి భారతీయ రుతుపవనాల్లో సర్వసాధారణంగా వుంటాయి. దీన్నే ప్రకృతి వైవిధ్యత అంటారు. అయితే, వాతావరణ మార్పులు వర్షపాతాన్ని మరింత వైవిధ్యంగా తయారుచేస్తున్నాయని పరిశోధనల్లో వెల్లడైంది.

మహిళా బిల్లు

ఇలలో
సగమయిన మహిళ
ఇంటికే
పరిమితం కావాలా!

వంటగదిలో
గరిట తిప్పడం కాదు
ఇల్లునంతా
సగబెడుతుంది!

ఆలి అయి
ఇల్లు నేలుతుంది
తల్లి అయి
పిల్లలను లాలిస్తుంది!

సగభాగం
తను అయినపుడు
సమ భాగం
ఆమెకివ్వడం సమంజసం!

అవకాశం కల్పిస్తే
ఆకాశమంత ఎదిగి చూపిస్తది
ఆడబిడ్డ నుదుట పెట్టిన
బొట్టుబిల్ల
ఈ మహిళా బిల్లు!

ఇకపై మహిళ.....
కుక్కిన పేను కాదు
పులిపై ఎక్కిన దుర్గ!

- జగ్గయ్య.జి,
9849525802



కన్నీళ్ల ఆనకట్ట..

నీ అంతులేని వ్యధను చూసి
మనసెంతో గాయపడింది
జన జీవనస్రవంతిలో కలిశాక
నా భావోద్వేగాలు గుండె గూటిలో
భద్రంగా ఉండినాయి..

గత కొన్ని రోజుల నుండి
అవి ఘనస్థితిలోనే ఉండి
మళ్ళీ ఇవ్వాళ తమ
వాస్తవస్థితికి తిరిగిచేరుకున్నాయి..

నిను చూడలేని
కష్టకాలంలో కనుచూపుమేరలో
కన్నీళ్ల ప్రవాహం
ఉరకలెత్తి ప్రవహించింది..

కానీ చాలారోజులకు
నిను చూశాక కూడా ఎందుకో..
అవి
ఇవ్వాళ తమ ఆనకట్టను తెంపి
కిందికి దూకుతున్నాయి..

నువ్వొక్కడివే తనతో
కలిస్తే సరిపోతుందా...
మేము కూడా తనను
కలిసేవాళ్లమని నా హృదయంతో
పోట్లాడి కిందికి ధారగా దూకుతున్నాయి..

- సర్ఫరాజ్ అన్వర్
9440981198





పది రూపాయల డాక్టరమ్మ...

సమాజ సేవే పరమావధిగా భావించింది ఆ యువ వైద్యురాలు.. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని.. అని ఎదురుచూడలేదు. సంకల్పంతో ముందడుగు వేసి తన కలను సాకరం చేసుకుంటోంది. సామాజ సేవకు ఎలాంటి తారతమ్యం అవసరం లేదని గళమెత్తుతోంది. బడుగు బలహీన వర్గాలకు నాణ్యమైన వైద్యసాయమందించడమే తన కర్తవ్యమంటూ అందరి మన్ననలు పొందుతోంది పాతికేళ్ల యువ వైద్యురాలు **నూరి పర్వీన్**. పేదలకు సాయపడడంలో, సమాజసేవలో తాత ముందుండేవారని తండ్రి చెప్పిన మాటలు వింటూ పెరిగింది. పెరిగి పెద్దై తాను కూడా ఆ బాటలోనే నడుస్తోంది. అయితే ఇప్పుడు ఆమె గుర్తింపు ఆ తాత మనవరాలిగా కాదు... 10 రూపాయల వైద్యురాలుగా నూరీ పర్వీన్‌గా ఎంతోమందికి పరిచితం.

నూరీ స్వస్థలం విజయవాడ ఆటోనగర్. వన్‌టౌన్ మౌలానా ఆజాద్ ఉర్దూ స్కూలులో పదవతరగతి వరకు చదివింది. ఆ తరువాత ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ పూర్తిచేసింది. కడప ఫాతిమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఎఫ్ఐఎంఎస్)లో ఎంబిబిఎస్ సీటు రావడంతో వైద్యవిద్య పూర్తిచేసింది. కోర్సు మొదటి సంవత్సరం నుంచే ఎఫ్ఐఎంఎస్ విద్యార్థి ఆర్గనైజేషన్ ద్వారా పలు వృద్ధాశ్రమాలకు, అనాథాశ్రమాలకు వెళ్లి సేవలు చేసింది. అప్పుడే వైద్యం కోసం పేదలు పడే ఇబ్బందులు ఆమె దృష్టికి వచ్చాయి. ఎలాగైనా పేదలకు అందుబాటులో వైద్యం అందించాలన్న సంకల్పంతో కడప మాసాపేట సర్కిల్ పెద్ద దర్గా రోడ్డులో ఓ ప్రైవేట్ క్లినిక్ తెరిచింది. చాలా చిన్న క్లినిక్ అది. అక్కడికి వచ్చే రోగులకు నామమాత్రంగా పది రూపాయల ఫీజే తీసుకుంటుంది. బెడ్ అవసరమైన వారికి రూ.50, రూ.500లోపే మందులు అక్కడ లభిస్తాయి. ఐదుగురు సిబ్బందితో 24 గంటలూ పనిచేస్తోంది ఆ క్లినిక్. రోజుకు 50 మంది వరకు రోగులు ఆ క్లినిక్‌కు వస్తున్నారు. 'గది అద్దె, సిబ్బంది జీతభత్యాల కోసమే ఈ ఫీజు వసూలు చేస్తాం' అంటోంది ఆమె. అంత తక్కువ ఫీజు ఎందుకంటే 'నా లక్ష్యం డబ్బు సంపాదించడం కాదు.. సేవ చేయడం' అంటుంది ఈ యువ డాక్టరు. ఆ ప్రాంతం వారికి 10 రూపాయల డాక్టరమ్మగా ఆమె సుపరిచితురాలు. ఏడాది కాలంలోనే అంత పేరు తెచ్చుకుంది నూరీ పర్విన్.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల బెడ్ ఛార్జీలను రోజుకు ఆమె రూ.50 మాత్రమే ఛార్జ్ చేస్తోంది. ఇలా రోజుకు పర్వీన్ 50 నుంచి 60 మందికి వైద్య సేవలను అందిస్తూ కడప ప్రాంతంలో సుపరిచితురాలిగా మారింది నూరి పర్వీన్. దీంతోపాటు ఆమె ఇతర సేవ కార్యక్రమాలను కూడా ఆమె ముందుండి నడిపిస్తుంటుంది.

కోవిడ్‌కు సరిగ్గా నెల రోజుల ముందే అంటే 2020 ఫిబ్రవరి 7న క్లినిక్ ప్రారంభించింది. తన దగ్గరకు వచ్చే రోగులకు ఓ ఎంబిబిఎస్ డాక్టరుగా వీలైన చికిత్స ఇస్తూనే ఇతర వైద్య అవసరాల నిమిత్తం ప్రముఖ వైద్య నిపుణుల దగ్గరకు పంపిస్తుంది. అలా ఆమె దగ్గరకు వచ్చిన ఎంతో మంది రోగులు సకాలంలో మెరుగైన చికిత్స తీసుకుని వ్యాధి నయం చేసుకున్నారు. ఆరోగ్యవంతులుగా తిరిగివస్తున్న రోగుల ముఖాలు చూస్తుంటే ఇంత చిన్న క్లినిక్‌లో ఏమాత్రం వైద్యం అందుతుంది అని విమర్శించేవాళ్ల నోర్లు మూతపడుతున్నాయి.

ఆదర్శ కుటుంబం

నూరీ తాతగారు నూర్ మహమ్మద్. 1980లో వామపక్ష నాయకుడుగా ప్రజా సేవలో నిమగ్నమైన ఆయన నూరీ తండ్రి చిన్నప్పుడే మరణించారు. అయితే పిల్లలకు తండ్రి గొప్పతనం గురించి ఆయన తరచూ చెబుతుండేవారు. అలా తాత సేవగుణాన్ని వింటూ పెరిగిన ఆమె ఆయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకుంది. సామాన్య కుటుంబంలో ఒకరు వైద్యవిద్య అభ్యసించడమే కష్టమైన ఈ రోజుల్లో నూరీ తండ్రి తన ముగ్గురు బిడ్డలనూ వైద్య విద్యార్థులుగా తీర్చిదిద్దారు. 'తండ్రి జ్ఞాపకార్థమే నాకు ఆయన పేరు పెట్టారు' అంటుంది నూరీ. అలా ఆ తాత సేవాతత్పరత... తండ్రి క్రమ శిక్షణలో పెరిగిన నూరీ తల్లిదండ్రులు మెచ్చే బిడ్డగానే కాక... తాత పేరు నిలబెట్టిన మనవరాలిగా ఎదిగింది.



బహుముఖ ప్రజ్ఞ

చిన్నప్పటి నుంచి చదువులో ముందుండే నూర్ సాధించిన ఘనత ఆమె చదివిన స్కూలు పిల్లలకు స్ఫూర్తిమంత్రమైంది. ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు ఆమె సేవాగుణాన్ని ప్రశంసిస్తూ ఫోన్లు చేస్తుంటారు. అక్కడి విద్యార్థులు తనను కలుసుకోవాలనుకుంటున్నారని, కాని తీరిక లేని పని ఒత్తిడితో వారిని కలవలేకపోతున్నానని అంటారు నూర్. రెండు సంవత్సరాల క్రితం ఓ 20 షార్ట్‌ఫిలిమ్స్ చేశారు. వరకట్న సమస్యలు, ఆత్మహత్యలు, స్త్రీ వివక్ష వంటి వాటిపై తీసిన ఆ డాక్యుమెంటరీలను దర్శకత్వం చేయడమే కాదు, వాటిలో నటించారు నూర్. భవిష్యత్తులో పేదల కోసం ఓ మల్టీస్పెషాలిటీ హాస్పటల్ తెరవాలని, అందులో కూడా తక్కువ ఖర్చుతోనే వైద్యం అందించాలని కలలు కంటున్నారు. ఆమె కల తప్పక నెరవేరాలని మనమూ కోరుకుందాం. వైద్యం వ్యాపారమైన ఈ రోజుల్లో సేవే ప్రధానంగా సాగుతున్న ఆమె మార్గం స్ఫూర్తిదాయకం.

- మోహన్‌కృష్ణ అనంతోజు

లాక్‌డౌన్ సమయంలో ...

'లాక్‌డౌన్ కాలంలో క్షణం తీరిక లేకుండా గడిపాను. నుంచోడానికి, చివరికి మంచీనీళ్లు తాగేందుకు కూడా సమయం ఉండేది కాదు. వాస్తవానికి లాక్‌డౌన్ వల్ల క్లినిక్ ప్రారంభించిన నెలరోజులకే మూసేయాల్సి వచ్చింది. అయితే రెండు రోజులు కూడా నేను ఖాళీగా కూర్చోలేకపోయాను. అప్పటికే నాకు ఎన్నో ఫోను కాల్స్ వచ్చేవి. జ్వరం, దగ్గుతో బాధపడుతూ కోవిడ్ భయంతో ఎంతోమంది రోగులు నన్ను సంప్రదించేవారు. పెద్ద పెద్ద క్లినిక్‌ల వారు సిటీ స్కాన్ తీయించుకోమంటున్నారని, ఆర్థికంగా అంత భారం మోయలేక పోతున్నామని చెప్పేవారు. ప్రతి జ్వరమూ, దగ్గు కోవిడ్ కాదని వారికి ధైర్యం చెప్పి క్లినిక్‌లోనే మందులు ఇచ్చేదాన్ని. అను మానమున్న వారిని పరీక్షలకు పంపించే దాన్ని. అంతేగాని వైద్యం చేయడానికి నిరాకరించేదాన్ని కాదు. వైద్యవృత్తి సేవా గుణంతో నిండి ఉండాలి. ప్రతిదీ వ్యాపారమైన ఈ రోజుల్లో కొంతమంది ఈ కోవిడ్ సమయంలో లాభార్జన కోసం అధిక ఫీజులకు వైద్య పరీక్షలు, చికిత్సలు చేయడం నాకు తెలుసు. తాతయ్య స్ఫూర్తి నాపై ఉంది. పేదలకు సాయం చేయాలని చిన్నప్పటి నుంచి అమ్మ, నాన్న చెప్పేవారు. ఆ మాటలే నన్ను ఈ మార్గం వైపు నడిపించాయి. క్లినిక్ మొదలుపెట్టే సంగతి నా తల్లిదండ్రులకు మొదట చెప్పలేదు. ఎంబిబిఎస్ చదివి 10 రూపాయలకు వైద్యం చేయడమేంటని అంటారని వారికి చెప్పలేదు. కాని విషయం చెప్పగానే ఎంతో సంతోషించారు. నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఇప్పుడు నేను నూర్ మహ్మద్ మనవరాలిగా కాదు, 10 రూపాయల డాక్టరు నూర్ పర్వీన్‌గా సొంత పేరు తెచ్చుకున్నాను' అంటారు ఆమె. తన సేవకు గుర్తింపుగా పలు స్వచ్ఛంద సంస్థలు ఎన్నో అవార్డులు ఇచ్చాయి. అయితే వాటన్నిటికంటే పేదలకు సేవ చేయడమే సంతృప్తినిస్తుంది అంటుంది ఆమె.



పయనం...

విన్నాను...
ఆకలైన పేగులలో
దాగిన అలసత్వాన్ని..
పిడికెడు మట్టిలో ఆవిరైన నా మనోవేదనని....

చూస్తున్నాను...
మల్లె మొగ్గ లాంటి నా కనులలో
మెరిసే మెరుపులను
ఏ సంధ్య కిరణం కసిగా కోసేసిందని...

అడుగుతున్నాను...
ఈ కాలాన్ని...
నాలుగు చుక్కల కన్నీటితో
కడుపు నింపుకోవడం ఎలా అని...?

వెదుకుతున్నాను....
మనసు మాటున దాగిన మాటలను
ఏ మరు భూమిలో మర్మంగా దాచానని...

ఏరుతున్నాను...
ఎండిపోయిన ఊబిలో
ఎగసి ఎగసి వచ్చే
ఆశల బుడగలని...

దేహిస్తున్నాను....
దౌర్జన్యపు రాజకీయ కుట్రలో
విరిగిన మొక్కల మొండలను...
అమ్ముడు పోయిన ఒట్లెన్ని
కసాయి కత్తులుగా మారాయని...

చేరుతున్నాను...
కనిపించని కీర్తిని చేతపట్టి
నాలుగు భుజాల పై...
రారాజుగా ఊరేగుతూ...
అందరూ కన్నీటి పూలనీ వర్షంగా కురిపిస్తుంటే..
భూతల్లి ఒడిలో సేదతీరుతూ
మట్టి పాలని తాగడానికి..
మరో ప్రపంచానికి పయనమవుతున్నను.....!!

- గోపి.జి, 9052871896

నింగిలోని రంగులు

నగరాన్ని పులుముకున్న
సమావేశాలలో సక్కగా సూపుడు కాదు..
బుగులు లేని బతుకు కావాలి..



నగ్నంగా దేశాన్ని బజారున బెట్టిన
మౌనం దేనికి సంకేతం..

లౌకిక పునాదులు ఊడబెరుకడం
గాలిలో పేకమేడలే..
నీటి మీద రాతలే..
అన్ని రోజులు అందలం అసాధ్యం
అందిన కాడికి దండుకునుడు
ఏదో రోజు జైలుకు వెళ్ళడం తథ్యం.

మనిషిని మనిషిగా
మార్చే పవనాలు వీచెలా
మానవత కుసుమాలు
భరత వృక్షానికి పూసెలా
ఆ వైపుగా సట్టాలు చేసేలా
ఉండాలి మీ ఆలోచనలు...
అప్పుడే సమ్మిట్ లకు అర్థం..పరమార్థం.

- నాగరాజు మద్దెల, 6301993211

మనసు....??



ఎన్నో కలలు
కలలనే వెంటాడుతుంటే
కాలం కత్తి లా
గుచ్చుకుంటుంది...

మనసు మబ్బుల్లా
దూది పింజమ్లా తెలుతుంటే
వ్యధ భారం బరువెక్కి
చీకటి వెలుగును కమ్మేస్తుంది...

వెక్కి వెక్కి ఏడుస్తున్న కళ్లు
కన్నీళ్లు నిండుకొని
ఆనందం పోయి
హృదయం బరువెక్కి
ఎండుటాకుల రాలిపోతుంది...

స్వప్నాల్ని నిజం చెయ్యలేదని
మనసు ఆత్మహత్య కు
సిద్ధమౌతుంటే
శరీరం బెలగా నిస్తేష్టులై
కాళ్ళు పుడమిపై కూలబడుతుంటే
ఆకాశం నిండుగా కన్నీళ్లు కురిపిస్తూ
కన్నీళ్లను తన గుండెల్లో
కలుపుకుంది...

- ఎలగొండ రవి
9848770345

వేకువ రాగం

చీకటి చుట్టిన జీవన పయనంలో వెన్నెల
రెక్కలు కట్టి తలుపు తడితే..

మది నిద్దుర మరచిన కన్నుల్లోకి
ఇంద్ర ధనస్సు వచ్చి పలకరిస్తే..

చెలిమి తాకిన హృదయ రాగంలో
అనురాగపు మధురిమలు
ఆప్యాయతను అల్లుకొని..
మమతలన్నీ తీగలా చుట్టుకున్నాయి..

వెన్నెలను ఎక్కుపెట్టిన ఆ నిశి రాతిరి
అద్భుతమైన స్వప్న లోకంలో విహరింపజేసింది...
జీవితాన్ని సరికొత్తగా మార్చేసింది.
మెలుకువ రాగాలు కంటి రెప్పలని
తట్టి లేపుతూన్నాయి..!!

కలలకు ఇపుడు కొత్తగా
వెలుగు రేఖలు పూస్తున్నాయి.!!

- స్వప్న మేకల, 9052221870

